www.andhrajyothy.com

# ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHI

నిజామాబాద్ సిటీ*

వెల (Price) : Rs. 6.50

సంపుటి (Volume) : 16
సంచిక (Issue) : 178

శనివారం | 11-1-2020 | పేజీలు: 12 + 16

శ్రీవికారినామ సంవత్సరం, దక్షిణాయనం, హేమంతరుతువు, పుష్యమాసం, బహుళపక్షం; తిథి: పాడ్యమి రా.10.42 తదుపరి విదియ; నక్షత్రం: పునర్వసు మ. 1.31 తదుపరి పుష్యమి; వర్జ్యం: రా.8.57-10.26; దుర్ముహూర్తం: ఉ.6.52-8.20; అమృతఘడియలు: ఉ.11.14-12.45, తె.5.52 మొదలు; రాహుకాలం: ఉ.9.00-10.30; సూర్యోదయం: 6.52; సూర్యాస్తమయం: 5.54

Nizamabad | Hyderabad | Mahaboobnagar | Vijayawada | Tirupathi | Visakhapatnam | Anantapur | Karimnagar | Tadepalligudem | Warangal | Guntur | Kurnool | Nellore | Srikakulam | Rajamahendravaram | Khammam | Kadapa | Ongole | Nallagonda | Bangalore and Chennai

పాతబస్తీలో ర్యాలీ దృశ్యం

### సీపఏ, ఎన్ఆర్సీ, ఎన్పీఆర్‌లను రద్దు చేసేదాకా

# పోరాటం ఆగదు

ప్రజాస్వామ్య, రాజ్యాంగ పరిరక్షణకు కలిసి రండి

అంబేడ్కర్ రాజ్యాంగం ప్రకారమే పాలన జరగాలి

సీఏఏ హిందూ-ముస్లింలకు ప్రమాదకరం

25 అర్ధరాత్రి చార్మినార్ వద్ద భారీ సభ: అసదుద్దీన్

పాతబస్తీ త్రివర్ణ శోభితం.. భారీగా తిరంగా ర్యాలీ

ర్యాలీ వీడియో తీయాలని హైకోర్టు ఆదేశం

దేశవ్యాప్తంగా అమల్లోకి వచ్చిన సీపఏ 10

హైదరాబాద్ జనవరి 10 (ఆంధ్రజ్యోతి): మతవిద్వేషాలు రెచ్చగొట్టే ప్రయత్నంతో కేంద్ర ప్రభుత్వం తీసుకువచ్చిన పౌరసత్వ సవరణ చట్టం (సీఏఏ), జాతీయ పౌర జాబితా (ఎన్ఆర్సీ), జాతీయ జనాభా జాబితా (ఎన్పీఆర్)లను పూర్తిగా రద్దు చేసే వరకూ తమ పోరాటం సాగుతుందని హైదరాబాద్ ఎంపీ అసదుద్దీన్ ఒవైసీ అన్నారు. దేశ ప్రజల మనోభావాలను అర్థం చేసుకుని ఇప్పటికైనా రాజ్యాంగ వ్యతిరేక, ప్రజావ్యతిరేక సీఏఏ, ఎన్ఆర్సీ, ఎన్పీఆర్‌లను

మిగతా 10వ పేజీలో...

# 2 గంటలు కోర్టులో జగన్!

**సీబీఐ ప్రత్యేక కోర్టుకు హాజరైన ఏపీ సీఎం**

**తలుపులు మూసి రహస్య విచారణ**

**సీఎంగా బిజీగా ఉన్నా.. రాలేను: జగన్**

10

**ఇది తీవ్రమైన ఆర్థిక నేరం..**
**విచారణకు జగనే హాజరు కావాలి**

**సీబీఐ కోర్టులో ఈడీ వాదనలు**

**తదుపరి విచారణ 24కు వాయిదా**

**'పెన్నా' కేసులో మంత్రి సబితకు సమన్లు**

**17న కోర్టులో హాజరు కావాలని ఆదేశం**

# బాబోయ్.. ఇదేం దుంకుడు!

### ఓ పార్టీ నుంచి నామినేషన్ వేశాక మరో పార్టీలోకి

**మునిసిపల్ ఎన్నికల్లో జోరుగా జంపింగ్‌లు**

**టికెట్లు రాక అటూ ఇటూ మారుతున్న నేతలు**

**2, 3 పార్టీల నుంచి కొందరి నామినేషన్లు**

**టీఆర్ఎస్‌కే ఎక్కువ బెడద**

హైదరాబాద్, జనవరి 10 (ఆంధ్రజ్యోతి): 'ఇప్పుడు కాకపోతే మళ్లీ ఎప్పుడో! ఈ పార్టీ కాకపోతే మరో పార్టీ. ఏది ఏమైనా పోటీ చేయడమే ముఖ్యం' ఇదీ మునిసిపల్ ఎన్నికల్లో పోటీకి సంబంధించి వివిధ పార్టీల నేతల్లో నెలకొన్న అభిప్రాయం. దీంతో అభ్యర్థిత్వంపై పార్టీ నాయకత్వం నుంచి హామీ లేకపోయినా నామినేషన్ వేసేశారు. సొంత పార్టీ నుంచి టికెట్ దక్కదని తెలియడంతో కండువా మార్చేశారు. మరో పార్టీ నుంచి కూడా నామినేషన్ దాఖలు చేశారు. చివరికి ఏ పార్టీ టికెట్ దక్కితే ఆ పార్టీ బీ ఫారాన్ని సమర్పించేందుకూ సిద్ధమయ్యారు. ఇలా ఒక్కొక్కరు రెండు మూడు నామినేషన్లు కూడా వేశారు. రాత్రికి రాత్రే పార్టీ మారుతున్నారు. పరిషత్ ఎన్నికలను స్వీప్ చేసిన అధికార టీఆర్ఎస్సే ఈ తలనొప్పులను ఎక్కువగా ఎదుర్కొంటోంది. పలు చోట్ల కాంగ్రెస్‌కు సైతం ఈ సమస్య ఎదురవుతోంది. అయితే టీఆర్ఎస్ నుంచి గోడ దూకేవారు ఎక్కువగా కాంగ్రెస్, బీజేపీలనే ఎంచుకుంటున్నారు. అదీ కుదరకుంటే స్వతంత్ర అభ్యర్థులుగా అదృష్టాన్ని పరీక్షించుకునేందుకు సిద్ధపడుతున్నారు. కామారెడ్డి

మిగతా 9వ పేజీలో...

**సేమ్ ప్లేస్.. సేమ్ డ్రెస్.. పార్టీయే మారింది..!**

కామారెడ్డిలో టీఆర్ఎస్ తరఫున నామినేషన్ వేసి.. ఆ పార్టీ టికెట్ రాదని మర్నాడు కాంగ్రెస్ నుంచి నామినేషన్ వేసిన ఎల్లంకి శ్రీనివాస్

**21,850 నామినేషన్లు**

**కారుకు 4 వార్డులు ఏకగ్రీవం?**

# ఆదమరిస్తే అంతే సంగతులు

9

కాంగ్రెస్, బీజేపీ బలంగా ఉన్న చోట్ల గట్టి పోటీ

రెబెల్స్ కూడా ఉంటే ఓడిపోయే ప్రమాదం

టీఆర్ఎస్ అంతర్గత సర్వేల్లో తేలింది ఇదే!

అందుకే తిరుగుబాట్లపై అధిష్ఠానం కలవరం

**ఉదయం రేవంత్‌రెడ్డితో..**



**మధ్యాహ్నం మల్లారెడ్డితో..**

శుక్రవారం ఉదయం రేవంత్‌రెడ్డి సమక్షంలో కాంగ్రెస్‌లో చేరిన పీర్జాదిగూడ టీఆర్ఎస్ నేత దర్గా దయాకర్‌రెడ్డి. మధ్యాహ్నం తన నివాసానికి వచ్చిన మంత్రి మల్లారెడ్డితో భేటీ.

# ఇంటర్నెట్ ప్రాథమిక హక్కు

"ప్రభుత్వాలు అన్ని వేళలా పత్రికా స్వేచ్ఛను గౌరవించాలి. జర్నలిస్టుల్ని రిపోర్టింగ్ చేసుకోనివ్వాలి. పత్రికల నెత్తిన నిరవధికంగా కత్తి వేలాడకూడదు..." - సుప్రీంకోర్టు

**నిరవధిక నిలిపివేత సమ్మతించం**

**144వ సెక్షన్‌తో ప్రజాస్వామ్య హక్కుల్ని నియంత్రించరాదు**

**ఎల్లకాలం భావస్వేచ్ఛను అడ్డుకోరాదు**

**పత్రికా స్వేచ్ఛను సర్కార్లు గౌరవించాలి**

**వారంలోగా అన్ని నిషేధాజ్ఞలపై సమీక్ష**

**కశ్మీర్‌లో షట్‌డౌన్‌పై సుప్రీం ఆదేశాలు**

**అత్యవసర సేవలకు తక్షణ పునరుద్ధరణ**



"సెక్షన్ 144తో ప్రజల ప్రజాస్వామిక హక్కులను, చట్టబద్ధమైన భావాల వ్యక్తీకరణను, బాధల వెల్లడిని నియంత్రించరాదు. ప్రజా భద్రతకు ముప్పు వాటిల్లుతుందని తగిన ఆధారాలుంటే తప్ప... ప్రజలు విభేదిస్తున్నారన్న కారణంతో సెక్షన్ 144 విధింపు సరికాదు".

- జస్టిస్ ఎన్వీ రమణ



న్యూఢిల్లీ, జనవరి 10 (ఆంధ్రజ్యోతి) : ఇంటర్నెట్ సౌకర్యం అందుబాటు అనేది రాజ్యాంగంలోని 19వ అధికరణం ప్రకారం ప్రాథమిక హక్కుల్లో ఒకటని సుప్రీంకోర్టు స్పష్టం చేసింది. జమ్మూ కశ్మీర్‌లో ఇంటర్నెట్ సేవలను పునరుద్ధరించే అంశంపై వెంటనే సమీక్షించాలని కేంద్ర ప్రభుత్వానికి సంచలన ఆదేశాలు జారీ చేసింది. కశ్మీర్‌లో నిరుడు ఆగస్టు 5న ఆర్టికల్ 370ని నిర్వీర్యం చేశాక ఇంటర్నెట్‌ను మొత్తం రాష్ట్రమంతా నిలిపేసిన సంగతి తెలిసిందే. ప్రపంచ ప్రజాస్వామ్య చరిత్రలో అతి ఎక్కువ కాలం (155 రోజులకు పైగా) ఇంటర్నెట్ సదుపాయం బంద్ అయిన అప్రదిష్ట మూటగట్టుకున్న కశ్మీర్ షట్‌డౌన్‌ను, సెక్షన్ 144 ఇతర నిషేధాజ్ఞలను సవాల్ చేస్తూ వివిధ రాజకీయ పక్షాలు, జర్నలిస్టులు, ప్రజా సంఘాలు అనేక పిటిషన్లు వేశాయి. వీటిపై సుదీర్ఘ విచారణ అనంతరం సుప్రీం కోర్టు శుక్రవారంనాడు తీర్పు వెలువరించింది.

"భావ ప్రకటన స్వేచ్ఛను, వాక్ స్వాతంత్ర్యపు హక్కును, భిన్నమైన అభిప్రాయాలను వెల్లడించే హక్కును సెక్షన్ 144 కింద ఎల్లకాలం అణచివేయడం సరికాదు. ప్రజల చట్టబద్ధ హక్కులు, ప్రజాస్వామ్య హక్కులను ఆ సెక్షన్ కింద అడ్డుకోరాదు. ఇక ఇంటర్నెట్ ద్వారా వాక్ స్వాతంత్ర్యం, భావ స్వేచ్ఛ రాజ్యాంగంలోని ఆర్టికల్ 19(1) (ఎ)లో అంతర్భాగం. ఆర్టికల్ 19 (2), 19 (6)కు లోబడి పరిమితులు విధించవచ్చు. కానీ ఎల్లకాలం కాదు. ఇంటర్నెట్ అనేది

మిగతా 12వ పేజీలో...

**నాలుగున్నరేళ్లకే ఫీజులు** ఎంబీబీఎస్‌లో ఐదేళ్లకు ఫీజులు సరికాదు! టీఏఎఫ్ఆర్సీ తీరును తప్పుబట్టిన హైకోర్టు

3

**ఐఐటీల్లో ఎగ్జిట్ ఆప్షన్!** మూడేళ్లకే మానేస్తే 'బీఎస్సీ ఇంజనీరింగ్' పట్టా డ్రాపౌట్ల సంఖ్య తగ్గించడమే లక్ష్యంగా చర్యలు

హారతి

# నమ్మించి గొంతు కోశాడు

**వరంగల్‌లో ప్రేమోన్మాది ఘాతుకం**

**గదికి రప్పించి యువతిని హత్య చేసిన కిరాతకుడు**

**తనకు దక్కకుండా పోతోందన్న కోపమే కారణం**

**హత్యానంతరం నేరుగా సెంట్రల్ జైలుకు నిందితుడు**

**జైలు సిబ్బంది సూచనతో స్టేషన్‌లో లొంగుబాటు**

2

నిందితుడు షాహిద్

మద్యం తాగించి..
**మోడల్‌పై అత్యాచారం**

**వీడియో చిత్రీకరణ**

**ఆపై హత్యకు యత్నం**

**హైదరాబాద్‌లో ఘటన**

**నిందితుడు మైనర్?**

2

పరంజ్యోతి

## ఏక, రూప నామారాధన ఉత్తమం

**భ**గవంతుడు అనేక రూపాలలో, అనేక నామాలతో భక్తులచే ఆరాధింపబడుతున్నాడు. అన్ని నామములు, అన్ని రూపములు ఆయనవే. సకల మంత్ర, త్రంత స్వరూపుడు, సమస్త విశ్వానికి అధిపతి ఆయనే. అందులో సందేహం లేదు. ఆయన తప్ప సకల చరాచర జగత్తులో మరేదీ స్థిరమైనది కాదు. అందుకే.. అనంత నామధేయాయ, సర్వాకార విధాయనే సమస్త మంత్ర వాచ్యాయ, విశ్వైక పతయేనమః అంటూ సర్వేశ్వరుణ్ణి ప్రార్థిస్తుంటాం. అయితే, అన్ని రూప,నామములు ఆయనవే అయినా.. భక్తులు తమకు ప్రియమైన ఒక రూపాన్ని, ఒక నామాన్ని ఎంపిక చేసుకొని ప్రగాఢ విశ్వాసంతో భక్తి శ్రద్ధలతో ఆరాధించడం మంచిది. ఏకోన్ముఖం చేయటం వల్ల భక్తి యొక్క గాఢత, తీవ్రత, సాంద్రత పెరుగుతాయి. భక్తులు మైమరచి దైవారాధన చేయగల స్థితి సంప్రాప్తిస్తుంది. ఫలితం సత్వరంగా అందుతుంది. భూతద్దంపై సూర్యకిరణాలు ప్రసరించేలా చేసి, ఆ వెలుగు ఒక కాగితంపై కేంద్రీకృతం చేస్తే వెలుగుచే ఉష్ణం జనించి కాగితం దగ్ధమయ్యే స్థితి వస్తుంది. సూర్యకాంతి కేంద్రీకృతం కావడం వల్లనే ఇలా జరుగుతుంది. కొంతమంది వారంలో ఒక్కోరోజునూ ఒక్కో దేవుడికి కేటాయిస్తారు. సోమవారం శివారాధన, మంగళవారం ఆంజనేయ స్వామికి ఆకుపూజ, గురువారం సాయిబాబా గుడికి వెళ్లడం, శుక్రవారం అమ్మవారి ఆలయానికి, శనివారం వేంకటేశ్వర స్వామి కోవెలకు వెళ్లి దర్శనం చేసుకోవటం వంటివి చేస్తుంటారు. అన్ని రూప నామములూ శక్తిమంతమైనవే అయినా మనకున్న కొద్దిపాటి కాలాన్ని, శక్తిని, భక్తిని ఇలా అనేక దైవరూపనామాల మధ్య పంచడం సరియైన విధానం కాదు. ఈ సందర్భంగా శ్రీ సత్యసాయిబాబా వారు చెప్పిన సూక్తి స్మరణీయంగా ఉంటుంది.

పట్టినదేదియో పట్టనే పట్టితివి- పట్టునెగ్గుడు దాకా అట్టి ఉండు
కోరినదేదియో కోరనే కోరితివి- కోర్కె చెల్లెడిదాక కొలచియుండు
అడిగినదేదియో అడగనే అడిగితివి- అడిగినదిడుదాక అట్టి ఉండు
తలచినదేదియో తలచనే తలచితివి
- తలపు తీరెడుదాకా తలరకుండు
పోరుపడలేక తానైన బ్రోవవలయు
- ఒడలుతెలియ నీవైన ఉడుగవలయు
అంతియెగాని మధ్యలో మరలిపోవుట
- భక్తుని లక్షణముగాదు

చిరస్మరణీయులైన అనేక మంది మహా భక్తుల చరిత్రను పరిశీలించినా ఒకే రూపనామాన్ని అంటిపెట్టుకొని ఉండి జన్మ సాఫల్యం చేసికొనటం మనకు కన్పిస్తుంది. రోమ రోమానా రామనామాన్ని పలికించిన ఆంజనేయస్వామి చిరంజీవియై, తానే దైవం స్థాయికి ఎదిగి లోకానికి పూజనీయుడైనాడు. కలియుగంలో కూడా త్యాగయ్య, అన్నమయ్య, క్షేత్రయ్య, రామదాసు, జ్ఞానదేవ్, నామదేవ్, చైతన్యమహాప్రభు, గోరాకుంభార్, సక్కుబాయి, మీరాబాయి వంటి మహాభక్తులు ఒకే రూపనామాలను ఆరాధించి ధన్యజీవులైనారు. కనుకమంతా మనకు ప్రీతిపాత్ర రూప నామాన్ని ఎంపిక చేసికొని అనునిత్యం చింతిస్తూ, ప్రార్థిస్తూ, పూజిస్తూ, ధ్యానిస్తూ ధన్యులమవుదాం.

**- మాదిరాజు రామచంద్రరావు, 9393324940**

## లోకం తీరు

# నమ్మించి గొంతు కోశాడు

## వరంగల్‌లో ప్రేమోన్మాది ఘాతుకం.. గదికి రప్పించి యువతిని హత్య చేసిన కిరాతకుడు

వరంగల్ అర్బన్ క్రైం, జనవరి 10: మనసిచ్చింది. మనస్ఫూర్తిగా నమ్మింది. అతణ్ని నమ్మి.. రమ్మన్న చోటుకు ఒంటరిగా వెళ్లింది! అంతగా ప్రేమించినవాడే.. అనుమానంతో ఆ యువతి పాలిట కాలయముడిగా మారాడు. ప్రేమగా మాట్లాడి ఒంటరిగా తన గదికి రప్పించుకుని.. అత్యంత పాశవికంగా గొంతు కోసి ఆమె ప్రాణాలు తీశాడు!! వరంగల్ నగరంలో శుక్రవారం జరిగిన దారుణమిది. హన్మకొండ లష్కర్ సింగారం చైతన్యపురి కాలనీకి చెందిన చెందిన మునిగాల ప్రతాప్, రేణుక దంపతుల కుమార్తె హారతి (26). ఆమె హన్మకొండ మాస్టార్జీ కళాశాలలో ఎమ్మెస్సీ పూర్తి చేసింది. కాజీపేట విష్ణుపురికాలనీకి చెందిన ఎండీ రజాక్ కుమారుడు షాహిద్.. హారతితో కలిసి మాస్టార్జీ కళాశాలలో చదువుకున్నాడు. ఇద్దరికీ డిగ్రీ నుంచి పరిచయం. షాహిద్ బీఎస్సీతో చదువు ఆపేయగా.. హారతి చదువు కొనసాగించింది. కొద్దిరోజుల తర్వాత వీరి స్నేహం ప్రేమగా మారింది. అయితే.. ఇటీవల కాలంలో హారతి మరో యువకుడితో స్నేహంగా ఉంటుండటాన్ని షాహిద్ జీర్ణించుకోలేకపోయాడు. ఈ విషయమై ఇద్దరి మధ్య పలుమార్లు గొడవలు జరిగాయి. దీనికితోడు.. హారతికి సంక్రాంతి తర్వాత వివాహం చేసేందుకు సంబంధాలు చూస్తున్నట్టు అతడికి తెలిసింది. దీంతో.. తనకు దక్కనిది మరెవరికీ దక్కకూడదనుకున్నాడు. కడుపులో ఎంత విషం ఉన్నా.. పైకి ప్రేమ నటిస్తూ ప్లాన్ ప్రకారం మళ్లీ ఆమెకు దగ్గరయ్యాడు. శుక్రవారం హారతికి ఫోన్ చేసిన షాహిద్.. రాంనగర్‌లోని క్రాంతినగర్ కాలనీలో తాను అద్దెకు ఉంటున్న గదికి రావాలని, ఇద్దరం మాట్లాడుకుందామని చెప్పాడు. మధ్యాహ్నం 12 గంటల వేళ హారతి రాగా... ఇద్దరూ గదిలో చాలాసేపు మాట్లాడుకున్నారు. 3 గంటల ప్రాంతంలో షాహిద్ హారతిపై దాడి చేశాడు. తన వెంట తెచ్చుకున్న కత్తితో ఆమె గొంతు కోశాడు. అనంతరం గదికి తాళం వేసి బయటకు వెళ్లిపోయాడు. తీవ్ర రక్తస్రావంతో హారతి అక్కడికక్కడే మృతి చెందింది.

మృతురాలి తల్లిని ఓదార్చుతున్న మంత్రి ఎర్రబెల్లి, చీఫ్‌విప్ వినయ్‌భాస్కర్; సీపీకి నమస్కరిస్తున్న మృతురాలి తండ్రి

### పలు కోణాల్లో దర్యాప్తు..

యువతి హత్య విషయం తెలిసిన వెంటనే సీపీ రవీందర్, హన్మకొండ ఏసీపీ జితేందర్‌రెడ్డి అక్కడికి చేరుకున్నారు. సీపీ ఆదేశాల మేరకు క్లూస్ టీం రంగంలోకి దిగి.. రెండున్నర గంటలపాటు ఆధారాలు సేకరించింది. కాగా.. హారతిని అతడొక్కడే హత్య చేశాడా? అతడికి మరెవరైనా సహకరించారా? కత్తితో గొంతు కోసే ముందు ఏమైనా మత్తు పదార్థం ఇచ్చాడా? అనే కోణాల్లో పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. అన్ని కోణాల్లో కేసును దర్యాప్తు చేస్తామని వరంగల్ సీపీ రవీందర్ తెలిపారు.

### దురదృష్టకర సంఘటన..

ఇలాంటి ఘటనలు జరగడం దురదృష్టకరమని మంత్రి ఎర్రబెల్లి, చీఫ్ విప్ వినయభాస్కర్ అన్నారు. హారతి తల్లిదండ్రులను వారు ఓదార్చారు. నిందితుడిని కఠినంగా శిక్షించేలా ప్రభుత్వం తరఫున చర్యలు తీసుకుంటామన్నారు.

### నేరుగా సెంట్రల్ జైలుకు..

హత్యానంతరం షాహిద్ నేరుగా సెంట్రల్‌జైలు వద్దకు వెళ్లి తానొక యువతిని హత్య చేశానని, లొంగిపోతానని, జైలులో పెట్టాలని సెంట్రీ గేటు వద్ద ఉన్న సిబ్బందికి తెలిపాడు. వారు సంబంధిత పోలీస్‌స్టేషన్‌కు వెళ్లాలని చెప్పారు. షాహిద్ హన్మకొండలో ఓ న్యాయవాదిని కలువగా.. పోలీస్‌స్టేషన్‌లో లొంగిపోవాలని ఆయన కూడా సూచించారు. దీంతో సాయంత్రం 5 గంటలకు సుబేదారి పోలీసు స్టేషన్‌కు వెళ్లి లొంగిపోయాడు. అక్కడి పోలీసులు ఘటనా స్థలికి చేరుకుని నిందితుడి వద్ద ఉన్న తాళంచెవితో తాళం తీసి చూడగా హారతి రక్తపుమడుగులో విగతజీవిగా కనిపించింది. షాహిద్ తండ్రి కాజీపేటలో మటన్ షాపు నడుపుతున్నాడు. ఆ దుకాణంలో ఉపయోగించే పదునైన కత్తిని షాహిద్ ఉపయోగించినట్లు పోలీసులు అనుమానిస్తున్నారు. హారతి గొంతు కోసి గదిలో ఉంచి తాళం వేయడంతో కనీసం ఆమె అరుపులు వినిపించే అవకాశం చుట్టు పక్కల వారికి లేకుండా పోయింది. వెంటనే ఆస్పత్రికి తరలించినా ఆమె ప్రాణాలు దక్కే అవకాశం ఉండేదని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

### ఆ కుటుంబాన్ని వెంటాడుతున్న మృత్యువు

హతురాలు హారతి కుటుంబాన్ని మృత్యువు వెంటాడుతోంది. ఆమె తండ్రి వరంగల్ పాలిటెక్నిక్ కళాశాలలో అటెండర్‌గా ఉద్యోగం చేస్తున్నాడు. ఆయనకు హారతి కాక.. ప్రసన్న అనే కుమార్తె, ప్రణీత్ అనే కుమారుడు ఉన్నారు. ప్రసన్నకు పెళ్లి అయింది. ప్రణీత్ 2016 జూలై2న రైలు కింద పడి ఆత్మహత్య చేసుకున్నాడు. అదే సంవత్సరం హారతి తాత, నానమ్మలు సైతం గంట వ్యవధిలోనే మృతి చెందారు. ఇపుడు హారతి నమ్మిన వాడి చేతిలోనే హత్యకు గురైంది. ఇలా రెండున్నరేళ్ల వ్యవధిలో నలుగురు సభ్యులను కోల్పోయిన ఆ కుటుంబం విషాదంతో కన్నీరుమున్నీరవుతోంది.

## 'కొమురవెల్లి' ఆలయ అనువంశిక అర్చకుడు మృతి

మహదేవుని మల్లయ్య (ఫైల్)

చేర్యాల, జనవరి 10: సిద్దిపేట జిల్లాలోని ప్రముఖ శైవక్షేత్రం కొమురవెల్లి మల్లికార్జునస్వామి దేవాలయ అనువంశిక అర్చకుడు మహదేవుని మల్లయ్య(80) శుక్రవారం మృతి చెందారు. మల్లన్న ఆలయ ఈవో టంకశాల వెంకటేశ్, ఏఈవో రావుల సుదర్శనం, సూపరింటెండెంట్ నీల శేఖర్, ప్రధాన అర్చకుడు మహదేవుని మల్లికార్జున్, అర్చక సంఘం అధ్యక్షుడు పడిగన్నగారి ఆంజనేయులు తదితరులు సంతాపం వ్యక్తం చేశారు.

## 'దిశ' నిందితుల ఎన్‌కౌంటర్‌పై విచారణకు 'సుప్రీం' విధివిధానాలు

న్యూఢిల్లీ, జనవరి 10(ఆంధ్రజ్యోతి): 'దిశ' కేసులో నిందితుల ఎన్‌కౌంటర్‌పై దర్యాప్తునకు ఏర్పాటైన త్రిసభ్య కమిషన్ కోసం విధివిధానాలను రూపొందిస్తున్నామని సుప్రీంకోర్టు తెలిపింది. ఇది బూటకపు ఎన్‌కౌంటర్ అంటూ న్యాయవాదులు జీఎస్ మణి, ఎంఎల్ శర్మ దాఖలు చేసిన వ్యాజ్యాలను శుక్రవారం సీజే బోబ్డే నేతృత్వంలోని ధర్మాసనం విచారణ చేపట్టింది. ఇప్పటికే తాము కమిషన్‌ను నియమించిన సంగతిని గుర్తు చేసింది. మీడియా ప్రసారాలపై ప్రెస్ కౌన్సిల్ ఆఫ్ ఇండియాకు ఇచ్చిన నోటీసుల గురించి న్యాయవాది శర్మ ప్రస్తావించగా...మీడియాకు భావప్రకటనా స్వేచ్ఛ ఉంటుందని ధర్మాసనం వ్యాఖ్యానించింది. తదుపరి విచారణను రెండు వారాలపాటు వాయిదా వేసింది. దిశపై గ్యాంగ్ రేప్, సజీవదహనం కేసులో నలుగురు నిందితులు షాద్‌నగర్ సమీపాన చటాన్‌పల్లి ఎన్‌కౌంటర్‌లో మరణించిన సంగతి తెలిసిందే.

## స్తంభానికి కట్టేసి.. చెప్పులతో కొట్టి..

**పాలం గొడవతో మహిళపై ఏడుగురి దాష్టీకం**

**నిందితుల్లో నలుగురు మహిళలు.. సిద్దిపేటలో ఘటన**

కోహెడ, జనవరి 10: పొలానికి వెళ్లే విషయమై ఓ మహిళకు, మరో నలుగురికి మధ్య గొడవ తలెత్తింది. మాటామాటా పెరిగింది. నలుగురూ తమ భర్తలకు ఈ విషయాన్ని చెప్పారు. వారు ఆ మహిళను లాక్కెళ్లి ఊర్లో స్తంభానికి కట్టేశారు. చెప్పులతో కొట్టారు. ఈ ఘటన సిద్దిపేట జిల్లా కోహెడ మండలం పోరెడ్డిపల్లితండాలో జరిగింది. లక్ష్మీపూర్ గ్రామానికి చెందిన హంస, జ్యోతి, స్వరూప, రమకు పోరెడ్డిపల్లిలో వ్యవసాయ భూములు ఉన్నాయి. తండాకు చెందిన బాధితురాలు గుగులోత్ జ్యోతికి, వీరికి మధ్య పొలానికి వెళ్లే విషయంలో తరచూ గొడవలు జరుగుతున్నాయి. ఈ క్రమంలోనే శుక్రవారం జ్యోతిని లక్ష్మీపూర్ తీసుకెళ్లి.. స్తంభానికి కట్టేసి కొట్టారు. గ్రామస్థులు 100కు ఫోన్ చేయడంతో కోహెడ ఎస్సై అక్కడకు చేరుకుని ఆమెను విడిపించి.. పోలీస్‌స్టేషన్‌కు తరలించారు.

## ఘంటా చక్రపాణికి పితృవియోగం

- సంతాపం తెలిపిన మంత్రులు కేటీఆర్, హరీశ్, సత్యవతి, నిరంజన్
- నివాళులర్పించిన 'ఆంధ్రజ్యోతి' ఎడిటర్ కె.శ్రీనివాస్, అధికారులు



ఎలిగేడు/పంజాగుట్ట/హైదరాబాద్, జనవరి 10 (ఆంధ్రజ్యోతి) : తెలంగాణ రాష్ట్ర పబ్లిక్ సర్వీస్ కమిషన్ చైర్మన్ ఘంటా చక్రపాణి తండ్రి మొగిలయ్య(86) మృతి చెందారు. కొంతకాలంగా అనారోగ్యంతో ఆయన బాధపడుతుండగా, గత నెల 28న కుటుంబసభ్యులు నిమ్స్ ఆస్పత్రిలో చేర్పించారు. పరిస్థితి విషమించడంతో శుక్రవారం ఉదయం ఆయన తుదిశ్వాస విడిచారు. ఘంటా మొగిలయ్య మృతికి మంత్రులు కేటీఆర్, హరీశ్, నిరంజన్‌రెడ్డి, సత్యవతి రాథోడ్ సంతాపం తెలిపారు. ఘంటా చక్రపాణిని హరీశ్ ఫోన్‌లో పరామర్శించారు. విషయం తెలుసుకున్న మంత్రి జగదీశ్‌రెడ్డి, టీఎస్‌పీఎస్సీ సభ్యుడు విఠల్, 'ఆంధ్రజ్యోతి' సంపాదకుడు కె.శ్రీనివాస్, సీనియర్ పాత్రికేయులు వి.శ్రీనివాస్, ప్రొఫెసర్ లింబాద్రి, రాచకొండ అదనపు సీపీ సుధీర్‌బాబు, టీఎస్‌పీఎస్సీ కార్యదర్శి, అధికారులు నిమ్స్‌కు వచ్చి నివాళులర్పించారు. అనంతరం మొగిలయ్య భౌతికకాయాన్ని కరీంనగర్‌కు తరలించారు. శనివారం అంత్యక్రియలు నిర్వహించనున్నట్లు కుటుంబసభ్యులు తెలిపారు.

## చిరుత సంచారంతో పరీక్షల వాయిదా

- తెలంగాణ వర్సిటీలో కలకలం

చిరుత కోసం గాలిస్తున్న అటవీ సిబ్బంది

డిచ్‌పల్లి, జనవరి 10: నిజామాబాద్ జిల్లా తెలంగాణ విశ్వవిద్యాలయంలో గురువారం అర్ధరాత్రి చిరుతపులి సంచారం కలకలం రేపింది. బాలుర వసతి గృహం వద్ద చిరుత సంచరిస్తున్న దృశ్యాన్ని వర్సిటీకి చెందిన స్వామి అనే విద్యార్థి చూసి రిజిస్ట్రార్ నసీమ్‌కు శుక్రవారం తెలిపాడు. దీంతో రిజిస్ట్రార్ వెంటనే అధ్యాపకులను, విద్యార్థులను అప్రమత్తం చేశారు. ఈ విషయమై పోలీసులకు, అటవీశాఖ అధికారులకు సమాచారం అందించగా.. వారు వర్సిటీ పరిసర ప్రాంతాల్లో చిరుత అడుగుజాడలు, వెంట్రుకల కోసం తనిఖీలు చేపట్టారు. విద్యార్థులు భయాందోళనకు గురికావడంతో.. శని, ఆదివారాల్లో జరిగే పరీక్షలను వాయిదా వేసినట్లు రిజిస్ట్రార్ నసీమ్ ప్రకటించారు.

ఆలయాల ప్రత్యేకతలపై సావనీర్ విడుదల చేస్తున్న ఇన్‌ట్యాక్ కన్వీనర్ అనురాధారెడ్డి, తదితరులు

## తెలంగాణ ఆలయాలు.. దేశంలోనే ప్రత్యేకం

- నిర్మాణ శైలిలో వివిధ రాష్ట్రాల సంస్కృతులు
- ఇన్‌ట్యాక్ తెలంగాణ కన్వీనర్ అనురాధారెడ్డి

హైదరాబాద్, జనవరి 10 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ ఆలయాలు దేశంలోనే ప్రత్యేకమని, ఇతర రాష్ట్రాల్లోని నిర్మాణశైలి సైతం ఇక్కడ కనిపిస్తుందని ఇన్‌ట్యాక్ తెలంగాణ కన్వీనర్ అనురాధారెడ్డి తెలిపారు. రాష్ట్రంలోని ఆలంపూర్ నవబ్రహ్మ ఆలయాలు, పాలంపేటలోని రామప్ప ఆలయంతోపాటు వివిధ ప్రాంతాల్లోని 120 పురాతన ఆలయాల నిర్మాణ శైలి అత్యంత అరుదైనదని పేర్కొన్నారు. 'హిందూ ఆలయాలు-నిర్మాణ శైలి' అంశంపై రెండు రోజుల జాతీయ సదస్సు బేగంపేటలో నిజామియా అబ్జర్వేటరీ క్యాంపస్‌లో శుక్రవారంప్రారంభమైంది. ముఖ్య అతిథులుగా ఇన్‌ట్యాక్ తెలంగాణ కన్వీనర్ అనురాధారెడ్డి, ఆర్కిటెక్ట్‌లు జీవన్‌జీ సూర్యనారాయణ మూర్తి, ఎన్వీ అంచూని, ప్రొఫెసర్ జయరామ్ పోద్వాల్, సీహెచ్.శ్రీనివాస్ పాల్గొని ప్రసంగించారు. ఈ సందర్భంగా అనురాధారెడ్డి మాట్లాడుతూ ఆలంపూర్‌లో నిర్మించిన 7వ శతాబ్దంలో నవబ్రహ్మ ఆలయాలు దేశంలోనే అత్యంత పురాతనమైనవని చెప్పారు. ఇక్కడి నిర్మాణ శైలి వివిధ రాష్ట్రాల్లోని ఆలయాలను పోలి ఉంటుందన్నారు. ఇది తెలంగాణ ఆలయాల్లో మాత్రమే కనిపించే అరుదైన ప్రత్యేకతని వివరించారు. శిథిలావస్థలో ఉన్న ఆలయాలను కూల్చివేయకుండా, మరమ్మతులు చేసి కాపాడాలని ప్రభుత్వాన్ని కోరారు. సదస్సులో సురేష్, శ్రీదేవి, పరిశోధకులు పాల్గొన్నారు.

## మద్యం తాగించి.. మోడల్‌పై అత్యాచారం

**స్మార్ట్‌ఫోన్‌లో వీడియో చిత్రీకరణ.. ఆపై హత్య చేసేందుకు ప్రయత్నం**

- నిందితుడు 17 ఏళ్ల మైనర్
- హైదరాబాద్ బంజారాహిల్స్‌లో ఘటన
- కేసు దర్యాప్తులో పోలీసుల నిర్లక్ష్యం..?

బంజారాహిల్స్/హైదరాబాద్, జనవరి 10 (ఆంధ్రజ్యోతి): దిశ ఉదంతం మరువక ముందే.. హైదరాబాద్‌లో మరో దారుణం చోటుచేసుకుంది. 17 ఏళ్ల వయసున్న ఓ కామాంధుడు వర్ధమాన మోడల్‌కు బలవంతంగా మద్యం తాగించి, ఆమెపై అత్యాచారానికి పాల్పడ్డాడు. అంతటితో ఆగకుండా.. ఆ ఘటనను తన మిత్రుడితో స్మార్ట్‌ఫోన్‌లో వీడియో తీయించాడు. పోలీసులకు ఫిర్యాదు చేస్తే.. ఆ వీడియోను సోషల్ మీడియాలో పోస్ట్‌చేస్తానని హెచ్చరించడంతో బెదిరిపోయిన ఆ యువతి.. ఎట్టకేలకు పదిరోజుల తర్వాత ధైర్యం మెట్టెక్కింది. ఇక్కడా పోలీసులు నిర్లక్ష్యం వహించారు. నిందితులను అరెస్టు చేయడంలో తాత్సారం వహించారు. ఆమె మీడియాకు విషయం చెప్పడం.. టీవీల్లో బ్రేకింగ్‌లు రావడంతో.. నిందితులను అరెస్టు చేసినట్లు పోలీసులు ప్రకటించారు. బాధితురాలు పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదు మేరకు వివరాలు ఇలా ఉన్నాయి.. మోడలింగ్ రంగంలో స్థిరపడటానికి బాధిత యువతి (21) రెండేళ్ల క్రితం నగరానికి వచ్చింది. ఎల్లారెడ్డిగూడలోని ఓ లేడీస్ హాస్టల్‌లో ఉంటూ.. మోడలింగ్ చేస్తోంది. పలు పోటీల్లో పాల్గొని, టైటిళ్ల సాధించింది. ఈ క్రమంలో లేడీస్ హాస్టల్ యజమానురాలి కుమారుడు (17) ఆమెతో పరిచయం పెంచుకున్నాడు. నాలుగు నెలల క్రితం ఆ యువతి జూబ్లీహిల్స్‌లోని ఓ అపార్ట్‌మెంట్ పెంట్‌హౌస్‌లో అద్దెకు చేరింది. గత నెల 28న రాత్రి 8.30 సమయంలో ఆ బాలుడు తన స్నేహితుడు నిఖిల్‌రెడ్డితో కలిసి ఆ యువతి ఇంటికి వెళ్లాడు. వారిద్దరూ మద్యం మత్తులో ఉండటంతో.. అక్కడి నుంచి వెళ్లిపోవాలంటూ ఆ యువతి వేడుకుంది. దాంతో.. "అరిస్తే తీవ్ర పరిణామాలు ఎదుర్కోవాల్సి ఉంటుంది" అని బెదిరిస్తూ.. ఆ బాలుడు ఆమెపై విరుచుకుపడ్డాడు. బలవంతంగా ఆమెతో మద్యం తాగించి.. అత్యాచారానికి పాల్పడ్డాడు. నిఖిల్‌రెడ్డి ఆ దృశ్యాలను స్మార్ట్ ఫోన్‌లో చిత్రీకరించాడు. ఆ తర్వాత ఆమె మెడకు చీరతో ఉరివేసి చంపేందుకు ప్రయత్నించి, విఫలమయ్యారు. దాంతో అక్కడి నుంచి పారిపోయారు.



ఆ తర్వాతి రోజు నిందిత బాలుడు ఆమె వద్దకు వెళ్లి.. పెళ్లిచేసుకుంటానని చెప్పడంతో ఆ యువతి తిరస్కరించింది. దాంతో నిఖిల్‌రెడ్డి కల్పించుకుంటూ.. పోలీసులకు ఫిర్యాదు చేస్తే.. ఆ వీడియోను సోషల్ మీడియాలో పోస్ట్ చేస్తానని హెచ్చరించాడు. బెదిరిపోయిన ఆ యువతి.. పదిరోజులపాటు తనలోతానే కుమిలిపోయింది. ఈ నెల 7న ధైర్యం చేసుకుని, బంజారాహిల్స్ పోలీసులకు ఫిర్యాదు చేసింది. అయితే.. పోలీసులు తన ఫిర్యాదుపై స్పందించడం లేదని, నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని బాధితురాలు మీడియాకు తెలిపింది. నిందితులు యథేచ్ఛగా బయట తిరుగుతున్నా.. అరెస్టు చేయడంలేదని వాపోయింది. ఘటనపై బంజారాహిల్స్ ఏసీపీ కేవీఎస్ రావు స్పందించారు. "యువతి ఫిర్యాదుపై కేసు నమోదు చేశాం. నిందితులిద్దరినీ అదుపులోకి తీసుకున్నాం" అని తెలిపారు. ప్రధాన నిందితుడిని మైనర్‌గా గుర్తించామని పోలీసులు తెలిపారు.

## ప్రాణం తీసిన పందెం

- అరగంటలో ఫుల్ బాటిల్ తాగిన వ్యక్తి మృతి

కాశయ్య

ధర్పల్లి, జనవరి 10: మద్యం మత్తులో పందెం కాశాడు. స్నేహితులు సరదాగా అన్న మాటల్ని సీరియస్‌గా తీసుకున్నాడు. అరగంటలో ఫుట్ బాటిల్ మొత్తం తాగేస్తానంటూ సవాల్ చేశాడు. అన్నట్టుగానే గటగటా మద్యం తాగిన అతడు.. చివరికి ప్రాణాలను కోల్పోయాడు. నిజామాబాద్ జిల్లా ధర్పల్లిలో చోటు చేసుకుందీ ఘటన. గోసంగి కాలనీకి చెందిన కడమంచి కాశయ్య (35) పాత సామాన్లు విక్రయిస్తూ జీవనం కొనసాగిస్తున్నాడు. గురువారం రాత్రి 11 గంటలకు కాశయ్య తనింట్లోనే స్నేహితులైన దుర్గయ్య, సాయిలుతో కలిసి మద్యం తాగాడు. కాసేపటికే కాశయ్య తూలుతుండటంతో.. కొద్దిపాటి మద్యానికే మత్తెక్కిందా అంటూ.. స్నేహితులు హేళన చేశారు. దీన్ని అవమానంగా భావించిన కాశయ్య.. అదే రాత్రి స్నేహితులతో ఫుల్‌బాటిల్ తెప్పించుకున్నాడు. అరగంటలో మొత్తం తాగేస్తానంటూ పందెం కాశాడు. మద్యాన్ని గటగటా గొంతులో పోసుకున్నాడు. ఆ వెంటనే అపస్మారక స్థితిలోకి వెళ్లిపోయాడు. స్నేహితులు అతడిని వదిలేసి వెళ్లిపోయారు. శుక్రవారం ఉదయం కాశయ్య నిద్ర లేవకపోవడంతో కుటుంబసభ్యులు అతణ్ని ఆస్పత్రికి తీసుకెళ్లారు. అప్పటికే అతను మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు.

## 50 వేల లంచం.. వ్యాట్-69 బాటిళ్ల కేసు..
## జూబ్లీహిల్స్ ఇన్‌స్పెక్టర్ సస్పెన్షన్

- అవినీతి అధికారుల వివరాలివ్వండి
- 9490616555కు ఫోన్ చేయండి: సీపీ

సీఐ బలవంతయ్య

హైదరాబాద్ సిటీ, జనవరి 10 (ఆంధ్రజ్యోతి): యాభైవేల రూపాయల లంచం.. వ్యాట్-69 బాటిళ్ల ఏసీబీ కేసుతో ప్రమేయమున్న జూబ్లీహిల్స్ ఇన్‌స్పెక్టర్ బలవంతయ్యపై సస్పెన్షన్ వేటు పడింది. శుక్రవారం ఈ మేరకు హైదరాబాద్ నగర పోలీసు కమిషనర్ అంజనీకుమార్ ఉత్తర్వులు జారీ చేశారు. జూబ్లీహిల్స్ సబ్-ఇన్‌స్పెక్టర్ సుధీర్‌రెడ్డి గురువారం ఏసీబీ అధికారులకు రెడ్-హ్యాండెడ్‌గా పట్టుబడ్డ విషయం తెలిసిందే. అతడు ఇచ్చిన వాంగ్మూలం మేరకు ఏసీబీ అధికారులు ఇన్‌స్పెక్టర్ బలవంతయ్యపైనా కేసు నమోదు చేశారు. పూర్వాపరాలు పరిశీలించిన హైదరాబాద్ సీపీ అంజనీకుమార్.. ఇన్‌స్పెక్టర్‌పై వేటు వేశారు. ఏసీబీ అరెస్టు చేసిన ఎస్సై సుధీర్‌రెడ్డినీ సస్పెండ్ చేశారు. హైదరాబాద్ పోలీసు కమిషనరేట్ పరిధిలోని పోలీస్‌స్టేషన్లలో ఎవరైనా లంచం అడిగితే 9490616555 నంబర్‌కు ఫిర్యాదు చేయాలని అంజనీకుమార్ సూచించారు. కాగా.. ఇన్‌స్పెక్టర్ బలవంతయ్య నాంపల్లిలోని హైదరాబాద్ రేంజ్ ఏసీబీ కార్యాలయంలో లొంగిపోయాడు.

## శ్రీవారి దర్శనానికి 7 గంటలు

తిరుమలలో శుక్రవారం భక్తుల రద్దీ తక్కువగా ఉంది. దాదాపు 65 వేల మంది భక్తులు శ్రీవారిని దర్శించుకున్నారు. సర్వదర్శనానికి దాదాపు 7గంటలు పడుతోంది. ఆదివారం ఆర్జితసేవలకు సంబంధించి విజయాబ్యాంకులో శనివారం లక్కీడిప్‌లో జారీచేసే టికెట్లు కల్యాణోత్సవం:80 అందుబాటులో ఉన్నాయి. ఆన్‌లైన్‌లో రూ.300 టికెట్లు పొందడానికి ww.ttdsevaonline.comలో సంప్రదించాలి.

## ప్రియాంక మానవత్వం కొందరిపైనే!

సీఏఏ నిరసనల్లో గాయపడిన విద్యార్థులను ప్రియాంకగాంధీ పరామర్శిస్తున్నారు. కానీ ఆమె మానవత్వం చూపేది కొందరిపైనే! ప్రియాంక సిద్ధాంతాలకు దూరంగా ఉన్న క్షతగాత్ర విద్యార్థులను మాత్రం ఆమె పలకరించరు. కాంగ్రెస్ అధికారంలో ఉన్న రాజస్థాన్‌లో ఒక్క డిసెంబరు నెలలోనే వంద మంది శిశువులు మరణించినా.. ప్రియాంకకు పట్టదు. నేను కోట చాలెంజ్ విసురుతున్నారు. కోటలోని ఆస్పత్రికి ఆమె ఎప్పుడు వెళ్తారు?

**- సంబిత్ పాత్ర, బీజేపీ అధికార ప్రతినిధి**

## పార్లమెంట్‌లో చేసిన చట్టాలను ఎలా వ్యతిరేకిస్తారు?

పౌరసత్వ సవరణ చట్టాన్ని మా పార్టీ వ్యతిరేకించడం తప్పు. అది చాలా ఉత్తమ చట్టం. పార్లమెంట్‌లో చేసిన చట్టాలను వీధుల్లో వ్యతిరేకించడానికి వీల్లేదు.

**- జాన్ ఫెర్నాండెజ్, మాజీ ఎంపీ, కాంగ్రెస్ నేత**



## మీరు కూడా సీఏఏ తీసుకురండి

మీరు(పాకిస్థాన్) కూడా పౌరసత్వ సవరణ చట్టాన్ని(సీఏఏ) తీసుకురండి. ఇక్కడ ఇమడలేని ముస్లింలకు పాక్‌లో పౌరసత్వం ఇవ్వొచ్చు. పాక్‌లో పీడిత మైనారిటీలను మా దేశంలోకి అనుమతిస్తాం. ఇక్కడ ముస్లింలను మీరు తీసుకుపోవచ్చు. దీనిని ఎవరు అడ్డుకుంటారు? ఇది వందశాతం జరిగి తీరాల్సిందే!

**- విక్రమ్ సైనీ, బీజేపీ ఎమ్మెల్యే**

## పురుగు తిన్న పండ్లు తింటే ఆరోగ్యమే!

వాషింగ్టన్, జనవరి 10 : చిలుక కొట్టిన జాంపండు తియ్యగా ఉంటుందని అంటారు!! అలాగే.. పురుగు తిన్న కూరగాయలు, పండ్లు తింటే ఆరోగ్యానికి వచ్చే ఢోకా ఏమీ ఉండదని అమెరికాలోని టెక్స

# ఎంబీబీఎస్‌లో ఐదేళ్లకు ఫీజులు అహేతుకం!

## నాలుగున్నరేళ్లకే వసూలు చేయాలి.. టీఏఎఫ్‌ఆర్సీ తీరును తప్పుబట్టిన హైకోర్టు

హైదరాబాద్, జనవరి 10(ఆంధ్రజ్యోతి): తెలంగాణ అడ్మిషన్ అండ్ ఫీ రెగ్యులేటరీ కమిటీ(టీఏఎఫ్‌ఆర్సీ) తీరును హైకోర్టు తప్పుబట్టింది. టీఏఎఫ్‌ఆర్సీ తీరు విద్యార్థుల పక్షాన కాకుండా ప్రైవేటు మెడికల్ కాలేజీల పక్షాన వకాల్తా పుచ్చుకున్నట్లుందని ఆక్షేపించింది. భారత వైద్య మండలి రూపొందించిన గ్రాడ్యుయేట్ మెడికల్ ఎడ్యుకేషన్ రెగ్యులేషన్స్‌లోని 7(1)వ నిబంధన ప్రకారం ఎంబీబీఎస్ కోర్సు వ్యవధిని నాలుగున్నరేళ్లుగా నిర్ణయించిందని స్పష్టం చేసింది. అందుకు విరుద్ధంగా విద్యార్థుల నుంచి ఐదేళ్లకు వార్షిక ఫీజు వసూలు చేసుకోవడానికి టీఏఎఫ్‌ఆర్సీ అనుమతించడం సహేతుకంగా లేదని తేల్చిచెప్పింది. టీఏఎఫ్‌ఆర్సీ నిర్దేశించిన వార్షిక ఫీజును నాలుగేళ్ల పూర్తి ఫీజు, ఐదో ఏడాదిలో 6 నెలలకు వార్షిక ఫీజులో సగం మాత్రమే వసూలు చేయాలని పేర్కొంది. ఈమేరకు హైకోర్టు న్యాయమూర్తులు జస్టిస్ ఎంఎస్ రామచంద్రరావు, జస్టిస్ కె. లక్ష్మణ్‌ల ధర్మాసనం ఇటీవల ఆదేశాలిచ్చింది. హన్మకొండకు చెందిన విద్యార్థిని ఐ. పద్మతేజ 2018లో దాఖలు చేసిన వ్యాజ్యంపై విచారణ జరిపిన ధర్మాసనం ఈ మేరకు ఆదేశాలు జారీ చేసింది. ఎంబీబీఎస్, బీడీఎస్ కోర్సులకు సంబంధించి కౌన్సెలింగ్‌కు, ఏ, బీ, సీ కేటగిరీల్లో ఒక్కొక్క దానికి ఒక్కో విధంగా దరఖాస్తు, కౌన్సెలింగ్ ఫీజు, నాలుగున్నరేళ్ల కోర్సుకు 5 ఏళ్ల పూర్తి ఫీజు వసూలు చేయడాన్ని ఆమె ప్రశ్నించారు.

### అంతా ఫెయిలవుతారని ఎందుకనుకోవాలి?

పిటిషనర్ రాష్ట్రంలోని ఏ వైద్య కళాశాలలోనూ విద్యార్థి కానందున ఆమెకు రిట్ దాఖలు చేసే అర్హత లేదని టీఏఎఫ్ ఆర్సీ తరపు న్యాయవాది కోర్టుకు తెలిపారు. ఈ వాదనలను ధర్మాసనం తోసిపుచ్చింది. 2018లో ఎంబీబీఎస్ 'ఏ' కేటగిరి సీటుకోసం పిటిషనర్ దరఖాస్తు చేసుకున్నప్పటికీ.. సీటు పొందలేక పోయారని, అయితే అడ్మిషన్ ప్రక్రియలోని లోపాలను ఎత్తిచూపే ప్రయత్నాన్ని తప్పుబట్టలేమని ధర్మాసనం స్పష్టం చేసింది. ఎంబీబీఎస్ కోర్సు నాలుగున్నరేళ్లే అయినప్పటికీ.. ఇంటర్నల్ అసెస్‌మెంట్స్‌లో 35% మార్కులు రాని విద్యార్థులను అనర్హులుగా ప్రకటించి వారికి ఉచితంగా ప్రత్యేక శిక్షణను ఇవ్వాల్సి ఉంటుందని, అంచేత ఎంబీబీఎస్ కోర్సుకు 5 ఏళ్లకు పూర్తి ఫీజు వసూలు చేయడం సమర్థనీయమేనని రాష్ట్ర ప్రభుత్వం తరపు న్యాయవాది వాదించారు. వీటిని ధర్మాసనం తిరస్కరించింది. విద్యార్థులందరూ మొదటి సంవత్సరం, లేదా రెండో ఏడాదిలో ఫెయిలవుతారని భావించడం సరికాదని, ఐదేళ్లకు ఫీజులు వసూలు చేయడం సబబు కాదని తేల్చిచెప్పింది.

# ఐఐటీల్లో ఎగ్జిట్ ఆప్షన్!

- ఒత్తిడితో మానేసే విద్యార్థులకు వెసులుబాటు
- ఇంజనీరింగ్ మూడేళ్లకే పరిమితం

హైదరాబాద్, జనవరి 10(ఆంధ్రజ్యోతి): ఐఐటీ చదువుల్లో ఒత్తిడికి చిత్తవుతున్న విద్యార్థులకు ఉపశమనం కలుగనుంది. ఇష్టం లేని చదువులు చదవాల్సిన అవసరం తొలగిపోనుంది. ఐఐటీల్లో విద్యార్థులకు 'ఎగ్జిట్ ఆప్షన్' ఇచ్చేందుకు కేంద్ర మానవ వనరుల అభివృద్ధి శాఖ(ఎంహెచ్‌ఆర్డీ) కసరత్తు చేస్తోంది. ఈ అంశంపై ఇటీవల జరిగిన ఐఐటీ కౌన్సిల్ సమావేశంలోనూ ప్రధానంగా చర్చించడం గమనార్హం. ఐఐటీల్లో ఏటా వందల మంది విద్యార్థులు డ్రాపౌట్ అవుతున్నారు. అక్కడి చదువుల ఒత్తిడిని తట్టుకోలేక, ప్రత్యేక వాతావరణ పరిస్థితుల్లో ఇమడలేక, ఇతరత్రా అంశాలతో మధ్యలోనే చదువు మానేసి వెళ్లిపోతున్నారు. ఇటువంటి వారి సంఖ్య ఏటికేడు పెరిగిపోతోంది. దీనికి ఫుల్‌స్టాప్ పెట్టేందుకు ఐఐటీ-కౌన్సిల్, ఎంహెచ్‌ఆర్డీ చర్యలు చేపట్టాయి. ఐఐటీ చదువుల ఒత్తిడిని తట్టుకోలేని విద్యార్థులకు ఎగ్జిట్ ఆప్షన్ ఇవ్వాలని భావిస్తోంది. అంటే ఆ విద్యార్థులు నాలుగేళ్ల పాటు అక్కడ ఉండాల్సిన, ఐఐటీ మోడల్ ఇంజనీరింగ్ చదవాల్సిన అవసరం లేదు. ప్రత్యామ్నాయంగా వారికి మూడేళ్ల డిగ్రీ కోర్సు అందించాలని భావిస్తున్నారు. దీనికి ప్రత్యేకంగా సిలబస్ రూపొందించనున్నారు. బీఎస్సీ ఇంజనీరింగ్ పేరిట పట్టా ఇస్తారు. తొలి రెండు సెమిస్టర్లలో తీవ్ర ఒత్తిడికి గురై, డ్రాపౌట్ కావాలనే నిర్ణయానికి వచ్చిన విద్యార్థులకు ఎగ్జిట్ ఆప్షన్ కల్పించనున్నారు. ఎంహెచ్‌ఆర్డీ ఆమోద ముద్ర వేస్తే ఐఐటీ కౌన్సిల్ నిర్ణయం త్వరలో అమల్లోకి రానుంది. ఐఐటీల్లో సీటు పొందిన విద్యార్థుల్లో 30-40% మంది ఒత్తిడిని తట్టుకోలేకపోతున్నారు. దేశవ్యాప్తంగా ఉన్న 23 ఐఐటీల్లో గత ఐదేళ్లలో 7,248 మంది డ్రాపౌట్ అయ్యారంటే పరిస్థితి అర్థం చేసుకోవచ్చు. గత రెండేళ్లలోనే 2461 మంది డ్రాపౌట్ కావడం గమనార్హం.

## వటపత్ర శాయిగా నారసింహుడు

యాదాద్రీశుడి సన్నిధిలో శుక్రవారం నారసింహుడి విశేష అలంకారోత్సవం వైభవంగా నిర్వహించారు. అధ్యయనోత్సవాల్లో ఐదో రోజు నారసింహుడిని వటపత్రశాయిగా అలంకరించి ప్రత్యేక పూజలు చేశారు. బాలాలయ ఉత్సవ మండపంలో స్వామివారిని వటపత్రశాయిగా ప్రబంధ పారాయణాలతో ఊరేగించారు. బాలాలయంలో, అనుబంధ పాత గుట్ట ఆలయంలో ఆండాళ్ అమ్మవారి ఊంజల్ సేవోత్సవాలను సంప్రదాయ రీతిలో నిర్వహించారు.

- యాదాద్రి టౌన్

## కిలో ప్లాస్టిక్‌కు నాలుగు కోడిగుడ్లు

ప్లాస్టిక్ రహిత గ్రామం కోసం సూర్యాపేట జిల్లా తుంగతుర్తి మండలం బండ రామారం సర్పంచ్ ఉప్పునూతుల ప్రణీత వినూత్న ఆలోచనకు శుక్రవారం శ్రీకారం చుట్టారు. కేజీ ప్లాస్టిక్‌ను ఇచ్చిన వారికి నాలుగు కోడిగుడ్లను ఉచితంగా ఇస్తామని ప్రకటించారు. దీంతో గ్రామస్థులు ఇళ్లలోని ప్లాస్టిక్ వ్యర్థాలను తీసుకువచ్చి కోడిగుడ్లను తీసుకెళ్లారు. తొలిరోజే 40 కేజీల వరకు ప్లాస్టిక్ వ్యర్థాలను సేకరించారు.

- తుంగతుర్తి

## స్వచ్ఛ దర్పణ్‌లో పెద్దపల్లికి ప్రథమ స్థానం

శ్రీదేవసేన

కేంద్ర ప్రభుత్వం ప్రకటించిన స్వచ్ఛ దర్పణ్ ర్యాంకింగ్స్‌లో 2020 సంవత్సరానికిగాను పెద్దపల్లి జిల్లాకు ప్రథమ స్థానం దక్కింది. ఈ నెల 12న న్యూఢిల్లీలో కలెక్టర్ శ్రీదేవసేన అవార్డు అందుకోనున్నారు. జిల్లా గతంలోనే స్వచ్ఛ సర్వేక్షణ్‌లో ప్రథమస్థానం సాధించగా అంతకుముందు మూడో స్థానంలో నిలిచింది. వందశాతం సామూహిక, వ్యక్తిగత మరుగుదొడ్లు నిర్మించి వినియోగించడం, వాటికి జియో ట్యాగింగ్ చేయడం, సామూహిక ఇంకుడు గుంతల నిర్మాణం, చెత్త నిర్వహణ, కంపోస్టు పిట్‌ల నిర్మాణం, ప్రతి గ్రామంలో డంపింగ్ యార్డు నిర్మించి వినియోగించడం, ప్రజలకు స్వచ్ఛతపై అవగాహన కలిగించటం వంటి చర్యల వల్ల పెద్దపల్లికి ప్రథమస్థానం లభించింది. ఈ ఘనత సాధించేందుకు జిల్లాలో ప్రతి శుక్రవారం 'స్వచ్ఛ శుక్రవారం' పేరిట కార్యక్రమం నిర్వహించడంతో పాటు పంచసూత్రాలను కలెక్టర్ అమలు చేశారు.

- పెద్దపల్లి

# మిర్చి రైతుకు కాసుల పంట!

## ఖమ్మంలో క్వింటాల్ రూ.21,300.. వరంగల్ మార్కెట్‌లో రూ.20,600.. తాలు మిర్చికీ రూ.6వేలు -రూ.7,500

- అంతర్జాతీయంగా డిమాండ్.. పెరిగిన ధర

హైదరాబాద్, జనవరి 10 (ఆంధ్రజ్యోతి): ఏటా సీజన్‌లో మిర్చి ధర పడిపోవడం, మార్కెట్లలో రైతులు ధర్నాలు, ఆందోళనలు చేపట్టడం పరిపాటిగా ఉండేది. కానీ, ఈ ఏడాది కాలం కలిసి రావడంతో మిర్చి రైతులకు కాసుల పంట పండుతోంది. విదేశీ మార్కెట్‌లో డిమాండ్ ఎక్కువగా ఉండడం... ఇతర రాష్ట్రాల్లో పంట దెబ్బతినడంతో తెలంగాణలో పండిన మేలు రకం మిర్చికి భారీ డిమాండ్ ఏర్పడింది. అడ్డికి పావుశేరు లెక్కన కొనే వ్యాపారులు.. ఇప్పుడు పోటీ పడి ధర పెంచుతున్నారు. ఖమ్మం మార్కెట్‌లో రెండు రోజుల కిందట క్వింటాల్ మిర్చి ఏకంగా రూ.21,300 ధర పలకగా, వరంగల్ మార్కెట్లో కాస్త తక్కువగా రూ.20,600 ధర పలికింది. వాస్తవానికి తెలంగాణతోపాటు ఆంధ్రప్రదేశ్, కర్ణాటక, మహారాష్ట్ర, పశ్చిమబెంగాల్ రాష్ట్రాల్లో మిర్చి సాగు ఎక్కువగా ఉంటుంది. రాష్ట్రంలో మిర్చి సాగు సాధారణ విస్తీర్ణం 1.85 లక్షల ఎకరాలు కాగా... ఖరీఫ్‌లో 1.25 లక్షల ఎకరాల్లో రైతులు మిర్చి సాగు చేశారు. 60 వేల ఎకరాల సాగు విస్తీర్ణం ఈ సీజన్‌లో తగ్గింది. కర్ణాటక, మహారాష్ట్ర, మధ్యప్రదేశ్‌లో వర్షాల కారణంగా మిర్చి పంట దెబ్బతిన్నది. తెలంగాణలోనూ కొంత నష్టం జరిగినప్పటికీ ఎకరాకు కనిష్ఠంగా 15 క్వింటాళ్ల, గరిష్ఠంగా 30 క్వింటాళ్ల దిగుబడి వస్తోంది. తేజ రకం మిర్చికి ఇతర రాష్ట్రాలతో పాటు అంతర్జాతీయ మార్కెట్లోనూ డిమాండ్ ఎక్కువగా ఉంది. శీతల గిడ్డంగుల్లో నిల్వచేసిన పాత మిర్చి కూడా రెండు నెలల క్రితమే అమ్ముడుపోయింది. దీంతో కొత్త మిర్చి అమ్మకాలు జోరుగా సాగుతున్నాయి. ఖమ్మం మార్కెట్లో తేజ రకం మిర్చి క్వింటాల్‌కు రూ.21,300 ధర పలికింది. తాలు మిర్చి సైతం రూ.7,500కు కొనుగోలు చేశారు. ఇక, వరంగల్ మార్కెట్‌లో తేజ రకం మిర్చి రూ.20,600 పలకగా, తాలు మిర్చికి రూ.6 వేలు ధర పెట్టారు. ఎండు మిర్చి యూఎస్- 341 రకానికి వరంగల్ మార్కెట్లో రూ.19,800 ధర వచ్చింది. మలకపేట్ గంజ్‌లో గ్రేడ్-1 మిర్చి రూ.20 వేలు, గ్రేడ్-2 రకం రూ.10 వేలు పలికాయి. మోడల్ ధర సగటున రూ.17 వేల నుంచి రూ.18,500గా ఉంది. రైతులు సగటున ఎకరాకు రూ.లక్ష పెట్టుబడి పెడుతున్నారు. 30 క్వింటాళ్ల దిగుబడి వస్తే సగటున రూ.6 లక్షలు, కనిష్ఠంగా 20 క్వింటాళ్ల దిగుబడి వచ్చినా.. రూ.4 లక్షల మేర ఆదాయం వస్తుండటంతో రైతుల్లో సంతోషం వ్యక్తమవుతోంది.

## అక్షరాస్యతలో ముందుండాలి: కలెక్టర్

గ్రామస్థాయిలో నిరక్షరాస్యతను నిర్మూలించేందుకు ప్రతి ఒక్కరు.. మరో ఇద్దరికి చదువు నేర్పాలని కలెక్టర్ వాసం వెంకటేశ్వర్లు పిలుపునిచ్చారు. జయశంకర్ భూపాలపల్లి జిల్లా చిట్యాల మండల కేంద్రంలో శుక్రవారం పల్లె ప్రగతి పనులను ఆయన పరిశీలించారు. ఇందులో భాగంగా మహిళల చేత అ ఆలు దిద్దించారు. చదువు నేర్చుకుంటామని వారితో ప్రమాణం చేయించారు. గ్రామాల్లోని విద్యార్థులు పక్కింటి వారికి రాయడం, చదవడం నేర్పించాలని చెప్పారు. అక్షరాస్యతలో చిట్యాల మండలాన్ని జిల్లాలోనే ముందుంచేందుకు ప్రతీ ఒక్కరు సహకరించాలని కలెక్టర్ విజ్ఞప్తి చేశారు.

- చిట్యాల

# ఇజ్ తెమా-ఇ-ఆమ్‌కు సర్వం సిద్ధం

## పలు రాష్ట్రాల నుంచి తరలిరానున్న ముస్లింలు.. నిర్మల్‌లో నేడు, రేపు ఆధ్యాత్మిక కార్యక్రమాలు

దిలావర్‌పూర్, జనవరి 10 : ముస్లింలు పవిత్రంగా భావించే ఆధ్యాత్మిక కార్యక్రమం ఇజ్ తెమా-ఇ-ఆమ్ నిర్వహణకు నిర్మల్ జిల్లాలో సర్వం సిద్ధమైంది. శని, ఆది వారాల్లో జరిగే పవిత్ర ఇజ్ తెమా-ఇ-ఆమ్‌కు దిలావర్‌పూర్ మండలంలోని సిర్గాపూర్ శివారు వేదిక కానుంది. దీని కోసం రెండు నెలలుగా ముస్లింలు ఏర్పాట్లు చేస్తున్నారు. రెండున్నర సంవత్సరాల క్రితం కర్నూలులో నిర్వహించిన ఈ ఆధ్యాత్మిక కార్యక్రమానికి భారీ సంఖ్యలో ముస్లింలు హాజరయ్యారు. ఈసారి నిర్మల్ జిల్లాలో నిర్వహించే వేడుకకు వివిధ రాష్ట్రాల నుంచి సుమారు 2.50 లక్షల ముస్లింలు వస్తారని భావిస్తున్నారు. వచ్చిన వారు కూర్చునేందుకు వీలుగా 150 ఎకరాల్లో టెంట్లు వేశారు. బస చేసేందుకు గుడారాలను నిర్మించారు. మత గురువులు, ఆధ్యాత్మిక ప్రసంగాలు చేసేందుకు వేదికను సిద్ధం చేశారు. తాగునీటి సౌకర్యంతో పాటు వాజుఖానాలు, టాయ్‌లెట్లను తాత్కాలికంగా ఏర్పాటు చేశారు. ప్రార్థనలు చేసేందుకు తాత్కాలిక మజీద్‌ను నిర్మించారు. భోజన ఏర్పాట్లు చేశారు. రెండు రోజుల పాటు జరిగే ఇజ్ తెమాలో మత గురువులు ఆధ్యాత్మిక ప్రసంగాలు చేయనున్నారు. అలాగే సామూహిక వివాహాలు కూడా చేయనున్నట్లు తెలిసింది. కాగా.. మేవా (మైనార్టీ ఎంప్లాయీస్ వెల్ఫేర్ అసిసోసియేషన్ ) అభ్యర్థన మేరకు శనివారం జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలలకు కలెక్టర్ సెలవు ప్రకటించినట్లు అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు షేక్ షబ్బీర్ అలీ తెలిపారు.

150 ఎకరాల్లో వేసిన టెంట్లు

శ్రీగిరిపల్లిలో బెల్టుషాపులను ధ్వంసం చేసిన మహిళలు

## శ్రీగిరిపల్లిలో బెల్టు షాపులపై దాడి

గజ్వేల్, జనవరి 10: "తాగొచ్చి తన్నవట్టె వీరనాగమ్మ.. నా బాలచందురమ్మ... నీ కాళ్లు పట్టుకున్న కానీ వీర నాగమ్మ.. నా బాలచందురమ్మ... కనికరం రాదాయే వీరనాగమ్మో.. నా బాల చందురమ్మ" అంటూ మహిళలు మద్యం సీసాలను ధ్వంసం చేశారు. సిద్దిపేట జిల్లా గజ్వేల్ మండలం శ్రీగిరిపల్లిలో బెల్టుషాపులు విచ్చలవిడిగా పెరిగిపోవడంతో పురుషులు తాగివచ్చి సంసారాలను నాశనం చేస్తున్నారని గ్రామంలోని మహిళా సంఘాల ఆధ్వర్యంలో పది బెల్టుషాపులపై దాడి చేసి మద్యం సీసాలను ధ్వంసం చేశారు. ఆ మద్యం సీసాల చుట్టూ తిరుగుతూ శుక్రవారం పాటలతో నిరసన తెలిపారు. విషయం తెలుసుకున్న గజ్వేల్ పోలీసులు శ్రీగిరిపల్లి చేరుకుని బెల్టు షాపులు నడుపుతున్న వారిని అదుపులోకి తీసుకున్నారు. ఈ సందర్భంగా మహిళలు మాట్లాడుతూ మద్యంతో తమ బతుకులు, సంసారాలు పాడవుతున్నాయని అన్నారు.

## కేంద్రం నిధులకు రాష్ట్రం మోకాలడ్డు : జితేందర్‌రెడ్డి

మాట్లాడుతున్న మాజీ ఎంపీ జితేందర్‌రెడ్డి

నారాయణపేట టౌన్, జనవరి 10 : కేంద్ర ప్రభుత్వం సంక్షేమ పథకాలకు ఖర్చు చేస్తున్న నిధులకు రాష్ట్ర ప్రభుత్వం మోకాలడ్డుతోందని మాజీ ఎంపీ, బీజేపీ నాయకులు జితేందర్‌రెడ్డి ఆరోపించారు. శుక్రవారం నారాయణపేటలో జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. గ్రామాల అభివృద్ధి కోసం కేంద్ర ప్రభుత్వం నేరుగా పంచాయతీల ఖాతాల్లో నిధులు జమ చేస్తోందని, అదే తరహాలో పట్టణ అభివృద్ధి కోసం నేరుగా మునిసిపల్ ఖాతాలోనే నిధులు జమ చేయనుందని పేర్కొన్నారు. రాష్ట్రం ఆర్థిక సంక్షోభంలో కొట్టుమిట్టాడుతోందని, మిగులు బడ్జెట్ ఎక్కడికి పోయిందని ప్రశ్నించారు. కేంద్రం ఇచ్చిన నిధులను రాష్ట్ర ప్రభుత్వం దారి మళ్లించిందని విమర్శించారు. నారాయణపేటకు సైనిక్ స్కూల్‌ను కేంద్ర ప్రభుత్వం మంజూరు చేసిందని, అయితే రాష్ట్ర ప్రభుత్వం తమ వాటా కింద రూ. 50 లక్షలు మంజూరు చేయలేకపోయిందని చెప్పారు.

## ఆదిలాబాద్ కలెక్టర్‌కు డెమోక్రసీ అవార్డు

ఆదిలాబాద్ టౌన్, జనవరి 10: ఆదిలాబాద్ జిల్లాలో 2019లో నిర్వహించిన స్థానిక సంస్థల ఎన్నికలను ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా విజయవంతం చేసినందుకు తెలంగాణ రాష్ట్ర ఎన్నికల కమిషన్ కలెక్టర్ దివ్య దేవరాజన్‌ను రాష్ట్ర డెమోక్రసీ అవార్డుకు ఎంపిక చేస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. ఈ అవార్డును ఈ నెల 11న హైదరాబాద్‌లోని తారమతి భద్రాది ఆడిటోరియంలో అందజేయనున్నారు. రాష్ట్ర వ్యాప్తంగా ఈ అవార్డుకు మరో ఆరుగురు కలెక్టర్లు ఎంపికయ్యారు.

## ఏపీ రాజధాని అంశంలో సినీ నటులు స్పందించాలి

- మహేశ్ బాబు ఇంటి వద్ద ధర్నాకు జై ఆంధ్రప్రదేశ్ విద్యార్థి సంఘం యత్నం

బంజారాహిల్స్/హైదరాబాద్, జనవరి 10(ఆంధ్రజ్యోతి): ఏపీ రాజధాని మార్పు విషయంలో సినీనటులు స్పందించాలని, అమరావతినే రాజధానిగా కొనసాగించేలా గొంతు విప్పాలని జై ఆంధ్రప్రదేశ్ విద్యార్థి, యువజన పోరాట సమితి నాయకులు డిమాండ్ చేశారు. సమితి నాయకులు శుక్రవారం ఫిలింనగర్‌లో సినీనటుడు మహేశ్ బాబు నివాసం ఎదుట ధర్నా చేసేందుకు ప్రయత్నించారు. అప్పటికే అక్కడికి చేరుకున్న పోలీసులు వారిని అరెస్టు చేశారు. ఈ సందర్భంగా సమితి అధ్యక్షుడు షేక్ జిలాని మాట్లాడుతూ.. రాజధాని అంశంలో సినీ నటులపై ఒత్తిడి పెంచేందుకు వారి ఇళ్ల వద్ద ఆందోళన కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు. ఏపీ పునర్వ్యవస్థీకరణ చట్టంలోని విభజన హామీలు అమలయ్యేలా సినీ నటులంతా ఒక వేదిక మీదకు వచ్చి పోరాటం చేయాలని పిలుపునిచ్చారు.

## కానిస్టేబుల్ ఉద్యోగానికి రాజీనామా.. కౌన్సిలర్‌గా నామినేషన్

రమేశ్‌బాబు

మహబూబ్‌నగర్ క్రైం/వర్ధన్నపేట, జనవరి 10 : కష్టపడి చదివిన ఆ యువకుడు పోలీస్ ఉద్యోగాన్ని సాధించాడు.. రెండేళ్ల సర్వీస్ కూడా పూర్తి చేయకుండానే రాజకీయాలపై ఆసక్తి పెంచుకున్నాడు. నిత్యం ప్రజల మధ్యే ఉండాలని కోరుకున్న ఆయన ఉద్యోగానికి రాజీనామా చేశాడు. పాలమూరు పురపాలికలో జరుగుతున్న ఎన్నికల్లో కౌన్సిలర్ అభ్యర్థిగా నామినేషన్ వేశాడు. జిల్లా కేంద్రంలోని పాత పాలమూరుకు చెందిన రమేశ్‌బాబు శుక్రవారం టీఆర్ఎస్ తరపున 11వ వార్డు నుంచి నామినేషన్ వేశాడు. స్విట్స్ ఇంజనీరింగ్ కళాశాలలో బీటెక్ చదివిన ఆయన 2016లో కానిస్టేబుల్ ఉద్యోగానికి ఎంపికయ్యాడు. రెండేళ్ల సర్వీసు కూడా పూర్తి చేసుకోకుండానే 2019 అక్టోబర్‌లో ఉద్యోగానికి రాజీనామా చేశాడు. ప్రస్తుతం కౌన్సిలర్‌గా తన అదృష్టాన్ని పరీక్షించుకోబోతున్నాడు. రమేశ్ తండ్రి ముక్తల్‌లో హెడ్‌కానిస్టేబుల్‌గా పనిచేస్తున్నారు. కాగా, ఎంసీఏ చదివి ప్రజాసమస్యల పరిష్కారానికి కృషి చేస్తూ అందరివాడుగా మెలిగిన కోమండ్ల ఎలేందర్‌రెడ్డి వరంగల్ రూరల్ జిల్లా వర్ధన్నపేట మునిసిపాలిటీలో శుక్రవారం 11వ వార్డు టీఆర్ఎస్ అభ్యర్థిగా నామినేషన్ దాఖలు చేశారు. రాష్ట్ర ఉద్యమంలో కీలకపాత్ర పోషించిన ఆయనకు పట్టణంలో ప్రత్యేక గుర్తింపు ఉంది.

## శ్రీగిరిపల్లిలో బెల్టు షాపులపై దాడి

గజ్వేల్, జనవరి 10: "తాగొచ్చి తన్నవట్టె వీరనాగమ్మ.. నా బాలచందురమ్మ... నీ కాళ్లు పట్టుకున్న కానీ వీర నాగమ్మ.. నా బాలచందురమ్మ... కనికరం రాదాయే వీరనాగమ్మో.. నా బాల చందురమ్మ" అంటూ మహిళలు మద్యం సీసాలను ధ్వంసం చేశారు. సిద్దిపేట జిల్లా గజ్వేల్ మండలం శ్రీగిరిపల్లిలో బెల్టుషాపులు విచ్చలవిడిగా పెరిగిపోవడంతో పురుషులు తాగివచ్చి సంసారాలను నాశనం చేస్తున్నారని గ్రామంలోని మహిళా సంఘాల ఆధ్వర్యంలో పది బెల్టుషాపులపై దాడి చేసి మద్యం సీసాలను ధ్వంసం చేశారు. ఆ మద్యం సీసాల చుట్టూ తిరుగుతూ శుక్రవారం పాటలతో నిరసన తెలిపారు. విషయం తెలుసుకున్న గజ్వేల్ పోలీసులు శ్రీగిరిపల్లి చేరుకుని బెల్టు షాపులు నడుపుతున్న వారిని అదుపులోకి తీసుకున్నారు. ఈ సందర్భంగా మహిళలు మాట్లాడుతూ మద్యంతో తమ బతుకులు, సంసారాలు పాడవుతున్నాయని అన్నారు.

## డిగ్రీ విద్యార్థిని ఆత్మహత్య

భీమ్‌గల్‌రూరల్, జనవరి 10: డిగ్రీ పరీక్షలు సరిగా రాయలేదన్న మనస్తాపంతో నిజామాబాద్ జిల్లా భీమ్‌గల్ మండలం పల్లికొండ గ్రామంలో ప్రవళిక(19) అనే విద్యార్థిని బావిలో దూకి ఆత్మహత్య చేసుకుంది. ప్రవళిక భీమ్‌గల్‌లోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో బీఏ ద్వితీయ సంవత్సరం చదువుతోంది. ఇటీవల పరీక్షలు బాగా రాయలేదని మనస్తాపానికి గురైన ఆమె 9వ తేదీ ఉదయం అమ్మమ్మ ఊరు ఏర్గట్లకు వెళ్తున్నానని చెప్పింది. 10న ఉదయం ఇంటి వెనక ఉన్న బావిలో ఆమె మృతదేహం కనిపించింది.

THE COTTON CORPORATION OF INDIA LTD.
(A Government of India Undertaking) BRANCH OFFICE : 16-07-109, V.L. Chittimalla Complex, 2nd & 3rd Floor, Laxmipuram, Near Old Grain Market, Warangal - 506 002
Phone No. 0870-2565088, 2429394, Fax No. 0870-2501451
Website: www.cotcorp.org.in E-Mail : warangal@cotcorp.com.
Ministry web : www.texmin.nic.in

REF : CCI/WGL/Mktg (Transpt) / 2019-2020 DT : 10-01-2020

SHORT TENDER NOTICE FOR TRANSPORTATION OF FP BALES

Sealed tenders are invited from reputed transporters for Transportation of F.P. bales from Centres/pressing locations to godowns at various locations under B.O., Warangal jurisdiction for the season 2019-20. Last date for submission of tender is upto 12.00 PM on 17.01.2020. For other details and terms & conditions of the tender can be downloaded from the Corporation website www.cotcorp.org.in or Government tender Portal www.eprocure.gov.in or may also be obtained from Branch Office, Warangal at above address.

Sd/- DY. GENERAL MANAGER

# సానుకూల తీర్పు

ఇంటర్నెట్ ప్రజల ప్రాథమికహక్కు అంటూ సుప్రీంకోర్టు పరోక్షంగానైనా నిర్ధారించడం ఈ సమాచార యుగంలో స్వాగతించాల్సిన విషయం. తీర్పుకు సందర్భం కశ్మీర్ కావచ్చును గానీ, తమకు వ్యతిరేకంగా నలుగురు కూడతారన్న భయం కలిగినప్పుడల్లా ప్రభుత్వాలు ప్రప్రథమంగా మోకాలడ్డేది ఇంటర్నెట్‌నే కనుక ఈ తీర్పు దేశ భవిష్యత్తుకు మంచిది. ఐదున్నర నెలలుగా దిగ్బంధంలో ఉన్న జమ్మూకశ్మీర్ విషయంలో ప్రపంచం ముందు భారత్ పరువుపోకుండా కేంద్రప్రభుత్వం పదిహేను మంది విదేశీ దౌత్య ప్రతినిధుల రెండురోజుల పర్యటన ఏర్పాటు చేసిన నేపథ్యంలో ఈ తీర్పు వెలువడటం విశేషం. ఈ తరహా పర్యటనలు ప్రభుత్వానికి తప్ప, కశ్మీర్‌కు ఉపకరించేదేమీ ఉండదు కానీ, కీలకమైన సంస్థలకూ, వ్యవస్థలకూ ఇంటర్నెట్ అందాలన్న సుప్రీంకోర్టు ఆదేశం మాత్రం కశ్మీర్ తేరుకోవడానికి ఉపకరిస్తుంది.

కీలక సమాచారవాహికగా మారిన ఇంటర్నెట్‌మీద ఆంక్షలు విధిస్తే, అది భావప్రకటనాస్వేచ్ఛకు కళ్ళెం వేయడమే కనుక, ఈ హక్కును నియంత్రించే పరిమితులు దానికి వర్తిస్తాయన్నది సుప్రీం భావన. ఇంటర్నెట్ నిరవధిక రద్దు టెలికామ్ నిబంధనలకు కూడా వ్యతిరేకమన్న అంశాన్ని అటుంచితే, దానిపై విధించే ఆంక్షలేవీ రహస్యంగా అమలు జరగకూడదన్నది సుప్రీం తీర్పులో ఓ అంశం. ఏదైనా ఘటన జరిగినప్పుడు కేవలం మౌఖిక ఆదేశాలతో ఇంటర్నెట్‌ను మూసేస్తున్న సందర్భాలు దేశవ్యాప్తంగా పెరిగిపోతున్న నేపథ్యంలో, సదరు ఆదేశాలు అధికారికంగా, బహిరంగంగా ఉండాలనడం, వాటిపై న్యాయస్థానాల్లో సవాలు చేయవచ్చునని చెప్పడమూ స్వాగతించవలసిన అంశాలే. ఇంటర్నెట్ వినియోగం ప్రాథమికహక్కుల్లో అంతర్భాగంగా నిర్ధారించమని ఎవరూ నేరుగా అభ్యర్థించనందున ఆ అంశం మీద నిశ్చితాభిప్రాయాన్ని ప్రకటించడం లేదని అంటూనే, దాని ఆధారంగా సాగే భావప్రకటన స్వేచ్ఛ, వ్యాపార వాణిజ్య స్వేచ్ఛలకు రాజ్యాంగ రక్షణలున్నాయని మాత్రం ఈ తీర్పు నిర్ధారించింది. ఇక, పరిమితులు లేకుండా సెక్షన్ 144ను అడ్డుపెట్టుకొని అధికారులు వీరంగం వేస్తున్న తరుణంలో, రాజ్యాంగం ప్రసాదించిన హక్కులకు లోబడి, వాటి ఉల్లంఘనలకు తావులేని రీతిలో నిషేధాజ్ఞలు ఉండాలన్నది సుప్రీం అభిప్రాయం. గత ఏడాది సెప్టెంబరులో కేరళ హైకోర్టు ఇంటర్నెట్‌ను ప్రాథమిక హక్కుగా ప్రకటించిన విషయాన్ని అటుంచితే, జమ్మూకశ్మీర్‌లో ఇంటర్నెట్‌సేవల రద్దుపై దాఖలైన పలుపిటిషన్లపై వెలువడిన సుప్రీంకోర్టు తీర్పు, దేశచరిత్రలో సుదీర్ఘకాలం అమలైన ఈ నిషేధాన్ని విస్పష్టంగా చట్టవ్యతిరేకమని ప్రకటించి ఉంటే బాగుండేది. నెట్‌పై దీర్ఘకాలిక ఆంక్షలు కూడదని వ్యాఖ్యానించి కూడా వాటిని సమీక్షించుకోమని మాత్రమే న్యాయస్థానం సూచించినందున, తిరిగి అటువంటి ఆదేశాలను ఇచ్చే అవకాశం ప్రభుత్వానికి ఏర్పడుతుంది. తాత్కాలిక మూసివేత నిర్ణయాలు కూడా నిరంకుశంగా జరగకూడదని చెప్పిన న్యాయస్థానం, కశ్మీర్‌లో జరిగినది పూర్తిగా అక్రమమేనని తేల్చి ఉంటే బాగుండేది. అలాగే, పిటిషనర్లు అన్నట్టుగా, డెబ్బయ్‌లక్షలమంది జీవితాలకు సంబంధించిన అంశం కనుక, ఏవో కొన్ని వ్యవస్థలకు, సంస్థలకు మాత్రమే పునరుద్ధరణ అంశాన్ని పరిమితం చేయకుండా, ప్రజలందరికీ దానిని విస్తరింపచేసి ఉంటే మరీ బాగుండేది. హక్కుల ఉల్లంఘన జరిగిందని భావించినప్పుడు నిర్ణయాలను సమీక్షించుకోమని హితవు చెప్పడం కాక, హక్కులను తక్షణమే పునరుద్ధరించమని ఆదేశించడం ముఖ్యం.

సుప్రీంకోర్టు తీర్పు నేపథ్యంలో ఇంటర్నెట్‌కు దూరమై దెబ్బతిన్న విద్య, వైద్యం, వ్యాపారం, బ్యాంకింగ్ వంటి రంగాలకు తిరిగి వెలుగు వస్తుందని ఆశించాలి. ప్రభుత్వ ఆంక్షలను రద్దుచేయడం, తక్షణ పునరుద్ధరణకు ఆదేశాలు ఇవ్వడం వంటివి తీర్పులో లేకపోయినప్పటికీ, దీని కారణంగా ప్రజలకు ప్రభుత్వ ఆదేశాలను సవాల్ చేయగలిగే అవకాశం దక్కింది. ప్రజాభద్రత పేరిట దూకుడు నిర్ణయాలు కూడదని తీర్పు అంతర్లీనంగా హెచ్చరించిన నేపథ్యంలో, ప్రభుత్వం కాస్తంత తగ్గే అవకాశాలూ లేకపోలేదు. ప్రజాభద్రతా చట్టం కింద నిర్బంధించిన ఓ పాతికమందిపై దాని ప్రయోగాన్ని ఉపసంహరించుకుంటూ ప్రభుత్వం శుక్రవారం ఓ నిర్ణయం తీసుకున్నది. ఇక, పదిహేనుమంది దౌత్యవేత్తల బృందంతో గురు, శుక్రవారాల్లో ఏర్పాటు చేసిన పర్యటన కశ్మీర్‌లో అంతా సవ్యంగా ఉన్నదని ప్రపంచానికి చాటిచెప్పడానికే. మిగతావారిని అటుంచితే, అమెరికన్ కాంగ్రెస్ ఇటీవల కశ్మీర్ స్థితిగతులపై రెండు తీర్మానాలు చేసిన నేపథ్యంలో అమెరికన్ రాయబారి ఈ పర్యటనలో పాలుపంచుకోవడం ప్రభుత్వానికి కాస్తంత ఉపశమనం. ప్రభుత్వ ఆధ్వర్యంలో, అనేక పరిమితుల మధ్య ఈ బృందం కశ్మీర్‌లో కన్నదేమిటి, విన్నదేమిటి అన్నవి వేరే విషయాలు.

# ప్రైవేటుకు బొగ్గు బ్లాకులు!

ప్రభుత్వ రంగంలో బొగ్గు బావుల తవ్వకం తగ్గి, ప్రైవేటు రంగంలో పెరిగే అవకాశం ఉంది. బొగ్గు సంస్థలలో ఎఫ్‌డీఐల ప్రవేశం ఉండదని చెబుతూనే మరోవైపు 'గనులు, ఖనిజాలు అభివృద్ధి నియంత్రణ చట్టం, 1957' ని సవరిస్తూ కేంద్ర ప్రభుత్వం ఆర్డినెన్స్ జారీ చేసింది. ఈ బుధవారం జరిగిన ఈ పరిణామం వల్ల బొగ్గు తవ్వకంతో సంబంధం లేని సంస్థలు కూడా బొగ్గు గనుల బిడ్డింగ్‌లో పాల్గొనే అవకాశం కలిగింది. 200లకు పైగా బొగ్గు బ్లాకులను వేలం వేయడానికి కేంద్రం నిర్ణయించింది. ఈ నెలలోనే మొదటి విడతగా 40 బొగ్గు బ్లాకులను వేలం వేసే పనికి శ్రీకారం చుట్టింది. బొగ్గు దిగుమతిని నియంత్రించడం కోసమే బొగ్గు బ్లాకులను వేలం వేస్తున్నట్లు కేంద్రం చెబుతుంది. బొగ్గు బ్లాకుల కేటాయింపులో జరిగిన అవకతవకల నేపథ్యంలో 2014లో కేంద్ర ప్రభుత్వం 204 బొగ్గు బ్లాకుల కేటాయింపును రద్దు చేసింది. ఇప్పుడు ఈ కార్యక్రమం మళ్లీ ప్రారంభమవుతుంది. భారతదేశంలోని థర్మల్ విద్యుత్ కేంద్రాలకు కోల్ ఇండియా, సింగరేణి సంస్థలు బొగ్గు సరఫరా చేస్తున్నాయి. 74 శాతం విద్యుత్ ఉత్పత్తి బొగ్గుపైనే ఆధారపడి ఉంది. ప్రస్తుతం దేశంలో సింగరేణి సహా మొత్తం 650 నుంచి 670 మిలియన్ టన్నుల వరకు బొగ్గు ఉత్పత్తి జరుగుతుంది. అయితే, దాదాపు 900 మిలియన్ టన్నుల వరకు బొగ్గు అవసరముంది. దీంతో కోల్ ఇండియా, సింగరేణి లక్ష్యాలను పెంచుతూనే ప్రైవేటు సంస్థలకు బొగ్గు బ్లాకులను కేటాయించే కార్యక్రమానికి కేంద్రం శ్రీకారం చుట్టింది. బొగ్గు బావులను ప్రైవేటీకరిస్తున్నారని, ఎఫ్‌డీఐని విచ్చలవిడిగా ప్రవేశపెడుతున్నారని, కేంద్ర కార్మిక సంఘాలు బుధవారం జరిపిన సార్వత్రిక సమ్మెలో బొగ్గు గని కార్మికులు కూడా పాల్గొన్నారు. కాగా, బొగ్గు బ్లాకుల వేలానికి కేంద్ర మంత్రివర్గం అదే రోజు నిర్ణయించడం గమనార్హం. బొగ్గు రంగంలో కార్పొరేట్, బహుళజాతి సంస్థలకు అవకాశం కల్పించాలన్న కేంద్రం నిర్ణయం.. కీలకమైన రంగాలను విదేశీ సంస్థలకు ధారాదత్తం చేయడమేనని కార్మిక సంఘాలు తెలుపుతున్నాయి. దాదాపు రెండున్నర దశాబ్దాలుగా లాభాల్లో ఉన్న కోల్ ఇండియా, సింగరేణిలు ఉత్పత్తి లక్ష్యాలను పెంచుకుంటూ ముందుకు వెళ్తున్నప్పటికీ బొగ్గు సరిపోవడం లేదనే నెపంతో కేంద్రం బొగ్గు బ్లాకులను ప్రైవేటుకు కేటాయించాలని నిర్ణయించింది. ఏ లక్ష్యంతో బొగ్గు సంస్థలను జాతీయం చేశారో, ఆ లక్ష్యానికి తిలోదకాలిస్తూ కేంద్ర ప్రభుత్వం బొగ్గు ఉత్పత్తితో సంబంధం లేని వారికి కూడా బొగ్గు గనులను కేటాయించడం సమంజసం కాదు. కార్మిక సంఘాలు ఒక్కటై ఒత్తిడి తెస్తే తప్ప బొగ్గు సంస్థలు ప్రభుత్వ రంగంలో కొనసాగలేవు.

**ఏ లక్ష్యంతో బొగ్గు సంస్థలను జాతీయం చేశారో, ఆ లక్ష్యానికి తిలోదకాలిస్తూ కేంద్ర ప్రభుత్వం బొగ్గు ఉత్పత్తితో సంబంధం లేని వారికి కూడా గనులను కేటాయించడం సమంజసం కాదు.**

■ **ఎం.డి. మునీర్**

## కరపత్రం

### ఓయూలో జాతీయ ప్రతిభావంతుల దినోత్సవం

ప్రపంచానికే స్ఫూర్తినిస్తున్న భారత రాజ్యాంగాన్ని రచించిన డా. బి.ఆర్. అంబేడ్కర్ 21వ శతాబ్దాన్ని ప్రభావితం చేస్తున్న ప్రపంచ మేధావుల్లో ప్రథముడు. ఈ ఘనతను గుర్తించాయి కాబట్టే ఐక్యరాజ్య సమితితో పాటు, ఎన్నో దేశాలు అంబేడ్కర్ జన్మదినోత్సవాన్ని జరుపుకుంటున్నాయి. ఆయన ప్రతిభకు గానూ మొట్టమొదటి సారిగా ఉస్మానియా విశ్వవిద్యాలయం 1953 జనవరి 12న గౌరవ డాక్టరేట్‌తో సత్కరించింది. అయితే, ఆనాడు అంబేడ్కర్ అందుకున్న డిగ్రీ పట్టా నకలును గానీ, అరుదైన ఆ చిత్రపటాన్ని గానీ భద్రపరచకపోవడం విచారకరం. అయితే, ఓయూ న్యాయ కళాశాల ముందు 2018 ఏప్రిల్ 5న విద్యార్థులు అనధికారికంగా అంబేడ్కర్ విగ్రహాన్ని ఏర్పాటు చేశారు. విద్యార్థుల సుదీర్ఘ పోరాటం ఫలితంగా ఓయూ ముఖ్య గ్రంథాలయానికి అంబేడ్కర్ పేరు పెట్టడంతో పాటు, రూసా నిధులతో అంబేడ్కర్ పరిశోధనా కేంద్రం ఏర్పాటు చేశారు. ఓయూలో అంబేడ్కర్‌కు డాక్టరేట్‌ను పురస్కరించిన రోజుకు గుర్తుగా 2013 నుంచి ప్రతి ఏటా నేను జనవరి 12న 'జాతీయ ప్రతిభావంతుల దినోత్సవం'గా జరుపుతున్నాను. ఆరోజున జాతీయ స్థాయి సెమినార్‌లు ఏర్పాటు చేయడమే కాకుండా, పుస్తకాలను ఆవిష్కరింపజేస్తున్నాను. ఇదే కోవలో ఈ సారి కూడా 12, 13వ తేదీలలో ఓయూలోని రాంరెడ్డి ఆడిటోరియంలో అంతర్జాతీయ సదస్సు జరుగుతున్నది. 'ప్రపంచంలోని ఉత్తర, దక్షిణ ప్రాంతాల మధ్య అసమానతలు ప్రాపంచిక దృక్పథం – సవాళ్లు' అనే పుస్తకం ఆవిష్కరణ జరుగుతుంది. తెలంగాణ రాష్ట్ర మానవ హక్కుల కమిషన్ తొలి ఛైర్మన్ జస్టిస్ చంద్రయ్య, తెలంగాణ ప్లానింగ్ కమిషన్ ఉపాధ్యక్షులు బి. వినోద్ కుమార్, ప్రపంచ ప్రత్యామ్నాయ అభివృద్ధి సంఘం గౌరవ సలహాదారులు డా. హరి ఎప్పనపల్లి, బ్రిటన్‌లోని మిడిలెసెక్స్ యూనివర్సిటీ ప్రొఫెసర్ డెడ్ కీన్, ఓయూ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ గోపాల్‌రెడ్డి, తదితరులు ఆవిష్కరణ కార్యక్రమంలో పాల్గొంటారు.

– **డాక్టర్ గాలి వినోద్ కుమార్,** న్యాయ శాఖాధిపతి, ఓయూ

## జనవాక్యం

### టిక్కెట్ల ధర పెంపు సరి కాదు

సంక్రాంతి పండుగ నేపథ్యంలో అల వైకుంఠపురంలో, సరిలేరు నీకెవ్వరు సినిమాల టికెట్ ధరలు పెంచాలనుకోవటం సరి కాదు. రికార్డుల పేరిట ప్రేక్షకులపై భారం మోపడం సబబు కాదు. పెద్ద హీరోలు, బడా నిర్మాతలు.. వారి సినిమా రికార్డుల కోసం మూవీ టికెట్స్ రేట్లు పెంచేస్తే చిన్న సినిమాల పరిస్థితి ఏమిటి? వర్ధమాన హీరోలు, మధ్య తరహా సినిమా నిర్మాణ సంస్థలు ఎక్కడికి పోవాలి? అన్ని స్థాయిల వారూ రంగంలో ఉంటేనే కదా పదుగురికి 'పని' దొరికేది, కొందరు బతికేది. బడా నిర్మాణ సంస్థల గుత్తాధిపత్యమే కొనసాగడం మంచిది కాదు. అందుకని, ప్రభుత్వం వెంటనే స్పందించాలి. సినిమా టికెట్ ధరలను నియంత్రించాలి. ఇలాంటి దోపిడీ నిర్ణయాలపై గట్టి చర్యలు తీసుకోవాలి. సగటు ప్రేక్షకులపై ఆర్థిక భారం పడకుండా సినీ నిర్మాతలు కూడా ఆలోచించాలి.

– **కందగట్ల శ్రవణ్ కుమార్,** వరంగల్ అర్బన్

# భారత్ 1968 సందర్భం!

■ పి. చిదంబరం

'పళని' పలుకు

యువ భారతీయులు మూడో కన్ను తెరుస్తున్నారు. కనుకనే 2020 సంవత్సరంలో భారతదేశం 1968 నాటి అమెరికా వలే ఆగ్రహిస్తోంది. ఆధునిక భావాల, ఆదర్శాల ప్రవర్తక భూమి ఫ్రాన్స్ సైతం అదే సంవత్సరంలో ఉగ్ర తాండవంతో చెలరేగిపోలేదూ?

1968లో అమెరికా ఎలా ఉన్నది? నా జ్ఞాపకమేమిటంటే ఆ దేశంలో సాధారణ రాజకీయ క్రియాశీలత విఫలమయింది. కారణాలు ఏమిటి? అమెరికా విద్యార్థి లోకానికి అవేమిటో బాగా తెలుసు. ఎందుకంటే వారు వాటి బాధితులే. ప్రధాన కారణం వియత్నాం యుద్ధం. వీర వియత్నాం 'ప్రజాస్వామ్య' అమెరికాను ఎదిరించి నిలిచింది. న్యాయం వియత్నాం పక్షానే వున్నదని విద్యార్థులు ఎట్టకేలకు అర్థం చేసుకున్నారు. ధర్మాగ్రహంతో రగిలిపోయారు. అమెరికా వ్యాప్తంగా కళాశాలలు, విశ్వవిద్యాలయాలలో ఒక కొత్త ప్రభంజనం హోరెత్తింది. వాషింగ్టన్ పాలకులు దద్దరిల్లిపోయారు.

అప్పటికి రెండు దశాబ్దాలకు పైగా దక్షిణ వియత్నాంలో అమెరికా ఒక ఎడతెగని యుద్ధం చేస్తోంది. ఉత్తర వియత్నాంను నియంత్రిస్తున్న కమ్యూనిస్టులు దక్షిణ ప్రాంతాలకు విస్తరించకుండా అడ్డుకోవడానికి, 'ప్రజాస్వామ్యాన్ని కాపాడానికి' తామా యుద్ధం చేస్తున్నామని అమెరికా చెబుతూ వస్తోంది. ఆ యుద్ధ కాలంలో అమెరికాలో నిర్బంధ సైనిక శిక్షణ వుండేది. విద్యార్థి దశలో వున్న యువకులు తప్పని సరిగా సాయుధ బలగాలలో చేరి దేశానికి సేవలు అందించవలసివుండేది. వియత్నాం యుద్ధం తొలి నాళ్ళలో అసంఖ్యాక అమెరికా యువకులు స్వచ్ఛందంగా సైన్యంలో చేరారు. అయితే, సంవత్సరాల తరబడి యుద్ధం కొనసాగడంతో అసలు వియత్నాంలో తాము ఎందుకు యుద్ధం చేయాలన్న ప్రశ్న అమెరికా ప్రజలలో ముఖ్యంగా యువజనులలో తలెత్తింది. యుద్ధం చేయవలసిన విషయమై పాలకులు చెబుతున్న విషయాలు అబద్ధాలని అంతకంతకూ స్పష్టమయింది. దీంతో యుద్ధానికి మద్దతునివ్వాల్సిన అవసరంపై సంశయాలు పెరిగిపోయాయి. సంశయాలు శంకలుగా, శంకలు యుద్ధ వ్యతిరేకతగా పరిణమించాయి. సుదూర వియత్నాంలో అమెరికా ఎందుకు పోరాడాలి? యువ అమెరికన్లు వందల సంఖ్యలో ఎందుకు చనిపోతున్నారు? ఈ ప్రశ్నలకు సంతృప్తికరమైన సమాధానాలు ఇవ్వడంలో అమెరికా పాలకులు పూర్తిగా విఫలమయ్యారు.

ఒక కొత్త చైతన్యం. సరికొత్త వివేచన. వెల్లివెరిసిన వివేకం. అయితే అమెరికా కాంగ్రెస్ సభ్యులు, సెనేటర్లు ఈ వినూత్న పవనాల ప్రభావాన్ని సకాలంలో గుర్తించలేక పోయారు. ఎట్టకేలకు గుర్తించినా ఫలితం లేకపోయింది. వాషింగ్టన్ పాలకులు కాంగ్రెస్ సభ్యుల హితవచనాలను పెడ చెవిన పెట్టారు. వియత్నాంలో తాము చేస్తున్న యుద్ధం అమెరికా విశ్వసించే విలువలు, పాటించే ఆదర్శాల కోసమేనని వాదించసాగారు. సంక్షేపించి చెప్పాలంటే వియత్నాంలో తమ యుద్ధాన్ని శ్వేత సౌధ అధినేతలు గట్టిగా సమర్థించుకున్నారు. అధ్యక్ష పదవిలో జాన్ ఎఫ్. కెనడీ, లిండన్ బి. జాన్సన్, రిచర్డ్ నిక్సన్.. ఎవరున్నా సరే ఒకటే మాట. విజయం మనదే. ఆదిగో, ఇంక ఒకే ఒక్క పోరాటం చాలు. మన సైనికులు గృహోన్ముఖులవ్వచ్చు అనేదే వారి పల్లవి. అయితే, అమెరికా ఒక నిరాశాజనక, గెలవడం అసాధ్యమైన యుద్ధం చేస్తోందని గుర్తించడం నిక్సన్ హయాం నాటికి అనివార్యమయింది. తత్ఫలితంగా 1970 దశకపు తొలి సంవత్సరాలలో అమెరికాను వియత్నాం యుద్ధం నుంచి నిక్సన్ బయటపడవేశాడు. ఆశ్చర్యకరమైన విషయమేమిటంటే నికార్సైన రణోన్మాది, కరడుగట్టిన కమ్యూనిస్టు వ్యతిరేకి అయిన నిక్సన్ ఈ శాంతిపర్వానికి కారకుడు కావడమే.

మరి 2020లో భారతదేశం 1968 నిరసనాగ్నులను ఎందుకు చవిచూస్తోంది? అనేతు హిమాచలం ఎన్నో కళాశాలల, విశ్వ విద్యాలయాల ప్రాంగణాలు నిరసనల హోరుతో ప్రతిధ్వనిస్తున్నాయి. న్యూయార్క్, ప్యారిస్‌లలో 1968 నాటి ఘటనలతో వాటికి ఎందుకు సారూప్యం కనిపిస్తోంది? నరేంద్ర మోదీ ప్రభుత్వం ఈ మన పురానవ దేశాన్ని పరిపాలిస్తున్న తీరు తెన్నులు సక్రమంగా లేవని, వాటిలో ఒక ఘోరమైన అపసవ్యత కనిపిస్తోందని విద్యార్థులు, యువజనులు భావిస్తున్నారు, కాదు, విశ్వసిస్తున్నారు. అవి శ్వసనీయమైన అర్హులను వైస్ ఛాన్సలర్లుగా నియమించడమూ, ఉన్నత విద్యా వ్యవస్థలో గవర్నర్ల/ఛాన్సలర్ల అనుచిత జోక్యమూ, అధ్యాపకుల నియామకాలలో అవకతవకలు, పరీక్షల నిర్వహణలో అక్రమాలు, విద్యార్థి సంఘాల కార్యకలాపాలపై ఆంక్షలు, ఫీజుల పెంపుదల మొదలైనవన్నీ దేశ పాలనా వ్యవస్థలోని లోపాలు, లొసుగులను పూర్తిగా ప్రతిబింబిస్తున్నాయని విద్యార్థి లోకం ఆగ్రహిస్తోంది.

విశ్వవిద్యాలయాల నిర్వహణకు సంబంధించిన అత్యున్నత స్థానాలలో ఉన్నవారు నిస్సిగ్గుగా రాజకీయ పక్షపాతాన్ని చూపుతున్నారు. ఒక రాజకీయ పక్షానికి చెందిన విద్యార్థి సంఘానికి ప్రాధాన్యమివ్వడం కేంపస్‌లలో ఘర్షణలకు దారితీస్తోంది. ప్రతిష్టాత్మక జవహర్‌లాల్ నెహ్రూ విశ్వవిద్యాలయంలో పాలక బీజేపీ అనుబంధ విద్యార్థి సంస్థ ఏబీవీపీని బహిరంగంగా ప్రోత్సహించడమే అందుకొక నిదర్శనం. నిరసన గళాలు ఎత్తిన వారిని 'తుక్డే తుక్డే గ్యాంగ్'గా ముద్రవేస్తున్నారు. విద్యార్థి నాయకులపై దేశ ద్రోహ కేసులు బనాయిస్తున్నారు! విశ్వవిద్యాలయాలలో నెలకొన్న కొత్త 'సాధారణ' పరిస్థితులు భీతి గొల్పుతుండగా, భారతీయ సమాజమంతటా వున్న 'సాధారణ' పరిస్థితులు భరించరానివిగా రూపొందుతున్నాయి. అత్యాచారాలు, మూక హత్యలు, పోకిరీ సందేశాలు, దుర్భాషలు, దుర్వినియోగాలు, అకారణ అరెస్టులు నిత్యకృత్యాలయ్యాయి. ఆర్థిక వ్యవస్థ పెరుగుదల, ఉద్యోగాల సృష్టి, ఉపాధికల్పన గురించి పాలకుల ఆడంబర అట్టహాసాలు యువ భారతీయులను సహేతుకంగా ఆగ్రహావేశపరులను చేస్తున్నాయి. పాలకులు చెబుతున్న, చెప్పుకుంటున్న గొప్పలు ఒట్టి మిథ్యలని వారికి అనుభవపూర్వకంగా అర్థమవుతున్నాయి. మరి భవిష్యత్తు గురించి వారికి భరోసా ఎలా కలుగుతుంది? ఉద్యోగ విజయాలు, ఉజ్వల భవిత ఉత్తమాటే అని యువజనులు నిస్సహాయపాలవుతున్నారు. ఇంత నైరాశ్యంలోనూ వారొక సత్యాన్ని నిశితంగా గ్రహించారు. ఈ కొత్త 'సాధారణ' పరిస్థితులను పాలకుల బహుళ సంఖ్యాకవాద దురహంకార వైఖరి సమర్థిస్తుందని విద్యార్థిలోకం అర్థం చేసుకున్నది. పాలకుల సంకుచితత్వం ప్రజా జీవనాన్ని ఎన్ని విధాలుగా సమస్యల పాలు చేస్తుందో కూడా వారు విశదం చేసుకున్నారు. భిన్నాభిప్రాయాలపై అసహనం, అధికసంఖ్యాతేతర మతస్థుల విలువలు, సంప్రదాయాలను తిరస్కరించడం లేదా అవమానించడం, శాంతిభద్రతల అమలులో కఠోర పద్ధతులను అవలంబించడం, సెన్సార్ షిప్, ఇంటర్నెట్ షట్‌డౌన్ మొదలైన ఆంక్షలు, అరెస్ట్ చేసిన వారిపై ఎటువంటి అభియోగాలు మోపకుండా సుదీర్ఘంగా నిర్బంధంలో వుంచడం, అభివృద్ధి నిరోధక అభిప్రాయాలను రుద్దడం, కులాంతర, మతాంతర వివాహాలు లాంటి ప్రగతిశీల జీవితాచరణలను అనుమతించక పోవడం మొదలైనవన్నీ పాలకుల సంకుచిత్వ విధానాలకు అద్దం పడుతున్నాయని యువజనులు క్రుద్ధులవుతున్నారు. పాలనా వ్యవహారాలపై ప్రతిపక్షాలతో సంప్రదింపులు జరపడానికి ససేమిరా అనడం, వివాదాస్పద బిల్లులను పార్లమెంటులో ఆగమేఘాలపై ఆమోదింప చేసుకోవడం మొదలైనవి రాజకీయ స్థాయిలో పాలకుల అధిక సంఖ్యాక వాద దురహంకార వైఖరికి అద్దం పడుతున్నాయి. ఒక నిదర్శనం చూపమంటారా? భారత రాజ్యాంగంలోని 5 నుంచి 11 అధికరణలు పౌరసత్వానికి సంబంధించినవి (అవి: రాజ్యాంగం అమలులోకి వచ్చినప్పటి పౌరసత్వం; పాకిస్థాన్ నుండి వలసవచ్చిన వారి పౌరసత్వం; పాకిస్థాన్ కు వలస వెళ్లిన వారి పౌరసత్వం; భారతదేశం వెలుపల నివశిస్తున్న భారత సంతతి ప్రజలు వారి పౌరసత్వం; స్వచ్ఛందంగా విదేశీ పౌరసత్వం స్వీకరించిన భారతీయులు; భారతీయుడు ఎప్పటికీ భారతీయుడే; పౌరసత్వాన్ని గురించిన శాసనాల రూపకల్పనలో పార్లమెంటు అధికారాలు). రాజ్యాంగ సభ ఈ అధికరణలను ఆమోదించే ముందు సంబంధిత నిబంధనలపై మూడు నెలల పాటు విపులంగా చర్చించింది. మరి పౌరసత్వ సవరణ బిల్లు -2019 విషయంలో మోదీ సర్కార్ వ్యవహరించిన తీరు ఏమిటి? ఆ బిల్లును 2019 డిసెంబర్ 8న కేంద్ర కేబినెట్ ఆమోదించింది; పార్లమెంటు ఉభయ సభలు ఆమోదించిన పిమ్మట డిసెంబర్ 11న నోటిపై చేయడం వరకు అంతా 72 గంటల్లోనే సుమా! ఏమిటీ కార్యసరళి? ఇది, మన ప్రజాస్వామ్యానికి మేలు చేస్తుందా? రాజకీయ పక్షాల కంటే విద్యార్థులు, యువజనులే దేశానికి, రాజ్యాంగానికి ముంచుకొస్తోన్న పెనుముప్పు విషయమై మేలుకున్నారు. అధిక సంఖ్యాకవాద దురహంకార పాలన నిరంకుశాధికారానికి దారితీస్తుందన్న వాస్తవాన్ని వారు బాగా అర్థం చేసుకున్నారు. ఆ పాలన భారతీయ సమాజంలో చీలికలు సృష్టిస్తుందని, ఒక భారతీయుడికి వ్యతిరేకంగా మరో భారతీయుడిని నిలబెడుతుందని వారు గుర్తించారు. కొంత మంది భారతీయులు హక్కులు, అవకాశాల విషయంలో మిగతా వారికంటే తక్కువ స్థాయి భారతీయులుగా అవడానికి ఆ దురహంకార పాలన దారితీయదూ? అదొక పెద్ద ఆపదను సృష్టిస్తుంది. దేశాన్ని ఏడు దశాబ్దాల వెనక్కి తీసుకు వెళుతుంది. స్వాతంత్ర్యానంతరం సాధించిన పురోగతినంతటినీ తుడిచిపెడుతుంది. పౌరసత్వ సవరణ చట్టం యువ భారతీయులను అప్రమత్తం చేసింది. మోదీ సర్కార్ పాలనా పద్ధతులపట్ల తమ ఉపేక్ష, ఉదాసీనతలను త్యజించేలా చేసింది. జూలు విదిలించుకున్న సింహాలయ్యారు. పాతతరం వారు సిగ్గిల్లేలా ఈ నవతరం యువతీయువకులు చైతన్యశీలులయ్యారు. లక్షలాది యువతీయువకులు, మహిళలు తీవ్ర ఆగ్రహావేశాలతో వీధులలోకి పోటెత్తారు. వారి నిరసనలు వెల్లువెత్తాయి. కొవ్వొత్తుల ప్రదర్శనలు నిర్వహించారు. త్రివర్ణ పతాకను సగర్వంగా ఊపారు. ఆ జెండా నీడలో తమ సమైక్యతను చాటారు. భారత రాజ్యాంగ సమున్నత ప్రవేశికను ముక్తకంఠంతో చదివారు. ఆ స్ఫూర్తిదాయక వాణిని సమైక్యంగా ఎలుగెత్తారు. ఆ మున్నుడి ఆవిష్కరించిన శాశ్వత విలువల గురించి వివేచించారు. వాటి సందేశాన్ని ఆంతరీకరణ చేసుకున్నారు. ఊహించినట్టుగానే పాలకులు కోపోద్రిక్తులయ్యారు. గర్జించారు, భయపెట్టారు. చిరచిరలాడారు. నిరంకుశ పాలకులకు పరిపాటి అయిన రీతిలో వ్యవహరించారు. అయితే వారు తీవ్రవ్యాకులతకు గురయ్యారని నిశ్చితంగా చెప్పవచ్చు. 'పౌరసత్వ సవరణ చట్టం అమలు నుంచి ఒక్క అంగుళం కూడా వెనుకడుగు వేయబోమని' ప్రజలకు తన హోంమంత్రి ద్వారా ప్రధానమంత్రి స్పష్టం చేశారు. ఆ ప్రకటన చూస్తుంటే ఆ చట్టానికి ఒక తిరుగులేని, కదిలించలేని ప్రతి బంధకం ఒకటి వున్నట్టుగా కనిపిస్తోంది. ఎవరో ఒకరు సమ్మతించాలి లేదా లొంగిపోవాలి. ఇది నిజంగా జరుగుతుందా? దీనిమీదనే భారత దేశపు భవితవ్యం ఆధారపడివున్నది. ఇది కొత్త సంవత్సరానికి సంతోషప్రదమైన ఆరంభం ఎంత మాత్రం కాదు.

**(వ్యాసకర్త కేంద్ర మాజీ మంత్రి, కాంగ్రెస్ సీనియర్ నాయకులు)**

**పౌరసత్వ సవరణ చట్టం యువ భారతీయులను అప్రమత్తం చేసింది. మోదీ సర్కార్ పాలనా పద్ధతులపట్ల తమ ఉపేక్ష, ఉదాసీనతలను త్యజించేలా చేసింది. పాతతరం వారు సిగ్గిల్లేలా ఈ నవతరం వారు చైతన్య శీలులయ్యారు. 1968లో అమెరికాలో వియత్నాం యుద్ధానికి, ఫ్రాన్స్‌లో కాలం చెల్లిన వ్యవస్థలకు వ్యతిరేకంగా యువజనుల తిరుగుబాటును పోలిన పోరాటశీలతను ఇప్పుడు యువ భారతీయులు ప్రదర్శిస్తున్నారు.**

# నీడగా కాదు, సొంతంగా నిలబడండి

విప్లవ రచయితల సంఘం తెలుగు సాహిత్యంపై బలమైన ప్రభావం చూపిన మాట వాస్తవం. తొలినాళ్లలో తెలుగు సాహిత్య ప్రపంచం ఇటువైపు చూసిన మాట వాస్తవం. ఒక తరం రచయితలను ప్రభావితం చేసింది. ప్రిన్సిపుల్స్ విషయంలో దిక్సూచిగా పని చేసింది. అది శృతిమించి తమకు తాము న్యాయమూర్తి పాత్రలను ఆపాదించుకుని దేనిమీదైనా ఎవరిమీదైనా తీర్పులివ్వగల స్థాపరులు విరసంలో బయలు దేరడం వేరే కథ. దేశంలో దుర్భర దారిద్ర్యం, తాండవిస్తున్న కాలంలో నక్సల్బరీ ప్రతిధ్వనిగా విరసం ఆరంభమైంది. అది ఉపశమనాల నుంచి విముక్తి దాకా జనం వివిధ మార్గాలవైపు చూస్తున్న కాలం. ఏకే రాస్తా ఏకే రాస్తా నక్సల్బరీ ఏకేరాస్తా అని నమ్మినవాళ్లు చాలామందే ఉన్నారు. ఒక దశలో దిక్కుమొక్కూ లేని జనమే కాకుండా మధ్యతరగతి, చదువుకున్న యువతరం కూడా చూపు సారించింది. అదే దశలో ట్రిగ్గర్ మీద వేళ్లతో సాహిత్య సృజన చేయాలనుకునే వారి కలయికలో విప్లవ రచయితలసంఘం ఏర్పడింది. బయటకు పూర్తి స్వాంటేనియస్ పరిణామాలతో ఏర్పడినట్టు అనిపిస్తున్నప్పటికీ రాజకీయ నిర్మాణా

విజయమంత్రం

# అదే నా గెలుపు మంత్రం

రేపు జాతీయ యువజన దినోత్సవం



స్వామి వివేకానంద సందేశాలు యువతరానికి దిశానిర్దేశం చేయడంలో, లక్ష్యాన్ని సాధించడంలో తోడు నిలుస్తాయి. నేను ఒలింపిక్స్‌లో స్వర్ణ పతకం సాధించడానికి ప్రేరణగా నిలిచింది... "ఒక లక్ష్యాన్ని నిర్దేశించుకోండి. దాని గురించే ఆలోచించండి, కలలు కనండి, అందులోనే జీవించండి. మరే ఆలోచనలూ లేకుండా మీ మనసు, కండరాలు, నరాలు, శరీరంలోని ప్రతి అణువూ దానితోనే నిండనివ్వండి. ఇదే విజయాన్ని చేరే మార్గం" అన్న స్వామి ధీరవచనం. ఆ మాటలు ఎప్పటికీ నాకు అమితమైన ధైర్యాన్నీ, సంకల్ప బలాన్నీ ఇస్తాయి.

ఒలింపిక్స్‌లో స్వర్ణ పతకం సాధించాలని పడమూడేళ్ల వయసులో కలలు కన్నాను. కానీ మొదట్లో అందుకు తగ్గ పరిశ్రమ చేయలేదు. అయితే చిన్న కలగా ఉన్న ఆ ఆలోచన వయసు పెరిగే కొద్దీ లక్ష్యంగా మారిపోయింది. అది నా జీవితాన్నే మలుపు తిప్పింది. స్వామి వివేకానంద చెప్పినట్టు ఆ ఒక్క లక్ష్యాన్నే నా సర్వస్వంగా భావించి అహర్నిశలూ కష్టపడ్డాను. దాదాపు పధ్నాలుగేళ్ల తరువాత 2008 బీజింగ్ ఒలింపిక్స్ షూటింగ్‌లో నా 'స్వర్ణ' పతక కలను సాకారం చేసుకోగలిగాను. ఆ పధ్నాలుగేళ్లూ నాకు వేరే ప్రపంచమే తెలియదు. మనసు, శరీరం, ఆహార్యం... అన్నీ నా లక్ష్యాన్నే కేంద్రంగా చేసుకుని సాగాయి. క్రమశిక్షణ విలువ తెలియడానికి, అల్పమైన విషయాలను త్యాగం చేయాలన్న దృఢనిశ్చయం కలగడానికి 'మహాత్యాగాల వల్లనే మహత్కార్యాలు సాధ్యమవుతాయి' అన్న వివేకానంద బోధన ప్రేరణనిచ్చింది.

**- అభినవ్ బింద్రా**, ఒలింపిక్స్ పతక విజేత

**ఓ ధీరుల్లారా! మీరందరూ మహత్కార్యాలు సాధించడానికి జన్మించారని విశ్వసించండి. ఆకాశం నుంచి పిడుగులు పడ్డా చలించకండి! లేచి నిలబడి కార్యదీక్ష వహించండి!!**

**- స్వామి వివేకానంద**

ఆంధ్రజ్యోతి
# నవ్య
కుటుంబ కదంబం

**అరచేతిలో స్మార్ట్‌ఫోన్... అందులో 4జీ సిమ్... 'హైస్పీడ్' ఇంటర్నెట్ యుగంలో లోకల్ ట్యాలెంటూ అంతే వేగంగా 'స్ట్రీమింగ్' అవుతోంది. ఈ ఒరవడే భారతీయ సంగీత ప్రపంచాన్ని కొత్త మలుపు తిప్పింది. ప్రొడక్షన్ ఖర్చు తగ్గి... సులువుగా వేదిక దొరికితే ఎంతటి ఘనత సాధిస్తుందో నవతరం రుజువు చేసింది. అందుకు రిత్విజ్ శ్రీవాస్తవ ప్రత్యక్ష సాక్ష్యం. ఈ 23 ఏళ్ల సాధారణ కుర్రాడు ఈడీఎం ట్రాక్స్, హిప్‌హాప్ కంపోజర్‌గా ప్రపంచవ్యాప్తంగా అభిమానులను సంపాదించుకున్నాడు. యూట్యూబ్ స్టార్‌గా మిలియన్ల మందిని షేక్ చేస్తున్న రిత్విజ్ రాకింగ్ జర్నీ ఇది...**

# రాకింగ్

స్ఫూర్తి

మహారాష్ట్రలోని పుణేలో పుట్టిపెరిగిన రిత్విజ్‌కు యూట్యూబ్‌లో ఉన్న ఫాలోయింగ్ చూస్తే మతి పోతుంది. అతడి పాట వింటే ఫిదా కానివారు ఉండరు. శాస్త్రీయ సంగీతం అతడి ఒంటికి, ఇంటికి కొత్తేమీ కాదు. అయితే దానికి పాశ్చాత్య హంగులు అద్ది శ్రోతలను మంత్రముగ్ధులను చేయడంలోనే రిత్విజ్‌లోని కళాకారుడు కనిపిస్తాడు. వాళ్లమ్మ హిందుస్థానీ సంగీతం టీచర్. ఐదేళ్లప్పుడు అమ్మ దగ్గరే అతడు సంగీతంలో ఓనమాలు నేర్చుకున్నాడు. ఆ తరువాత పండిట్ ఉదయ్ భాస్కర్ దగ్గర మరిన్ని రాగాలు అభ్యసించాడు. నైపుణ్యం సంపాదించుకున్నాడు. పదమూడేళ్లకే ఎలక్ట్రానిక్ మ్యూజిక్ ప్రోగ్రామ్ మొదలుపెట్టాడు. అలా బాల్యంలో ఆరంభమైన సంగీతం ఇప్పుడతడి జీవితంలో భాగమైపోయింది. అదే కెరీర్‌గానూ మారిపోయింది.

### దశ తిప్పిన ట్రాక్...

చిన్న చిన్న రాగాలతో ప్రయోగాలు చేస్తున్న రిత్విజ్ జీవితాన్ని అనూహ్య మలుపు తిప్పింది 'బకార్డీ హౌస్ పార్టీ'. రెండేళ్ల కిందట నిర్వహించిన ఈ సెషన్‌లో అతడి 'ఉడ్‌గయే' ట్రాక్ వివేషంగా ఆకట్టుకుంది. భారతీయ శాస్త్రీయ సంగీతానికి ఎలక్ట్రానిక్ మ్యూజిక్ జోడించి రూపొందించిన ఈ లిరికల్ ఫ్యూజన్‌కు జనం నీరాజనం పట్టారు. నవతరానికి ఇప్పుడిది పార్టీ పాట! 3.7 కోట్ల సార్లు దీన్ని వీక్షించారు. ఈ ఒక్క ట్రాక్‌తో అతడు రాత్రికి రాత్రే స్టార్ అయిపోయాడు. యూట్యూబ్‌లో అత్యధికంగా చూసిన రిత్విజ్ పాట కూడా ఇదే! డిజిటల్ యుగంలో తనను తాను మ్యూజీషియన్‌గా తీర్చిదిద్దుకున్న అతడు ఇక ఆ తరువాత వెనక్కి తిరిగి చూసుకోలేదు.

### మరో పాట ఎప్పుడు...

'ఉడ్‌గయే' సూపర్‌హిట్‌తో నెటిజన్లు రిత్విజ్ వెంట పడ్డారు. 'నీ తరువాత పాట ఎప్పుడు' అంటూ అడగడం మొదలుపెట్టారు. ఒక్కసారిగా వచ్చిపడ్డ అభిమానం, అంచనాలతో ఉక్కిరిబిక్కిరి అయ్యాడు. "నిజంగా ఆ ఆనందం మాటల్లో చెప్పలేను. అదే సమయంలో నేను తెలియని ఒత్తిడికి లోనయ్యాను. ఇంత హిట్ పాట తరువాత వచ్చే ట్రాక్ కూడా దానికి తీసిపోకుండా ఉండాలి కదా! దీంతో 'ఉడ్‌గయే' అనంతరం తొమ్మిది నెలలు విరామం తీసుకోవాల్సి వచ్చింది. అభిమానుల గుండెల్లో అంతటి ముద్ర వేసుకున్నందుకు ఎంతో గర్వంగా అనిపించింది" అంటూ తొలినాటి జ్ఞాపకాలు గుర్తు చేసుకున్నాడు రిత్విజ్. ఆ వెంటనే 'బర్సో, జీత్, వేద్' తదితర వీనులవిందైన పాటలను విడుదల చేశాడు.



### నాలుగు మిలియన్లు...

రిత్విజ్ పాటల్లోని గొప్పదనం, ప్రత్యేకత సంప్రదాయ సంగీతాన్ని మరువకపోవడం. అతడి మాటల్లో చెప్పాలంటే 'నా పాటకు ఆత్మ భారతీయతే. అయితే దాన్ని పాశ్చాత్య సంగీతంలా అందిస్తున్నానంతే' అంటాడు. ఈ తరహా బాణీలే నెట్టింట్లో కుర్రకారును షేక్ చేస్తున్నాయి. గత నెల చివరలో విడుదైన అతడి 'లిగ్గి' ఈడీఎం (ఎలక్ట్రానిక్ డ్యాన్స్ మ్యూజిక్)ను ఇప్పటి వరకు 4 మిలియన్ల మందికి పైగా వీక్షించారు. రిత్విజ్‌కు యూట్యూబ్‌లో 4.75 లక్షల మంది ఫాలోవర్స్ ఉన్నారు. ఇన్‌స్టాగ్రామ్‌లో ఈ సంఖ్య లక్షకు పైనే! మరిచిపోలేని సంఘటనలేమైనా ఉన్నాయా అని అడిగితే... 'ముంబయ్‌లో జరిగిన మ్యూజిక్ ఫెస్టివల్‌లో అంతర్జాతీయ పాప్ సంచలనాలు క్యాటీ పెర్రీ, దువా లిపాలతో కలిసి వేదిక పంచుకోవడం నా అదృష్టం. వారితోపాటు జాతీయ అవార్డ్ అందుకున్న కంపోజర్ అమిత్ త్రివేదీ కూడా ఆ కార్యక్రమంలో పాల్గొన్నారు. నిజంగా ఇది నా జీవితంలోనే మధురమైన ఘట్టం' అంటూ సంతోషాన్ని వ్యక్తం చేస్తాడు రిత్విజ్.

### అవకాశాలు మెండు...

'సంగీతంలో తమ సత్తా చాటాలనుకొనే యువ భారత్‌కు ఇప్పుడు కావల్సినన్ని వేదికలున్నాయి. సంగీతంలో తమ ప్రతిభ ఎంతో నిరూపించుకోవాలనుకొనేవారికి అవకాశాలకు కొదువే లేదు. అయితే ఏ ట్రాక్‌లు అందించినా అవి శ్రోతలను ఆకట్టుకొనేలా, మెప్పించేలా వినూత్నంగా ఉండాలి. అప్పుడే మన శ్రమకు తగిన ఫలితం దక్కుతుంది' అంటున్న రిత్విజ్ ప్రతి పాటకూ ప్రాణం పెడతాడు. ప్రముఖ సంగీత దర్శకుడు ఏఆర్ రహమాన్ వీరాభిమాని అయిన రిత్విజ్ శ్రీవాస్తవ... ఒకటి రెండు సినిమా ప్రాజెక్ట్‌లు కూడా చేస్తున్నాడు. 'రాబోయే రోజులు నాలాంటి ఇండిపెండెంట్ మ్యూజీషియన్లవే' అంటున్న రిత్విజ్... ఎందరో ఔత్సాహికులకు ప్రేరణగా నిలుస్తున్నాడు.

---

వంటిల్లు

**సంక్రాంతి పండక్కి రంగవల్లులతో పాటు నోరూరించే పిండివంటలు ఉండాల్సిందే. బెల్లం అరిసెలు, సకినాలే కాకుండా వెరైటీగా నువ్వుల అరిసెలు, గోరుమీటీలు, కొబ్బరి బూరెలతో ఇంటిల్లిపాది వేడుక చేసుకోండి.**

## నువ్వుల అరిసెలు

**కావలసినవి**

బియ్యం - ఒక కేజీ, బెల్లం - అర కేజీ, యాలకుల పొడి - ఒక టీస్పూన్, నువ్వులు - 50 గ్రాములు, నూనె - డీప్ ఫ్రైకి సరిపడా, అరిసెల చెక్కలు.

**తయారీ**

- ముందుగా బియ్యంను ఒక రోజంతా నానబెట్టాలి. తరువాత వాటిని మెత్తటి పిండిలా పట్టుకోవాలి.
- ఒక పాన్ తీసుకొని స్టవ్‌పై పెట్టి బెల్లం వేసి, ఒక కప్పు నీళ్లు పోసి చిన్నమంటపై మరిగించాలి.
- బెల్లం కరిగి పానకం తయారయ్యాక నువ్వులు వేయాలి.
- యాలకుల పొడి, నెయ్యి వేసి కలుపుకోవాలి.
- స్టవ్ ఆర్పేసి బియ్యం పిండిని వేసి గడ్డలు లేకుండా కలుపుకోవాలి. మరీ మెత్తగా కాకుండా చూసుకోవాలి.
- చేతులకు కొద్దిగా నూనె రాసుకుంటూ పిండిని కొద్ది కొద్దిగా తీసుకొని అరిసెలుగా ఒత్తుకోవాలి.
- వెడల్పాటి పాన్ స్టవ్‌పై పెట్టి నూనె పోసి వేడి అయ్యాక అరిసెలు వేసి వేగించాలి. రెండు వైపులా సమంగా వేగేలా చూసుకోవాలి.
- అరిసెలకు నూనె ఎక్కువగా ఉంటే కనుక చెక్కలతో ఒత్తుకోవాలి.

# పండగ పసందు!

## పనియారం
(పొంగణాలు)

**కావలసినవి**

ఇడ్లీ పిండి - రెండు కప్పులు, ఉల్లిపాయ - ఒకటి, పచ్చిమిర్చి - రెండు, అల్లం ముక్క - కొద్దిగా, ఇంగువ - చిటికెడు, మిరియాలపొడి - పావు టీస్పూన్, కారం - పావు టీస్పూన్, కరివేపాకు - కొద్దిగా, కొబ్బరి తురుము - అర కప్పు, ఉప్పు - తగినంత.

**తయారీ**

- ఒక పాత్రలో ఇడ్లీ పిండి తీసుకొని అందులో ఉల్లిపాయలు, పచ్చిమిర్చి, కొబ్బరి తురుము, దంచిన అల్లం ముక్క, ఇంగువ, మిరియాల పొడి, కారం, కరివేపాకు, కొద్దిగా ఉప్పు వేసి కలియబెట్టాలి.
- పొంగణాల పాత్రను స్టవ్‌పై పెట్టి కొద్దిగా నూనె వేయాలి. స్పూన్‌తో పిండిని పొంగణాల గుంతల్లో వేయాలి.
- చిన్నమంటపై రెండు మూడు నిమిషాలు ఉడికించి స్పూన్ సహాయంతో పొంగణాలను తిప్పి మరికాసేపు ఉడికించి దింపుకోవాలి.
- కొబ్బరి చట్నీ లేదా సాంబరుతో తింటే రుచిగా ఉంటాయి.

## గోరుమీటీలు

**కావలసినవి**

మైదా - పావుకేజీ, బొంబాయి రవ్వ - మూడు టేబుల్‌స్పూన్లు, వెన్న - రెండు టేబుల్‌స్పూన్లు, పంచదార - 200 గ్రాములు, బెల్లం - రెండు టేబుల్‌స్పూన్లు, యాలకులు - రెండు, నూనె - డీప్ ఫ్రైకి సరిపడా, నెయ్యి - ఒక టేబుల్‌స్పూన్, ఉప్పు - కొద్దిగా.

**తయారీ**

- ఒక పాత్రలో మైదా పిండి తీసుకొని అందులో వెన్న, కొద్దిగా ఉప్పు వేసి, తగినన్ని నీళ్లు పోసి కలపాలి.

మిశ్రమం మెత్తగా రావాలంటే కొద్దిగా నూనె వేయాలి. తరువాత రవ్వ కలిపి అరగంట పాటు పక్కన పెట్టుకోవాలి.

- పిండిని కొద్ది కొద్దిగా తీసుకుంటూ బొటన వేలుపై గోరుమీటీలు చేసుకోవాలి.
- పాన్‌లో నూనె పోసి కాస్త వేడి అయ్యాక గోరుమీటీలను వేసి వేగించాలి.
- మరొక పాత్రలో అర కప్పు నీళ్లు పోసి పంచదార, బెల్లం పానకం తయారుచేయాలి. అందులో యాలకుల పొడి, నెయ్యి వేయాలి.
- ఇప్పుడు వేగించి పెట్టుకున్న గోరుమీటీలను పానకంలో వేయాలి. వీటిని పిల్లలు ఇష్టంగా తింటారు.

## కొబ్బరి బూరెలు

**కావలసినవి**

బియ్యప్పిండి - కేజీ, బెల్లం - ముప్పావు కేజీ, కొబ్బరి ముక్కలు - రెండు, డాల్డా - 100గ్రాములు, నూనె - డీప్ ఫ్రైకి సరిపడా.

**తయారీ**

- బియ్యాన్ని రాత్రంతా నానబెట్టి ఉదయాన్నే గ్రైండ్ చేయాలి.
- కొబ్బరి ముక్కలు, బెల్లంను విడిగా గ్రైండర్ వేసి పొడి చేసుకోవాలి.
- వెడల్పాటి పాన్‌లో బెల్లంను వేడి చేయాలి. బెల్లం త్వరగా కరగడానికి కొద్దిగా నీళ్లు పోయాలి. బెల్లం పానకం వేళ్లకు అంటుకున్నట్లుగా ఉండేలా చూసుకోవాలి.
- ఇప్పుడు ఈ పానకంలో కొబ్బరి పొడి యాలకుల పొడి, డాల్డా వేసి కలియబెట్టాలి.
- ఇప్పుడు బియ్యప్పిండి వేసి కలపాలి.
- తరువాత పిండిని చిన్నచిన్న బూరెల మాదిరిగా ఒత్తుకోవాలి.
- పాన్‌లో నూనె పోసి బూరెల్ని గోధుమ రంగులోకి మారే వరకు వేగించాలి.



---

# సరిగ్గా వాడితే గెలుపు మీదే!

టెక్ ఫర్ యూత్

టిక్‌టాక్, పబ్జీ గేమ్, ఫేస్‌బుక్, వాట్సప్... టెక్నాలజీ అంటే ఇవే కాదు. మిమ్మల్ని మీరు తీర్చిదిద్దుకోవడానికి, ఉన్నత స్థానాలకు చేరుకోవడానికి టెక్నాలజీ ఎంతగానో ఉపయోగపడుతుంది.

**మెరుగుపరుచుకోండిలా...**

నాయకత్వ లక్షణాలు, కమ్యూనికేషన్ స్కిల్స్, బాడీ లాంగ్వేజ్ మెరుగుపరుచుకోవడానికి అవసరమైన సూచనలు, సలహాలు udemy, linkedin learningలో లభిస్తాయి. ప్రతీ మూడు నెలలకు ఒక కోర్సు తప్పనిసరిగా పూర్తి చేయాలని లక్ష్యం పెట్టుకుని వాటిని పూర్తి చేయొచ్చు. కొన్ని ఆన్‌లైన్ కోర్సులు సర్టిఫికేషన్ కూడా అందిస్తూ ఉంటాయి.

**స్ఫూర్తి పాఠాలు**

scribd... ఇందులో కొన్ని కోట్ల ఇ-బుక్స్, ఆడియో బుక్స్ లభిస్తాయి. అవసరాన్ని బట్టి నామమాత్రపు మొత్తంతో పెయిడ్ సబ్‌స్క్రిప్షన్ తీసుకుంటే సరిపోతుంది. స్ఫూర్తి కలిగించే ప్రసంగాలు కావాలంటే టెడ్‌టాక్స్‌ను ఎంచుకోండి. కచ్చితంగా మీ ఆలోచనా విధానం మారిపోతుంది.

**ఫాలో అవ్వండి**

magzter ద్వారా ప్రపంచవ్యాప్తంగా వివిధ రంగాలకు సంబంధించి 5వేలకు పైగా వార, మాస పత్రికలను ఫాలో కావచ్చు. వివిధ రంగాలకు సంబంధించి ప్రత్యేకంగా నిర్వహించబడే పత్రికలు కూడా దీంట్లో ఉంటాయి.

**ఏకాగ్రత కోల్పోకుండా..**

focus me, pomodoro, timer వంటి ప్రత్యేకమైన అప్లికేషన్స్ ఇన్‌స్టాల్ చేసుకోవడం ద్వారా, మీరు చేసే పని మీద మాత్రమే దృష్టి పెట్టే విధంగా జాగ్రత్త వహించవచ్చు.

**నల్లమోతు శ్రీధర్**
fb.com/nallamothusridhar

---

# ఫ్యాషన్ టీ20

లేటెస్ట్'

చూడ్డానికి ఇంపుగానే కాదు కళ్లు తిరిగేలా ఉన్నా ఫ్యాషనే ఇప్పుడు. ఒక్క మాటలో చెప్పాలంటే మ్యాచింగ్ ఒకప్పటి మాట! 'అటో రకం... ఇటో రకం' ఇప్పటి ట్రెండ్! బాలీవుడ్ సూపర్ హీరోయిన్ దీపికా పదుకొనే నుంచి నవతరం నాయకి అనన్యా పాండే వరకు... కొత్త సంవత్సరంలో తారలందరిదీ అదే దారి.

దీపికా పదుకొనే లూజ్ ఓపెన్ షర్ట్‌పై టైట్ ఫిట్టెడ్ కోర్సెట్ వేస్తే... అలియా భట్ డెనిమ్ మిక్స్ ట్రెంచ్‌కోట్‌తో, అనన్యా పాండే రెండు రంగులు కలిపి కుట్టిన జీన్స్‌తో వినూత్నంగా కనిపించారు. ఈ ఏడాది ఇలాంటి అసాధారణ డిజైన్లూ మెప్పిస్తాయనేది ఫ్యాషన్ డిజైనర్ల అభిప్రాయం. మరి మీరూ కొత్తగా, నలుగురి దృష్టిలో పడాలనుకొంటే... ఈ 'అవుటాఫ్ ద బాక్స్' 2020 ఫ్యాషన్ ట్రై చేయండి.

## ముత్యాల ముగ్గు



17 చుక్కలు
సరిచుక్క
1 వచ్చే వరకు

**చేతరాశి కవిత**
మోత్కూర్, యాదాద్రి

20-10 సరి చుక్కలు
10 వరుసలు
10 వచ్చే వరకు

**ఎస్. సుమతి**
కూర్మాయిపల్లి, చిత్తూరు

మీ ముత్యాల ముగ్గుతో పాటు మీ ఫొటో, పోస్టల్ అడ్రస్, ఫోన్ నంబర్ కూడా వివరంగా రాయండి.

మా చిరునామా... నవ్య, ముత్యాలముగ్గు, ఆంధ్రజ్యోతి కార్యాలయం, రోడ్ నెంబర్ 70, జూబ్లీహిల్స్, హైదరాబాద్-500033. Email: navya@andhrajyothy.com

తిరుప్పావై

# ఆరగించు గోవిందా!

## ఇరవై ఏడో పాశురం

**కూడారై వెల్లుమ్ శీర్ గోవిన్దా! ఉన్ దన్నై**
**ప్పాడిప్పరై కొండు యామ్ పెరు శమ్మానమ్**
**నాడుపుగళుమ్ పరిశినాల్ నన్రాగ,**
**శూడగమే తోళ్ వళైయే, తోడే శెవిప్పూవే,**
**పాడగమే, ఎన్రనైయ పల్కలనుమ్ యామ్ అణివోమ్;**
**ఆడై ఉడుప్పోమ్, అదన్ పిన్నే పార్చోరు**
**మూడ, నెయ్ పెయ్దు ముళంగై వళివార**
**కూడి యిరున్దు కుళిర్న్దు ఏల్ ఓర్ ఎంబావాయ్!**



ప్రముఖ చిత్రకారుడు చన్నా బ్యూలా

**భావం:** గోపికలు తాము పొందవలసిన ఫలాన్ని ఇవ్వాలని స్వామిని కోరుతున్నారు. ఇంతవరకూ స్వామిని వివిధ నామాలతో వారు సంబోధించినా 'గోవిందా' అని పిలువలేదు. ఇది విచిత్రంగా కనిపిస్తున్నా, ఆంతర్యం అంతా అందులోనే ఉంది. వ్రతానికి ప్రధానమైన ఫలాన్ని నిర్దేశించిన పాశురం ఇది. "స్వామీ! 'నీతో, నీవారితో చేరబోము' అనే శత్రువులను జయించే పరాక్రమం కలిగిన గోవిందా! నిన్ను సేవించి, నీ గానం చేసి, 'పర' అనే వాద్యాన్ని పొంది, నీవల్ల మేము పొందే సన్మాన గౌరవాన్ని జనులు అందరూ అదే పనిగా ప్రస్తుతించే రీతిలో వస్త్రాభరణాలు, దండ కడియాలు, పాద మంజీరాలు, దుద్దులు, ముక్కు పుడకలు... అన్నీ ధరించి నీ దగ్గర ఉంటాం. ఆ తరువాత పాలలో ఉడికిన అన్నం (పాయసం) పాత్రలో... పూర్తిగా మునిగేలా పోసిన నెయ్యి మోచేతుల మీదుగా జారుతూ ఉంటే, నీతో, మన వారందరితో కలిసి ఆరగిస్తాం. ఇదే మా కోరిక. మా వ్రతం అద్వితీయమైనది, భవ్యమైనది" అని గోపికలు విన్నవిస్తున్నారు.

● ఎ. సీతారామమూర్తి

**"ఒక్కోసారి మన బలాన్ని ఉపయోగించకుండా పోరాటం చేయాల్సిన పరిస్థితులు ఎదురవుతాయి. అందువల్ల కొత్త కథలు సమకూర్చుకోవడంలో తప్పులేదనుకుంటాను. ప్రేక్షకుడి ఇష్టం, అభిమానం కూడా మనల్ని బందీని చేస్తుంది. భయాన్ని గెలవడమనేది గేమ్ ఆఫ్ లైఫ్ అని నేనంటాను. భయంపైనే నా పోరాటం" అని త్రివిక్రమ్ అన్నారు. 'అల వైకుంఠపురములో' గురించి దర్శకుడు త్రివిక్రమ్ మాట్లాడారు.**

చిరంజీవిగారు హీరోగా డీవీవీ దానయ్య నిర్మాతగా ఓ సినిమా అనుకున్నాం. చిరంజీవిగారికి లైన్ చెప్పానంతే. అయితే ఆ కథ ఇంకా కొలిక్కి రాలేదు. 'పింక్' తెలుగు రీమేక్‌లో రచయితగా నా ఇన్‌వాల్వ్‌మెంట్ ఏమీ లేదు. జస్ట్ పవన్ కళ్యాణ్, 'దిల్' రాజును కూర్చోబెట్టి 'పింక్' షో వేయించానంతే.

# ముగ్గురం కూర్చొని... మూడు పేజీలు రాసుకున్నాం

- త్రివిక్రమ్

"మనం ఎవరికైనా స్థానం ఇవ్వగలం కానీ, స్థాయి ఇవ్వలేం. స్థాయి అనేది ఎవరికి వాళ్లు తెచ్చుకోవాల్సింది. ఇదే ఈ సినిమా కథ. దానికి ఇల్లు ఆధారం. మనం ఏ కథ చెప్పినా రామాయణ, భారతాలను దాటి కొత్త కథ చెప్పలేమనేది ఈ ప్రపంచంలో అందరూ ఒప్పుకొనే మాట. వాటికి సంబంధించిన ఏదో ఒక ఛాయ ఈ కథలో కనిపిస్తూ ఉండవచ్చు. థియేటర్ నుంచి బయటకొచ్చే ప్రతి ప్రేక్షకుడూ సంపూర్ణమైన ఆనందంతో బయటకొస్తాడు. చీర నేసిన వాడికి దాని అందం తెలీదు. ఒక అనుభూతితో నేసుకుంటూ వెళ్లిపోవడం తప్ప. నేనూ అంతే. ఒక సినిమాతో నేనింత ఎత్తుకు ఎదగాలని ఏ దర్శకుడూ అనుకొని చెయ్యడు. కథ రాసేంతవరకే రచయిత దానికి రాజు. తర్వాత ఆ కథకు అతను బానిస.

### అలా సింబలైజ్ చేశాను..

మనం ప్రపంచమంతా తిరిగొచ్చినా ఇంటి దగ్గర ఉండే సుఖం వేరు. మనకు తెలియకుండానే ఇల్లు మన సంస్కృతిలో ఒక భాగం. బహుశా నేను ఆ ఇంట్లో ఆనందాన్ని వెతుక్కొనే ప్రయత్నం చేస్తానేమో. అందుకే నా సినిమాల్లో కథకి ఇల్లు కేంద్రంగా ఉంటుంది. 'అల.. వైకుంఠపురములో' సినిమాలో 'వైకుంఠపురం' అనే ఇంటికి ఉన్న విలువను అలా సింబలైజ్ చేశాను. ఆ ఇంటికి హీరో ఎందుకెళ్లాడనేది ఆసక్తికరంగా ఉంటుంది.

### కొత్తగా భయపెట్టేది ఏముంటుంది!

కెరీర్ బిగినింగ్‌లో చేసే ప్రతి పని అందరితో చెప్పేయాలనీ, వారి ప్రశంసలు పొందాలని ఉంటుంది. కొంతకాలం గడిచాక ప్రశంసలు తగ్గుతాయి. అంచనాలు పెరిగిపోతాయి. దాంతో దారి మార్చుకొని ఎందుకూ పనికి రాకుండా పోయే ప్రమాదమూ ఉంది. అంచనాలు పెరగడం వల్ల ఆ బరువుకు కుంగిపోయి, చెప్పాలనుకున్నది చెప్పలేక ఒక సాధారణ స్థితికి వచ్చి, సేఫ్ జోన్‌లోకి వ్యూమ్ అయ్యే ఛాన్స్ ఉంది. ప్రతిసారీ ఈ రెండింటినీ గెలవడానికి ఎలాంటి వారైనా ప్రయత్నం చేయాల్సిందే! 'అరవింద సమేత' నుంచి నా భయాలతో ఫైట్ చేస్తూ వస్తున్నా. 'అజ్ఞాతవాసి' లాంటి పరాజయం తర్వాత మళ్లీ సక్సెస్‌లోకి రావాలంటే నాకు అలవాటైన హ్యూమర్, వన్‌లైన్ పంచ్‌లు ఇలా నా బలాలున్న నేపథ్యానికి జానర్‌కి వెళ్లిపోతే 'మళ్లీ సక్సెస్ పక్కా' అని చాలామంది అనుకుంటారు. నా చుట్టూ ఉన్నవాళ్లూ దానివైపే తొయ్యాలని చూస్తారు. కానీ నేనలా చేయలేదు. పరాజయాలు ఎదురయ్యాక కొత్తగా భయపెట్టేది ఏముంటుంది? అందుకే భయాన్ని గెలవాలంటే ఇదే సమయమనుకున్నా. నా బలాల్ని పూర్తిగా వదిలేయకుండా వాటిని కాస్త పక్కన పెట్టి సీరియస్ సబ్జెక్ట్‌తో 'అరవింద సమేత' చేశా. మళ్లీ అలాంటి కథే చెప్పకూడదు కాబట్టి రూట్ మార్చి 'అల...' సినిమా తీశా. ప్రతిసారీ మనం మారడానికి ప్రయత్నించాలి.

### ఏదీ ఆ టైంలో ఎఫెక్ట్ చెయ్యదు!

థియేటర్లో లైట్లు ఆర్పిన తర్వాత ప్రేక్షకులు కులం, మతం, జాతి.. వీటన్నిటికీ అతీతంగా తమ ముందున్న సినిమాని చూస్తారు. వాళ్లను ఏదీ ఆ టైంలో ఎఫెక్ట్ చెయ్యదు. నవ్వొస్తే నవ్వుతారు, ఆనందం వస్తే ఆనందిస్తారు. కళ్లల్లో నీళ్లొస్తే ఏడుస్తారు. ప్రేక్షక దేవుడంటే మనం తెలుసుకోవాల్సింది.. పొజిషన్ కాదు, కండీషన్.

### అలా రాయడానికి కారణం ఆవిడే!

1950ల నుంచి 1970 దాకా స్త్రీలే ఇంటి బాధ్యతలు చూసుకునేవారు. అంటే పైకి చెప్పని మాతృస్వామ్య విధానం ఉండేది. '70ల తర్వాత ప్రయాణాలు పెరిగి, ఉన్న చోటు నుంచి వేరే చోట్లకు వెళ్లి ఉద్యోగాలు, వ్యాపారాలు చేయాల్సి రావడం వల్ల ఇళ్లల్లో వాళ్ల భాగస్వామ్యం తగ్గింది. 'అత్తారింటికి దారేది' క్లైమాక్స్ అలా రాయడానికి కారణం మా అత్త. ఆవిడంటే నాకు ఇష్టం. తల్లి తర్వాత పిన్ని, తండ్రి తర్వాత మేనత్త అని ఓ నానుడి ఉంది. అలాంటి అత్తని మనం ఎందుకు తక్కువ చేసి చూపిస్తాం? ఇవన్నీ తెలీకుండానే సినిమాలో ప్రతిఫలించి ఉండొచ్చు.

### ఆ మాటతో ఏకీభవించను...

ఏ సినిమానైనా ఓ ప్రేక్షకుడిగా నెగిటివ్ ఆలోచన లేకుండా చూస్తా. కొన్ని సినిమాలు చూసినప్పుడు ఆశ్చర్యానికి గురవుతా. 'అరె.. భలే రాశాడే', తక్కువ బడ్జెట్‌లో ఇదెలా సాధ్యమైంది? మనం ఎందుకు ఇలా చేయలేకపోతున్నాం' అని కచ్చితంగా అనిపిస్తుంది. కొన్ని సినిమాలు చూశాక 'ఈ ఆలోచన మనకెందుకు రాలేదనే' జెలసీ కూడా వస్తుంది. అంతే కానీ ఫలానా వ్యక్తి నాలా రాస్తున్నాడు. నన్ను అనుకరిస్తున్నాడు అన్న కోణంలో ఎప్పుడూ ఆలోచించను. నా డైలాగ్‌ల వల్ల సినిమా ఆడుతుందనే మాటతో ఏకీభవించను. ఎందుకంటే.. కథ, పాత్రలు, సన్నివేశాలు.. తర్వాతే మాటలు.

### దాని వెనక చాలా కృషి ఉంది..

ఇందులో పాటలు ఇంతగా ఆదరణ పొందడం వెనుక చాలామంది కృషి ఉంది. నాకు సంగీతం చెయ్యడం రాదు, పాడడం రాదు. గిటారు వాయించాలని, అమ్మాయిలు నావైపు ఆరాధనగా చూడాలని.. ఇలా నాలో ఎన్నో కోరికలుంటాయి. కానీ ఇవేమీ జరగవు. క్షణం తీరిక లేకుండా ఎవరి పనిలో వారు బిజీగా ఉంటున్న రోజులివి. అందుకే సాంగ్స్ ప్రమోషన్ మీద ఎక్కువ దృష్టి పెట్టాం. 'సామజవరగమన' పాట ఇప్పుడు ఏదైతే లైవ్‌లో ఉందో అదే సింగిల్ ట్యూన్‌లో తమన్ చేశాడు. ఆ ట్యూన్‌కి 'సామజవరగమన' పదం తగిలిస్తే బావుంటుందని సజెస్ట్ చేశానంతే. శాస్త్రి గారు 45 నిమిషాల్లో పాట రాసేశారు. కాకినాడలో షూటింగ్ జరిగేటప్పుడు బన్నీ, నేను, తమన్.. ముగ్గురం కూర్చొని.. 'సామజవరగమన', 'రాములో రాములా', 'ఓ మైగాడ్ డాడీ' పాటల్ని ఎలా జనంలోకి తీసుకెళ్లాలని మూడు పేజీలు రాసుకున్నాం.

### నాదేమీ పెద్ద కష్టం కాదు..

కెరీర్ బిగినింగ్‌లో కష్టాలు పడ్డా. వేషాల కోసం తిరిగే రోజుల్లో ఎల్వీ ప్రసాద్‌గారు కటిక నేలపై పడుకునేవారని విన్నా. ఆయన కష్టం ముందు నా కష్టం ఏ పాటిది! నాకంటే ఎక్కువ కష్టాల్లో ఉన్నవారిని చూస్తే నాదేమీ కష్టం కాదనిపిస్తుంది. 'నువ్వు పడిన కష్టం గురించి ఎక్కడా మాట్లాడవెందుకు?' అని సన్నిహితులు అడుగుతుంటారు. పేద.. ధనిక... ఎవరి కష్టాలు వారికుంటాయి.

### సరైన కథ కుదరకే...

ప్యాన్ ఇండియా స్థాయిలో తెరకెక్కించే కథ నిజానికి ప్రస్తుతం నా దగ్గర లేదు వేరే భాషలోకి అడుగు పెట్టడం పెద్ద కష్టమేమీ కాదు. కానీ సరైన కథ లేకుండా వెళ్లి ఏమీ చేయలేం. 'అల...' తర్వాత ఎవరితో సినిమా చేయాలన్నది ఇంకా డిసైడ్ కాలేదు. కథ అల్లుకొని, దానికి ఎవరు సరిపోతారనుకుంటే వాళ్లతో చేస్తా. ●

### చేసే పనిని అభిమానిస్తారు...

ప్రేక్షకులు అభిమానించేది మనల్ని కాదు.. మనం చేసే పనిని. ఆ కోణంలో ఆలోచిస్తేనే మన పని మనం కరెక్ట్‌గా చేసుకోగలం. లేకపోతే మరీ సీరియస్ అయిపోయి, స్తబ్దతకు గురవుతాం. ప్రజల ఇష్టాన్ని పరిగణన లోకి తీసుకోవాలి. అయినా సినిమా నచ్చలేదంటే నేను చేసిన పని నాది కానట్లు లెక్క.

### ఇంట్లోనే కథ రాసుకుంటా...

నేను కథలు రాయడానికి మనం ఉన్న పరిస్థితులే స్ఫూర్తినిస్తాయి. అంతేకానీ, ఓ రచయితగా నాపై ఎవరి ప్రభావం లేదు. ప్రస్తుతం పతంజలిగారి రచనలు చదువుతున్నా. నేనొక కథ రాయాలి అంటే విదేశాలకు, విలాసవంతమైన హోటల్లు, ఖరీదైన భోజనం ఇవేమీ అవసరం లేదు. మా ఆవిడ వంటింట్లో కూని రాగాలు తీస్తూ వంట చేస్తుండగా, మా పిల్లలు ఇంట్లో అల్లరి చేస్తున్న సమయంలో సరదాగా ఇంట్లో కూర్చుని కథ రాసేస్తా. అదే నాకు కంఫర్ట్ కూడా.

## దారి కనుక్కోండి?



## డైలీ సుడోకు - 249

| | | | | | | | | |
|---|---|---|---|---|---|---|---|---|
| | 3 | | 7 | | | | | |
| 6 | 1 | | 9 | | | 7 | 8 | |
| | | 7 | 5 | | | 9 | | |
| | 7 | 6 | | | 5 | | 4 | |
| | | | | 9 | | | | |
| | 9 | | 6 | | | 5 | 8 | |
| | | 1 | | | 7 | 4 | | |
| 4 | 6 | | | | 3 | | 9 | 5 |
| | | | | | 9 | | 2 | |

ప్రతి బాక్స్‌లో 9 గళ్లు ఉంటాయి. ఒక్కో బాక్స్‌ను 1 నుంచి 9 వరకు అంకెలతో పూరించాలి. అన్ని బాక్స్‌లనూ కలిపి చూస్తే నిలువుగా, అడ్డంగానూ ఏ లైనులోనూ ఒకసారి వాడిన అంకెను తిరిగి వాడకూడదు.

### సుడోకు- 248 సమాధానం

| | | | | | | | | |
|---|---|---|---|---|---|---|---|---|
| 7 | 4 | 1 | 3 | 6 | 9 | 8 | 2 | 5 |
| 9 | 2 | 6 | 4 | 5 | 8 | 7 | 1 | 3 |
| 5 | 3 | 8 | 2 | 7 | 1 | 6 | 9 | 4 |
| 6 | 7 | 4 | 1 | 3 | 5 | 9 | 8 | 2 |
| 2 | 9 | 5 | 6 | 8 | 7 | 4 | 3 | 1 |
| 8 | 1 | 3 | 9 | 4 | 2 | 5 | 7 | 6 |
| 4 | 5 | 7 | 8 | 2 | 3 | 1 | 6 | 9 |
| 3 | 8 | 9 | 5 | 1 | 6 | 2 | 4 | 7 |
| 1 | 6 | 2 | 7 | 9 | 4 | 3 | 5 | 8 |

# 'దేవి మామూలోడు కాదు' అన్నారు మహేశ్!

దేవిశ్రీ ప్రసాద్

**"తొలి చిత్రం చేసేటప్పుడు ఒక భయం ఉంటుంది. ఆ భయం ఉన్నంతవరకు ఎటువంటి సమస్య ఉండదు. 'మన్మథబాణం'లో 'నీలాకాశం' పాటలో దృశ్యాలు రివర్స్‌లో ఉంటాయి. కమల్‌హాసన్‌గారు ఆ సంగతి చెప్పినప్పుడు భయపడి పాటలన్నీ పూర్తయ్యాక ఈ పాట చేస్తానని చెప్పా. చివర్లో ఆ పాట చేశా. కమల్‌గారితో భయపడ్డానని చెప్పినప్పుడు 'ఆ భయాన్ని అలాగే ఉండనివ్వు. అదే నిన్ను, నన్ను కాపాడుతుంది' అన్నారు. నేను ప్రతి చిత్రాన్ని తొలి చిత్రంగా భావించి భయంతో పని చేస్తా" అని దేవిశ్రీ ప్రసాద్ అన్నారు. మహేశ్‌బాబు హీరోగా అనిల్ రావిపూడి దర్శకత్వంలో రామబ్రహ్మం సుంకర నిర్మించిన చిత్రం 'సరిలేరు నీకెవ్వరు'. 'దిల్' రాజు సమర్పకులు. శుక్రవారం సినిమా విడుదల. ఈ సందర్భంగా దేవిశ్రీ ప్రసాద్ చెప్పిన సంగతులు...**

'వన్ నేనొక్కడినే', 'శ్రీమంతుడు', 'భరత్ అనే నేను', 'మహర్షి' తర్వాత మహేశ్‌బాబుతో నేను చేస్తున్న ఐదో చిత్రమిది. ఆయనతో నేను చేసినవన్నీ గొప్ప చిత్రాలే. ప్రతి చిత్రంలో సందేశం ఉండేలా చూసుకుంటారు. అలాగే, టెక్నిషియన్‌కు చివరి వరకు సపోర్ట్ ఇచ్చే హీరో ఆయన. అందుకనే, ఆయనంటే నాకెంతో గౌరవం. అంతపెద్ద హీరో మనపై నమ్మకం పెట్టుకున్నప్పుడు గౌరవం, బాధ్యత పెరుగుతాయి. మంచి పాటలు వస్తాయి.

✶ 'సరిలేరు నీకెవ్వరు'లో సందేశం, మహేశ్ అభిమానులు కోరుకొనే మాస్ అంశాలు, అనిల్ రావిపూడి నుంచి ఆశించే వినోదం ఉంటాయి. మహేశ్ అభిమానులు 'మా హీరోకి మాస్ సాంగ్ ఎప్పుడిస్తావ్' అని సోషల్ మీడియాలో అడుగుతుంటారు. సినిమా ప్రారంభోత్సవంలో వాళ్లకు 'మాస్ సాంగ్, పార్టీ సాంగ్ ఇస్తాను' అని మాటిచ్చా. అనిల్ రావిపూడి చక్కటి సందర్భాలు చెప్పడంతో 'మైండ్ బ్లాక్', 'డాంగ్ డాంగ్' కుదిరాయి. చేతికి మల్లెపూలు, లుంగీ, జుబ్బాతో మహేశ్‌గారు సాంగ్ చేస్తారా? లేదా? అని షూటింగ్ పూర్తయ్యే వరకూ టెన్షన్ పడ్డా. ఎందుకంటే... ఆయనెప్పుడూ అంత మాసీగా చేయలేదు. ఒక రేంజ్‌లో వచ్చింది సాంగ్. మహేశ్‌తో కమర్షియల్ చిత్రం, మాస్ పాట చేయలేదనే లోటు ఈ చిత్రం తీర్చింది.

✶ నాకు సైనికులంటే ఎంతో గౌరవం. ఎక్కడైనా కనిపిస్తే... వాళ్లకు దారి ఇచ్చేసి నేను వెళతా. ఇప్పటివరకూ సైనికుల నేపథ్యంలో సినిమా చేసే అవకాశం నాకు రాలేదు. ఈ సినిమాలో రావడంతో సైనికుల త్యాగాలను తెలిపేలా 'భగ భగ భగ మండే...' పాట నేను రాశా. లండన్‌లో సింఫనీ ఆర్కెస్ట్రాతో రికార్డ్ చేశాం. మహేశ్‌కి పాట వినిపిస్తే... రెండున్నర గంటల కథను ఒక్క పాటలో వినిపించాడు. దేవి మామూలోడు కాదు' అన్నారు. చాలా సంతోషంగా అనిపించింది. మహేశ్‌ది చిన్నపిల్లాడి మనస్తత్వం. మనం మంచి అవుట్‌పుట్ ఇస్తే ఎగ్జయిట్ అవుతారు. చిరంజీవిగారిలోనూ ఆ లక్షణం ఉంది.

✶ మహేశ్, విజయశాంతి కాంబినేషన్‌లో సీన్స్ అదిరిపోతాయి. సినిమాలో ఇద్దరూ 'తప్పు చేస్తే కాలర్ పట్టుకుని అడిగే రకం'. అంతకు మంచి కథ గురించి చెప్పలేను. కామెడీ సీన్స్ కూడా బాగా వచ్చాయి.

✶ ప్రేక్షకుల ప్రశంసలను మించిన పురస్కారాలు లేవు. ఒక్కోసారి మనపై ఎక్కువ అంచనాలు పెట్టుకోవడం వల్ల పాటలు నచ్చలేదని సోషల్ మీడియాలో పోస్టులు చేస్తారు. మళ్లీ వారం రోజుల తర్వాత వాళ్లే 'అన్నా... సారీ అన్నా. పాట బావుంది' అంటారు. వాళ్లు ఫీలైనది చెప్పడంలో తప్పు లేదని నా ఫీలింగ్. ప్రస్తుతం టిక్ టాక్, సోషల్ మీడియా యాప్స్‌లో 'హి ఈజ్ సో క్యూట్', 'మైండ్ బ్లాక్', 'డాంగ్ డాంగ్' సాంగ్స్ ట్రెండ్ అవుతున్నాయి.

✶ ప్రస్తుతం అల్లు అర్జున్ హీరోగా సుకుమార్ దర్శకత్వంలో రూపొందుతున్న చిత్రంతో పాటు 'ఉప్పెన', 'రంగ్ దే', నగేశ్ కుకునూర్‌గారి 'గుడ్ లక్ సఖి' చిత్రాలకు సంగీతం అందిస్తున్నా. హిందీలో ఓ చిత్రం చేయబోతున్నా. త్వరలో ఆ వివరాలు చెప్తా.

✶ నా ప్రైమరీ ఇంట్రెస్ట్ నటన కాదు. సంగీతమే. సంగీతంపై ప్రేమతో హీరోగా చేయాలనే ఆసక్తి రావడం లేదు. తమిళం నుండి ఎక్కువ కథలు వస్తున్నాయి. సంగీత నేపథ్యంలో కథ వస్తే... తెలుగు, తమిళ భాషల్లో నటిస్తా.

## దక్షిణాదిలో గొప్ప చిత్రాలొస్తున్నాయి!

"నాతో పని చేయడం కష్టమని మాట్లాడిన వాళ్లకు... అశ్విని వంటి దర్శకులే సమాధానం చెబుతున్నారు. నా గురించి తనకు చాలా మంది ఏవోవో విషయాలు చెప్పినా తను పట్టించుకోలేదు. పనిపై స్పష్టత ఉన్న దర్శకురాలు" అని కంగనా రనౌత్ అన్నారు. అశ్వినీ అయ్యర్ తివారీ దర్శకత్వంలో

కంగనా రనౌత్ ముఖ్య పాత్రలో నటించిన చిత్రం 'పంగా'. జస్సీ గిల్, రిచా చద్దా కీలక పాత్రధారులు. ఈ నెల 24న సినిమా విడుదలవుతున్న సందర్భంగా కంగనాతో పాటు దర్శకురాలు శుక్రవారం హైదరాబాద్ వచ్చారు. మీడియాతో ముచ్చటించారు. కంగనా రనౌత్ మాట్లాడుతూ "ఈ చిత్రంలో మధ్య తరగతి మహిళగా, పిల్లల తల్లిగా నటించా. మహిళా సాధికారత చిత్రాలు చేశా. అయితే... 'మణికర్ణిక' తర్వాత ఇందులో తల్లి పాత్రలో జీవించాను. చాలా గొప్పగా అనిపించింది. ఇందులో జాతీయ స్థాయి కబడ్డీ క్రీడాకారిణి పాత్ర పోషించా. ఆటకు, కుటుంబ బాధ్యతలకూ మధ్య నలిగిపోయే మధ్యతరగతి గృహిణి పాత్ర. అశ్విని కథ చెప్పినప్పుడు తల్లి క్యారెక్టర్, క్యారెక్టరైజేషన్ నచ్చాయి" అన్నారు.

## అల్లు అరవింద్‌కు పురస్కారం

తెలుగు, తమిళ, హిందీ, కన్నడ భాషల్లో చిరంజీవి, రజనీకాంత్, అనిల్ కపూర్, గోవింద, ఆమిర్ ఖాన్, రవిచంద్రన్, పవన్‌కల్యాణ్ వంటి అగ్ర హీరోలతో... అల్లు అర్జున్, రామ్ చరణ్, నాగచైతన్య, నాని, విజయ్ దేవరకొండ వంటి యువ హీరోలతో అల్లు అరవింద్ పలు విజయవంతమైన చిత్రాలు నిర్మించారు. భారతీయ చలనచిత్ర పరిశ్రమకు చేసిన సేవలకు గాను... ఈ నెల 20న ఢిల్లీలో విజ్ఞానభవన్‌లో నిర్వహించనున్న కార్యక్రమంలో ఆయన్ను 'ఛాంపియన్స్ ఆఫ్ ఛేంజ్ 2019' పురస్కారంతో భారతరత్న పురస్కార గ్రహీత, మాజీ రాష్ట్రపతి ప్రణబ్ ముఖర్జీ సత్కరించనున్నారు. సమాజ సేవను ప్రోత్సహిస్తూ... సామాజిక అభివృద్ధికి తోడ్పడే వ్యక్తులకు ఈ పురస్కారం ఇస్తారు. అల్లు అరవింద్ పాటు నలుగురు ముఖ్యమంత్రులు, క్రీడాకారులు, మరికొందరు ఈ పురస్కారం అందుకోనున్నారు. జస్టిస్ కె.జి. బాలకృష్ణన్, జస్టిస్ జ్ఞానసుధ సుభ్యులుగా ఉన్న జ్యూరీ అరవింద్‌ను ఈ అవార్డ్‌కు ఎంపిక చేసింది.

ఆంధ్రజ్యోతి

# బిజినెస్

నిజామాబాద్ • శనివారం 11 జనవరి 2020






# అహో..ఇన్ఫీ

## డిసెంబరు త్రైమాసిక లాభం రూ.4,466 కోట్లు

### లాభంలో వృద్ధి 23.7 శాతం

### 2019-20 ఆదాయ అంచనా 10-10.5 శాతానికి పెంపు

ఆర్థిక ఫలితాల సమావేశంలో పాల్గొన్న ప్రవీణ్ రావు, నీలేకని, సలీల్ పరేఖ్, నీలాంజన్ రాయ్

బెంగళూరు: దేశంలోని రెండో అతిపెద్ద ఐటీ సేవల కంపెనీ ఇన్ఫోసిస్ ఆర్థిక ఫలితాలు మార్కెట్ అంచనాలనుమించాయి. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం (2019-20) మూడో త్రైమాసికానికి (అక్టోబరు-డిసెంబరు) కంపెనీ లాభం 23.7 శాతం వృద్ధి చెంది రూ.4,466 కోట్లకు చేరుకుంది. గత ఆర్థిక సంవత్సరంలో ఇదే కాలానికి లాభం రూ.3,610 కోట్లుగా నమోదైంది. రెండో త్రైమాసికం (జూలై-సెప్టెంబరు)తో పోలిస్తే మాత్రం లాభం 10.89 శాతం పెరిగింది.

### నిర్వహణ మార్జిన్ అంచనా యథాతథం

సమీక్షా కాలానికి ఇన్ఫీ ఆదాయం 7.9 శాతం పెరిగి రూ.23,092 కోట్లకు చేరుకుంది. అంతక్రితం ఏడాది ఇదే సమయానికి రూ.21,400 రాబడి గడించింది. కంపెనీ పనితీరు మెరుగైన నేపథ్యంలో ఆదాయ అంచనాలను సైతం సవరించింది. ఆర్థిక సంవత్సరం మొత్తానికి ఆదాయ అంచనాను గతంలో పేర్కొన్న 9-10 శాతం నుంచి 10-10.5 శాతానికి పెంచింది. గతంలో 21-23 శాతంగా అంచనా వేసిన నిర్వహణ మార్జిన్ రేటును మాత్రం యథాతథంగా కొనసాగించింది.

### డాలర్లలో..

డిసెంబరుతో ముగిసిన త్రైమాసికానికి అమెరికన్ కరెన్సీలో ఇన్ఫీ నికర లాభం 24.8 శాతం పెరిగి 62.7 కోట్ల డాలర్లకు చేరుకుంది. ఆదాయం 8.6 శాతం వృద్ధితో 324 కోట్ల డాలర్లుగా నమోదైంది. ఇందులో డిజిటల్ సేవల రెవె న్యూ 131.8 కోట్ల డాలర్లు. ఈ సేవల ఆదాయం వార్షిక ప్రాతిపదికన 40.8 శాతం, త్రైమాసిక ప్రాతిపదికన 6.8 శాతం వృద్ధి చెందింది.

### పుంజుకున్న షేర్లు

శుక్ర వారం స్టాక్ మార్కెట్లో ట్రేడింగ్ ముగి శాక ఇన్ఫోసిస్ త్రైమాసిక ఫలితా లను ప్రకటించింది. అయినప్పటికీ, కంపెనీ ఫలితా లపై సానుకూల అంచనాలుండటంతో షేర్లు పుంజుకున్నాయి. వారాంతం ట్రేడింగ్ ముగిసేసరికి 1.47 శాతం పెరిగి రూ.738.25 వద్దకు చేరుకుంది.

### 9 నెలలకు

ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో గడిచిన మూడు త్రైమాసికాలకు (ఏప్రిల్-డిసెంబరు) గాను ఇన్ఫోసిస్ నిర్వహణ లాభం వార్షిక ప్రాతిపదికన 0.6 శాతం పెరిగి 204.9 కోట్ల డాలర్లకు చేరుకుంది. నిర్వహణ మార్జిన్ 21.4 శాతంగా నమోదైంది. ఆదాయం 9.7 శాతం వృద్ధితో 958.3 కోట్ల డాలర్లకు పెరిగింది.

| | |
|---|---|
| 40.6% | : కంపెనీ మొత్తం ఆదాయంలో 'డిజిటల్' సేవల వాటా |
| 5,064 కోట్లు | : సమీక్షా కాలానికి నిర్వహణ లాభం |
| 21.9% | : క్యూ3లో నిర్వహణ మార్జిన్ |
| 2,43,454 | : డిసెంబరు 31నాటికి ఉద్యోగులు |
| 6,968 | : క్యూ3లో ఉద్యోగుల నియామకాలు |
| 19.6% | : ఉద్యోగుల వలసల రేటు |
| 180 కోట్ల డాలర్లు | : సమీక్షా కాలంలో దక్కించుకున్న భారీ ఆర్డర్లు |

**విభాగాల వారీగా ఆదాయం**

| విభాగం | వాటా(%) |
|---|---|
| ఆర్థిక సేవలు | 31.5 |
| రిటైల్ | 15.3 |
| కమ్యూనికేషన్స్ | 13.0 |
| ఎనర్జీ, యుటిలిటీస్, రిసోర్సెస్ అండ్ సర్వీసెస్ | 12.8 |
| మాన్యుఫాక్చరింగ్ | 10.3 |
| హైటెక్ సర్వీసులు | 7.6 |
| లైఫ్ సైన్సెస్ | 6.7 |
| ఇతర విభాగాలు | 2.8 |

**ప్రాంతాల వారీగా ఆదాయం**

| ప్రాంతం | వాటా(%) |
|---|---|
| ఉత్తర అమెరికా | 61.3 |
| ఐరోపా | 24.4 |
| భారత్ | 2.8 |
| ఇతర ప్రాంతాలు | 11.5 |

### సలీల్ పరేఖ్‌కు క్లీన్‌చిట్

#### దర్యాప్తులో ఎలాంటి ఆధారాలు లభించలేదన్న ఇన్ఫోసిస్

'అనైతిక అకౌంటింగ్' ఆరోపణలకు సంబంధించి ఇన్ఫోసిస్ సీఈఓ సలీల్ పరేఖ్‌కు క్లీన్‌చిట్ లభించింది. ఈ ఆరోపణలపై కంపెనీ బోర్డు ఆడిట్ కమిటీ స్వతంత్ర దర్యాప్తు జరిపించింది. ఆర్థిక అవకతవకలు లేదా కార్య నిర్వాహణలో అనైతికత ప్రవర్తనకు సంబంధించి దర్యాప్తులో ఎలాంటి ఆధారాలు లభించలేదని ఇన్ఫోసిస్ వెల్లడించింది. ఆర్థిక ఫలితాల విడుదల సందర్భంగా ఈ విషయాన్ని స్టాక్ ఎక్స్ఛేంజ్‌లకు తెలియజేసింది. స్వల్పకాలికంగా కంపెనీ ఆదాయ, లాభాలు పెంచేందుకు కంపెనీ సీఈఓతోపాటు సీఎఫ్ఓ నీలాంజన్ రాయ్ అనైతిక అకౌంటింగ్ చర్యలకు పాల్పడ్డారంటూ ఇన్ఫోసిస్‌కు చెందిన కొందరు ఉద్యోగులు గత ఏడాది కంపెనీ బోర్డుకు లేఖ రాశారు. అనైతిక అకౌంటింగ్ ఆరోపణలకు సంబంధించి కంపెనీ బోర్డు సభ్యుడికరికి 2019 సెప్టెంబరు 30న రెండు ఫిర్యాదులందాయని, అక్టోబరు 10న ఆ రెండింటినీ ఆడిట్ కమిటీకి అందజేయడం జరిగిందని ఇన్ఫోసిస్ చైర్మన్ నందన్ నీలేకని స్టాక్ ఎక్స్ఛేంజ్‌లకు స్పష్టం చేశారు. ఈ విషయమై కంపెనీ స్వతంత్ర దర్యాప్తు జరిపించింది.

> క్లయింట్లతో సత్సంబంధాలు నెరపడంతోపాటు వారితో అనుబంధాన్ని విస్తృతపరుచుకునే ప్రయాణంలో నిలకడగా ముందుకెళ్తున్నామని మూడో త్రైమాసిక ఫలితాలు మరింత నొక్కి చెబుతున్నాయి. ఇది కంపెనీ లాభాల్లో రెండంకెల వృద్ధికి, నిర్వహణ మార్జిన్ మెరుగుపడటానికి దోహదపడింది. ఆదాయ అంచనాలు పెంచేందుకు బాటలు వేసింది.
>
> - సలీల్ పరేఖ్, ఇన్ఫోసిస్ సీఈఓ, ఎండీ

> భారీ కాంట్రాక్టు ఒప్పందాలు ఈ ఏడాదిలో ఇప్పటివరకు 56 శాతం వృద్ధి చెందాయి. ఉద్యోగులతో అనుబంధాన్ని, వారి విలువను మరింత పెంచేందుకు కొనసాగుతున్న ప్రయత్నాల ఫలితంగా వలసల రేటును మరింత తగ్గించుకోగలిగాం.
>
> - ప్రవీణ్ రావు, ఇన్ఫోసిస్ సీఓఓ

# ఆర్‌బీఐ నుంచి మళ్లీ మధ్యంతర డివిడెండ్!

- పావులు కదుపుతున్న ప్రభుత్వం
- రూ.45,000 కోట్ల వరకు కోరే అవకాశం

న్యూఢిల్లీ: నిధుల కోసం మోదీ సర్కార్ మరోసారి ఆర్‌బీఐ తలుపు తడుతోంది. మధ్యంతర డివిడెండ్ రూపంలో రూ.35,000 కోట్ల నుంచి రూ.45,000 కోట్లు సమకూర్చాలని ఆర్‌బీఐని అడిగేందుకు సిద్ధమవుతోంది. తన మిగులు నిధుల నుంచి ఈ ఆర్థిక సంవత్సరం రూ.1.76 లక్షల కోట్లు డివిడెండ్ రూపంలో ప్రభుత్వానికి బదిలీ చేసేందుకు ఆర్‌బీఐ డైరెక్టర్ల బోర్డు గత ఏడాది ఆగస్టులోనే ఆమోదం తెలిపింది. దీనికి అదనంగా మరో రూ.35,000 కోట్ల నుంచి రూ.45,000 కోట్లు 'మధ్యంతర' డివిడెండ్ రూపంలో సమకూర్చాలని ప్రభుత్వం కోరబోతున్నట్లు సమాచారం. ఆర్‌బీఐ సమకూర్చే ఈ మధ్యంతర డివిడెండ్ ద్వారా ఆర్థిక వ్యవస్థను గాడిలో పెట్టేందుకు అవసరమైన మరిన్ని సహాయ, ఉద్దీపన చర్యలు చేపట్టాలని ప్రభుత్వం భావిస్తోంది.

### ఎందుకంటే?

మందగమనంతో ఆర్థిక వ్యవస్థ పడకేసింది. జీడీపీ వృద్ధి రేటు ఐదు శాతం దాటే అవకాశం కనిపించడం లేదు. ఈ ఆర్థిక సంవత్సరానికి లక్ష్యంగా పెట్టుకున్న రూ.19.6 లక్షల కోట్ల ఆదాయంలో మూడో వంతకు కోతపడనుందని అంచనా. ఎలాగోలా సర్దుకుపోదామంటే ఖర్చులు తప్పడం లేదు. ఆప్పులు చేద్దామంటే, ద్రవ్య లోటు లక్ష్యం భయపెడుతోంది. దీంతో మళ్లీ ఆర్‌బీఐ తలుపు తట్టడమే మేలని ప్రభుత్వం భావిస్తోంది. 'అసాధారణ' సందర్భాల్లో ఆర్‌బీఐ ప్రభుత్వాన్ని మధ్యంతర డివిడెండ్‌ల రూపంలో ఆదుకోవచ్చని బిమల్ జలాన్ కమిటీ కూడా సిఫారసు చేసింది. దీంతో ఆర్‌బీఐ బోర్డులోని తన నామినీల ద్వారా ఈ పని కానిచ్చుకోవాలని ప్రభుత్వం యోచిస్తున్నట్లు సమాచారం.

# పారిశ్రామికోత్పత్తిలో 1.8 శాతం వృద్ధి

న్యూఢిల్లీ: వరుసగా మూడు నెలల పాటు క్షీణించిన దేశ పారిశ్రామికోత్పత్తి గత నవంబరు నెలలో 1.8 శాతం మేర వృద్ధి చెందింది. తయారీ రంగం మూలంగా ఈ వృద్ధి సాధ్యమైంది. ప్రభుత్వం శుక్రవారంనాడు పారిశ్రామికోత్పత్తి సూచీ (ఐఐపీ) గణాంకాలను వెల్లడించింది. వీటి ప్రకారం.. 2018 నవంబరులో పారిశ్రామికోత్పత్తిలో వృద్ధి రేటు 0.2 శాతంగా ఉంది. 2019 నవంబరులో తయారీ రంగంలో వృద్ధి 2.7 శాతంగా నమోదైంది. విద్యుదుత్పత్తి ప్రతికూలం (-5 శాతం)గా మారింది. 2018 నవంబరులో ఈ రంగం 5.1 శాతం వృద్ధిని నమోదు చేసుకుంది. మైనింగ్ రంగంలో 1.7 శాతం క్షీణత నమోదైంది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం ఏప్రిల్-నవంబరులో ఐఐపీ వృద్ధి కేవలం 0.6 శాతంగా ఉంది. క్రితం ఆర్థిక సంవత్సరం ఇదే కాలంలో మాత్రం 5 శాతం వృద్ధి నమోదైంది. ఇక 2019 నవంబరులో క్యాపిటల్ గూడ్స్ ఉత్పత్తి 8.6 శాతం క్షీణించింది. అంతకు ముందు ఏడాది ఇదే నెలలోనూ 4.1 శాతం క్షీణత నమోదైంది. ఇన్‌ఫ్రాస్ట్రక్చర్, కన్‌స్ట్రక్షన్ గూడ్స్ విభాగంలో 3.5 శాతం క్షీణత నెలకొంది. కన్స్యూమర్ డ్యూరబుల్స్ విభాగంలోనూ ఇదే పరిస్థితి ఉంది. ఎఫ్ఎంసీజీ ఉత్పత్తుల్లో మాత్రం 2 శాతం వృద్ధి నమోదైంది. కాగా తయారీ రంగంలోని 23 పారిశ్రామిక గ్రూపుల్లో 13 సానుకూల వృద్ధిని సాధించాయి.

# మిస్త్రీ కేసులో సుప్రీంకోర్టు స్టే

### ఎన్‌సీఎల్‌ఏటీ ఆదేశాల్లో తప్పులు

ఇదీ కేసు

న్యూఢిల్లీ: టాటా సన్స్ ప్రైవేట్ లిమిటెడ్ (టీఎస్‌పీఎల్) కేసులో టాటాలకు ఓదార్పు లభించింది. ఈ కేసులో సైరస్ మిస్త్రీని మళ్లీ కంపెనీ ఎగ్జిక్యూటివ్ చైర్మన్‌గా నియమిస్తూ ఎన్‌సీఎల్‌ఏటీ ఇచ్చిన ఉత్తర్వులపై సుప్రీం కోర్టు స్టే ఇచ్చింది. మిస్త్రీ కోరక పోయినా, ఆయన్ని టీఎస్‌పీఎల్ చైర్మన్‌గా పునర్ నియమిస్తూ ఎన్‌సీఎల్‌ఏటీ ఉత్తర్వులు ఇవ్వడాన్ని సర్వోన్నత న్యాయస్థానం తప్పు పట్టింది. ఈ ఉత్తర్వుల్లో లోపాలు ఉన్నట్లు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ఎస్ఏ బాబ్డే, జస్టిస్ బీఆర్ గవాయ్, జస్టిస్ సూర్య కాంత్‌లతో కూడిన ధర్మాసనం తప్పు పట్టింది. ఈ కేసును పూర్తి స్థాయిలో వినాల్సి ఉన్నందున ప్రస్తుతానికి ఎన్‌సీఎల్ ఏటీ ఉత్తర్వులపై స్టే ఇస్తున్నట్లు ప్రకటించింది. ధర్మాసనం కేసు విచారణను నాలుగు వారాల పాటు వాయిదా వేసింది.

టాటా సన్స్ లిమిటెడ్ ఎగ్జిక్యూటివ్ చైర్మన్ పదవి నుంచి సైరస్ మిస్త్రీని అర్ధాంతరంగా తొలగించడాన్ని సైరస్ మిస్త్రీ, ఆయన కుటుంబ నిర్వహణలోని ఇన్వెస్ట్‌మెంట్ కంపెనీలు ఎన్‌సీఎల్‌టీలో సవాల్ చేశాయి. అక్కడ తీర్పు మిస్త్రీకి ప్రతికూలంగా వచ్చింది. దాంతో మిస్త్రీ ఎన్‌సీఎల్ ఏటీలో అప్పీల్ చేశారు. కేసును విచారించిన ఎన్‌సీఎల్‌ఏటీ గత నెల 18న, మిస్త్రీని మళ్లీ టాటా సన్స్ ఎగ్జిక్యూటివ్ చైర్మన్‌గా నియమించాలని ఆదేశాలు జారీ చేసింది. టాటా సన్స్ లిమిటెడ్ కంపెనీని ప్రైవేట్ కంపెనీగా మార్చడాన్ని, చంద్రశేఖరన్‌ను టాటా సన్స్ ఎగ్జిక్యూటివ్ చైర్మన్‌గా నియమించడాన్నీ ఎన్‌సీఎల్‌ఏటీ కొట్టి వేసింది. దీంతో టాటా సన్స్ సుప్రీం కోర్టును ఆశ్రయించింది. సుప్రీం కోర్టు స్టేతో టాటా సన్స్ కొద్దిగా ఊపిరి పీల్చుకుంది.

# నాగ్‌పూర్ ఎయిర్‌పోర్టుకు మళ్లీ టెండర్!

నాగ్‌పూర్: నాగ్‌పూర్ ఎయిర్‌పోర్టు నిర్మాణం కోసం మళ్లీ టెండర్లు పిలిచే అవకాశం ఉందని కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీ చెప్పారు. ఈ ఎయిర్‌పోర్టు అభివృద్ధి, నిర్వహణ కాంట్రాక్టును గత మార్చిలో జీఎంఆర్ గ్రూపునకు చెందిన జీఎంఆర్ ఎయిర్‌పోర్ట్ లిమిటెడ్ దక్కించుకుంది. డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ ఇంటర్నేషనల్ ఎయిర్‌పోర్టు పేరుతో ఈ ఎయిర్‌పోర్టు నిర్మాణం తలపెట్టారు. అయితే కొన్ని సాంకేతిక కారణాలతో అనుకున్న విధంగా ఎయిర్‌పోర్టు నిర్మాణం ముందుకు సాగలేదు. దీంతో ఈ ప్రాజెక్టు కోసం మళ్లీ టెండర్లు పిలిచే అవకాశం ఉందని గడ్కరీ చెప్పారు.

### రూ.2 వేల కోట్ల సమీకరణ: జీఎంఆర్

అనుబంధ సంస్థ జీఎంఆర్ ఇన్‌ఫ్రా సర్వీసెస్ లిమిటెడ్ (జీఐఎస్ఎల్).. నాన్ కన్వర్టబుల్ డిబెంచర్ల (ఎన్‌సీడీ) జారీ ద్వారా రూ.2,000 కోట్ల నిధులను సమీకరించిందని జీఎంఆర్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ వెల్లడించింది. ప్రస్తుత రుణ భారాన్ని కొంత మేరకు తగ్గించుకునేందుకు ఈ మొత్తాలను వినియోగించనున్నట్లు తెలిపింది. కాగా టాటా-జీపీసీ నుంచి ఎలాంటి నిధులను సమీకరించటం లేదని పేర్కొంది.

### యెస్ బ్యాంక్‌కు డైరెక్టర్ గుడ్‌బై

న్యూఢిల్లీ: ప్రైవేట్ రంగంలోని యెస్ బ్యాంక్ కష్టాలు ఇప్పట్లో తీరేలా లేవు. బ్యాంక్ ఇండిపెండెంట్ డైరెక్టర్, ఆడిట్ కమిటీ చైర్మన్ ఉత్తమ్ ప్రకాశ్ అగర్వాల్ శుక్రవారం బోర్డు నుంచి తప్పుకున్నారు. ఈ మేరకు తన రాజీనామా లేఖను బ్యాంక్ నాన్ ఎగ్జిక్యూటివ్ పార్ట్ టైమ్ చైర్మన్ బ్రహ్మ దత్‌కు సమర్పించారు. నానాటికి దిగజారుతున్న కంపెనీ నిర్వహణ ప్రమాణాలకు నిరసనగా ఈ నిర్ణయం తీసుకున్నట్లు అగర్వాల్ తన లేఖలో పేర్కొన్నారు.

# చందా కొచ్చర్‌కు షాక్

### రూ.78 కోట్ల ఆస్తులు జప్తు చేసిన ఈడీ.. మార్కెట్ విలువ రూ.600 కోట్లు?

న్యూఢిల్లీ: ఐసీఐసీఐ బ్యాంక్ మాజీ మేనేజింగ్ డైరెక్టర్, చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ చందాకొచ్చర్‌కు భారీ షాక్ తగిలింది. వీడియోకాన్‌కు ఇచ్చిన రుణానికి సంబంధించిన కేసు దర్యాప్తులో భాగంగా ఆమెతో పాటు ఆమె కుటుంబానికి చెందిన రూ.78 కోట్ల విలువైన ఆస్తులను ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) జప్తు చేసింది. ఈ మేరకు మనీలాండరింగ్ నిరోధక చట్టం (పీఎంఎల్ఏ) కింద ప్రొవిజనల్ అదేశం జారీ చేసినట్లు శుక్రవారంనాడు అధికారులు తెలిపారు.

ఈడీ జప్తు చేసిన ఆస్తుల్లో దక్షిణ ముంబైలోని చందాకొచ్చర్ ఫ్లాట్ (బుక్ విలువ రూ.3.5 కోట్లు) కూడా ఉంది. దీనితోపాటు చందాకొచ్చర్ భర్త దీపక్ కొచ్చర్ కంపెనీలకు తమిళనాడు, మహారాష్ట్రలో ఉన్న విండ్ ఫామ్ ప్రాజెక్టుల భూమి, ప్లాంట్, మెషనరీ వంటి వాటిని కూడా ఈడీ జప్తు చేసింది. వీటి పుస్తక విలువ రూ.78.15 కోట్లు ఉంటుంది. వీటిలో రూ.10.5 లక్షల నగదు కూడా ఉన్నట్లు సమాచారం.. దీపక్ కొచ్చర్‌కు చెందిన మరో కంపెనీ పసిఫిక్ క్యాపిటల్ సర్వీసెస్ ప్రాంగణాల్లో సోదాల సందర్భంగా ఈ సొమ్మును జప్తు చేశారు. కాగా ఈడీ జప్తు చేసిన ఆస్తుల మార్కెట్ విలువ మాత్రం రూ.600 కోట్ల వరకు ఉంటుందని తెలుస్తోంది. మరికొన్ని ఆస్తులను కూడా జప్తు చేసే అవకాశం ఉన్నట్లుగా ఈడీ వర్గాల ద్వారా తెలుస్తోంది. ముంబైలో చందాకొచార్ కుటుంబ సభ్యులు నివసిస్తున్న ఫ్లాట్‌ను వీడియోకాన్ గ్రూప్ కంపెనీల్లో ఒకదాని నుంచి కొనుగోలు చేసినట్లు ఈడీ వర్గాలు చెబుతున్నాయి.

వీడియోకాన్ గ్రూప్ కంపెనీలకు అక్రమంగా రూ.1,875 కోట్ల రుణాన్ని జారీ చేసినట్లు ఆరోపణలు వచ్చిన నేపథ్యంలో చందాకొచ్చర్ దంపతులతోపాటు వారి వ్యాపార సంస్థలపైనా విచారణకు ఈడీ రంగంలోకి దిగింది. ఈ రుణ వ్యవహారంలో సీబీఐ నమోదు చేసిన ఎఫ్ఐఆర్‌ను అధ్యయనం చేసిన తర్వాత ఈడీ మనీలాండరింగ్ వ్యవహారంపై విచారణ మొదలుపెట్టింది. ఇందులో భాగంగా కొచ్చర్‌కు చెందిన ప్రాంగణాల్లో సోదాలు నిర్వహించింది. ఈడీ దర్యాప్తులో భాగంగా పలు కీలక విషయాలు వెలుగు చూశాయి. వీడియోకాన్ ఇంటర్నేషనల్ ఎలక్ట్రానిక్స్ లిమిటెడ్‌కు రూ.300 కోట్లు మంజూరు చేయగా.. ఇందులో రూ.64 కోట్లను 2009 సెప్టెంబరు 8న వీడియోకాన్ ఇండస్ట్రీస్ లిమిటెడ్.. నూపవర్ రెన్యూవబుల్స్ ప్రైవేట్ లిమిటెడ్ (ఎన్ఆర్‌పీఎల్)కు బదిలీ చేసినట్లు ఈడీ పేర్కొంది. ఇంతకు ముందు ఈ కంపెనీ పేరు నూపవర్ రెన్యూవబుల్స్ లిమిటెడ్ (ఎన్ఆర్ఎల్)గా ఉంది. ఇది దీపక్ కొచ్చర్‌కు చెందినది. కాగా ఎన్ఆర్ఎల్ పొందిన నిధుల ద్వారా నికరంగా రూ.10.65 కోట్ల రాబడిని నమోదు చేసుకున్నట్లు ఈడీ చెబుతోంది. కాగా ఈ కేసు విషయంలో ఇప్పటికే పలుమార్లు చందాకొచ్చర్ దంపతులను ఈడీ విచారణ చేసింది. ఇంకా కేసు దర్యాప్తు జరుగుతూనే ఉంది.

# శ్రీసిటీలో పానాసోనిక్ ప్లాంట్

- రూ.295 కోట్ల పెట్టుబడి
- 2021 అక్టోబరు నాటికి రెడీ

ఒప్పంద పత్రాలు మార్చుకుంటున్న రవీంద్ర సన్నారెడ్డి, వివేక్ శర్మ

సత్యవేడు: ఆంధ్రప్రదేశ్‌లోని శ్రీసిటీలో ప్లాంట్‌ను ఏర్పాటు చేస్తున్నట్లు పానాసోనిక్ లైఫ్ సొల్యూషన్స్ ఇండియా ప్రకటించింది. రూ.294.70 కోట్ల పెట్టుబడితో 33 ఎకరాల విస్తీర్ణంలో ఈ ప్లాంట్‌ను నెలకొల్పుతున్నట్లు వెల్లడించింది. ఈ మేరకు పానాసోనిక్ లైఫ్ సొల్యూషన్స్ మేనేజింగ్ డైరెక్టర్ వివేక్ శర్మ, శ్రీసిటీ మేనేజింగ్ డైరెక్టర్ రవీంద్ర సన్నారెడ్డి అవగాహనా ఒప్పందంపై సంతకాలు చేశారు. ఈ ప్లాంట్‌లో ఎలక్ట్రికల్ ఎక్విప్‌మెం ట్ మెటీరియల్, వైరింగ్ డివైస్‌లను ఉత్పత్తి చేయనున్నట్లు శర్మ వెల్లడించారు. కాగా భారత్‌లో పానాసోనిక్‌కు ఇది ఎనిమిదో ప్లాంట్ అని ఆయన పేర్కొన్నారు. 2021 అక్టోబరు నాటికి ఈ ప్లాంట్ వాణిజ్యపరంగా కార్యకలాపాలను ప్రారంభించనుందని చెప్పారు. ఈ ప్లాంట్ ద్వారా ప్రత్యక్షంగా 600 మందికి ఉపాధి అవకాశాలు లభించనున్నాయని ఆయన తెలిపారు. ఉత్తరాఖండ్‌లోని హరిద్వార్‌లో ఉన్న ప్లాంట్ ఉత్తరాది మార్కెట్ల అవసరాలను తీరుస్తుండగా పశ్చిమ మార్కెట్ల అవసరాలను దామన్, కచ్‌లోని ప్లాంట్లు తీరుస్తున్నాయని శర్మ వెల్లడించారు. శ్రీసిటీలో నెలకొల్పుతున్న ప్లాంట్‌తో దక్షిణాది మార్కెట్లో కంపెనీ స్థానాన్ని పటిష్ఠం చేసుకునే అవకాశం లభిస్తుందని ఆయన పేర్కొన్నారు. కాగా రానున్న సంవత్సరాల్లో పశ్చిమాసియా, ఆఫ్రి కా దేశాల్లో మాన్యుఫ్యాక్చరింగ్ యూనిట్లను ఏర్పా టు చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు శర్మ వెల్లడించారు. ఎలక్ట్రానిక్స్ రంగంలో కీలకంగా ఉన్న పానాసోనిక్.. దక్షిణాదిలో తన తొలి ప్లాంట్‌ను ఏర్పాటు చేసేందుకు శ్రీసిటీని ఎంచుకోవటం ఎంతో సంతోషంగా ఉందని రవీంద్ర సన్నారెడ్డి తెలిపారు. శ్రీసిటీలో పెట్టుబడులు పెట్టిన 25వ జపాన్ కంపెనీ పానాసోనిక్ అని చెప్పారు.

# 'బిగ్ సి' సంక్రాంతి ఆఫర్లు

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి బిజినెస్): సంక్రాంతి పండుగ సందర్భంగా మొబైల్ ఫోన్ల రిటైల్ విక్రయ కంపెనీ బిగ్ సి ప్రత్యేక ఆఫర్లను ప్రకటించింది. స్క్రాచ్ అండ్ విన్ ఆఫర్ కింద ఫ్రిజ్‌లు, వాషింగ్ మిషన్లు, ఎల్ఈడీ టీవీలు, ల్యాప్‌టాప్‌లు, ఒవెన్లు వంటివి అందిస్తున్నట్లు బిగ్ సి సీఎండీ ఎం బాలు చౌదరి తెలిపారు. మొత్తం రూ.12 కోట్ల విలువైన బహుమతులతో పాటు రూ.5 కోట్ల విలువైన క్యాష్ పాయింట్లు అందజేస్తున్నట్లు చెప్పారు. ఆన్‌లైన్ విక్రయాలకు యాప్‌ను లాంచ్ చేశామన్నారు. మైక్రోమ్యాక్స్ ఐ వన్ మొబైల్, రూ.13,990 విలువ చేసే హెచ్‌డీ ఎల్ఈడీ టీవీని రూ.8,999కే ఇస్తున్నట్లు వివరించారు. ఇంకా మరిన్ని ఆఫర్లు ఉన్నట్లు తెలిపారు.

### సైబర్ సెక్యూరిటీ సెంటర్, టీబీడీసీ జట్టు

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి బిజినెస్): హైదరాబాద్‌లోని సైబర్ సెక్యూరిటీ స్టార్టప్‌లకు కెనడాలో వ్యాపార అవకాశాలను కల్పించే లక్ష్యంతో హైదరాబాద్‌లోని సైబర్ సెక్యూరిటీ సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్‌లో ప్రత్యేక సమావేశం జరిగింది. టొరెంట్ బిజినెస్ డెవలప్‌మెంట్ సెంటర్ (టీబీడీసీ)తో కలిసి సైబర్‌సెక్యూరిటీ సెంటర్ దీన్ని ఏర్పాటు చేసింది. కనెక్ట్2కెనడా పేరుతో నిర్వహించిన ఈ సమావేశంలో కెనడాలోని బ్రామ్‌టన్ నగర మేయర్ ప్యాట్రిక్ బ్రౌన్, టొరెంటో బిజినెస్ డెవలప్‌మెంట్ సెంటర్ బోర్డు చైర్మన్ విక్రమ్ ఖురానా, సైబర్‌సెక్యూరిటీ సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ సీఈఓ శ్రీరామ్ బిరుడవోలు పాల్గొన్నారు.

### 'సువెన్' విభజనకు బోర్డు ఆమోదం

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి బిజినెస్): సువెన్ లైఫ్ సైన్సెస్ కంపెనీ రెండు కంపెనీలుగా విడిపోవడానికి సువెన్ బోర్డు ఆమోదం తెలిపింది. సువెన్ లైఫ్ సైన్సెస్ (ఎస్ఎల్ఎస్ఎల్), సువెన్ ఫార్మాస్యూటికల్స్ (ఎస్‌పీఎల్) విడిపోవడానికి శుక్రవారం జరిగిన సమావేశంలో బోర్డు ఆమోదం తెలిపిందని సువెన్ లైఫ్ సైన్సెస్ తెలిపింది. సువెన్ లైఫ్ డిమెర్జర్ పథకానికి ఎన్‌సీఎల్‌టీ, హైదరాబాద్ బెంచ్ ఆమోదం తెలపడంతో బోర్డు ఈ నిర్ణయం తీసుకుంది. రెండు కంపెనీలుగా విడిపోవడం జనవరి 9 నుంచి అమల్లోకి వస్తుంది. ప్రతి సువెన్ లైఫ్ సైన్సెస్ షేరుకు ఒక సువెన్ ఫార్మాస్యూటికల్స్ షేరును జారీ చేస్తారు. జనవరి 22ను రికార్డు తేదీగా తీసుకుంటారు.

# బంగారానికి తగ్గిన గిరాకీ

- 6 నెలల్లో 30 శాతం తగ్గుదల
- జీజేసీ చైర్మన్ అనంత పద్మనాభన్

చెన్నై: బంగారానికి గిరాకీ భారీగా తగ్గిందని అఖిల భారత జెమ్స్ అండ్ జువెలరీ మండలి (జీజేసీ) చైర్మన్ అనంత పద్మనాభన్ ఆందోళన వ్యక్తం చేశారు. డిమాండ్ పరంగా చూస్తే గత ఆరు నెలల్లో జెమ్స్ అండ్ జువెలరీ పరిశ్రమ మొత్తం వ్యాపార పరిమాణం 30 శాతం తగ్గినట్టు చెప్పారు. వర్క్‌షాపుల్లో పని లేదని, కొన్నింటి కార్యకలాపాలు నిలిచిపోతున్నాయని ఆయన అన్నారు. "బంగారంపై దిగుమతి సుంకంతోపాటు వస్తుసేవల పన్ను (జీఎస్‌టీ)ను తగ్గించాలని ప్రధానమంత్రి కార్యాలయం, హోం మంత్రి అమిత్‌షా, ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్‌లను అభ్యర్థించాం. గత ఆరు నెలల్లో వ్యాపార పరిమాణం 30 శాతం తగ్గింది" అని అనంత పద్మనాభన్ తెలిపారు. కస్టమ్స్ సుంకంతోపాటు జీఎస్‌టీ పెంపు మూలంగా బంగారం స్మగ్లింగ్ బాగా పెరుగుతోందని చెప్పారు. దుబాయ్, నేపాల్, శ్రీలంక, సింగపూర్ వంటి దేశాల నుంచి బంగారం కొనుగోలు చేసేందుకు కస్టమర్లకు ఎక్కువగా ప్రాధాన్యం ఇస్తున్నారని ఆయన తెలిపారు. ఈ పరిణామాలను దృష్టిలో ఉంచుకుని వచ్చే బడ్జెట్‌లో ప్రభుత్వం దిగుమతి సుంకాన్ని ప్రస్తుతమున్న 12.5 శాతం నుంచి 6 శాతానికి తగ్గించాలని ఆయన కోరారు.

### బ్యాంకింగ్, బీమాలోకి సచిన్ బన్సల్!

ముంబై: ఫ్లిప్‌కార్ట్ సహ వ్యవస్థాపకుడు సచిన్ బన్సల్ ఆర్థిక సేవల వ్యాపారాల్లోకి వేగంగా విస్తరిస్తున్నారు. ప్రపంచ రిటైల్ దిగ్గజం వాల్‌మార్ట్.. ఫ్లిప్‌కార్ట్‌ను సొంతం చేసుకున్న విషయం తెలిసిందే. ఆ సందర్భంగా సచిన్ బన్సల్ తన వాటా విక్రయించి కంపెనీ నుంచి బయటికొచ్చేశాడు. తద్వారా సమకూరిన రూ.6,000 కోట్ల వరకు నిధులతో పలు కంపెనీల్లో పెద్ద ఎత్తున పెట్టుబడులు పెట్టారు. చైతన్య ఇండియా ఫిన్ క్రెడిట్ అందులో ఒకటి. ఈ సూక్ష్మ రుణ సంస్థ తాజాగా వాణిజ్య బ్యాంక్ లైసెన్సు కోసం ఆర్‌బీఐకి దర ఖాస్తు చేసుకుంది. గత ఏడాది సెప్టెంబరులో తన ఇన్

### బరిలో స్వతంత్ర అభ్యర్థులుగా
# తల్లీకుమార్తె

నల్లగొండ 39వ వార్డుకు నామినేషన్ వేసి వస్తున్న తల్లి యాదమ్మ, కుమార్తె శ్రీవల్లి

**తల్లి అంగన్‌వాడీ టీచర్, కూతురు బీటెక్**

నల్లగొండ, జనవరి 10: నల్లగొండ జిల్లా కేంద్రం లోని 39వ వార్డు నుంచి కౌన్సిలర్‌గా పోటీ చేసేందుకు తల్లీ, కుమార్తె ఇద్దరూ నామినేషన్ వేశారు. రిజర్వేషన్‌లో బీసీ మహిళకు అవకాశం రావడంతో కాంగ్రెస్ నేత అంబర్ల శ్రీను భార్య యాదమ్మ, కుమార్తె శ్రీవల్లిక ఇద్దరూ బరిలో ఉన్నారు. అంగన్‌వాడీ టీచర్ ఉద్యోగానికి రాజీనామా చేసిన యాదమ్మ ఇన్ఫోసిస్ కంపెనీలో ఉద్యోగానికి కాల్ లెటర్ వచ్చినా వెళ్లని శ్రీవల్లిక నామినేషన్ దాఖలు చేశారు.

నల్లగొండ జిల్లా మిర్యాలగూడలో నామినేషన్ చేస్తున్న కరీం(మధ్యలో వ్యక్తి)

## ప్రణయ్ కేసులో నిందితుడు
# కరీం నామినేషన్

మిర్యాలగూడ, జనవరి 10: నల్లగొండ జిల్లా మిర్యాలగూడలో సంచలనం సృష్టించిన ప్రణయ్ హత్య కేసులో విచారణ ఎదుర్కొంటున్న ఎంఏ కరీం(ఏ5) మునిసిపల్ ఎన్నికల్లో కౌన్సిలర్‌గా పోటీ చేసేందుకు శుక్రవారం నామినేషన్ దాఖలు చేశాడు. గతంలో కాంగ్రెస్ నేతగా ఉన్న కరీంకు బీఫారం ఇవ్వకపోయినా ఆ పార్టీ తరఫున 20, 21 వార్డులనుంచి కౌన్సిలర్‌గా బరిలో నిలవడం చర్చనీయాంశంగా మారింది.

# పోటీ నుంచి తప్పుకో

- తండ్రికి కొడుకు బెదిరింపు
- పెట్రోల్ పోసుకొని ఆత్మహత్యాయత్నం

సంరెడ్డి వెంకట్‌రెడ్డి

హయత్‌నగర్/హైదరాబాద్, జనవరి 10 (ఆంధ్రజ్యోతి): తుర్కయాంజాల్ మునిసిపాలిటీ పరిధిలోని తొర్రూర్ 16 వార్డు నుంచి బీజేపీ తరఫున సంరెడ్డి వెంకట్‌రెడ్డి బుధవారం నామినేషన్ వేశారు. వనస్థలిపురంలో నివాసం ఉండే వెంకట్‌రెడ్డి కొడుకు జగన్మోహన్‌రెడ్డి శుక్రవారం ఉదయం తొర్రూర్‌కు వచ్చాడు. నామినేషన్ ఉపసంహరించుకోవాలని తండ్రిని హెచ్చరించాడు. అందుకు వెంకట్‌రెడ్డి ససేమిరా అన్నాడు. దీంతో జగన్మోహన్‌రెడ్డి గదిలోకి వెళ్లి తలుపులు బిగించి.. వెంట తెచ్చుకున్న పెట్రోల్‌ను ఒంటిపై పోసుకొని ఆత్మహత్య చేసుకుంటానని తండ్రిని బెదిరించాడు. ఇంట్లో నుంచి అరుపులు వినబడటంతో స్థానికులు కొందు వచ్చి తలుపులను బద్దలు కొట్టి జగన్మోహన్‌రెడ్డిని కాపాడారు. నిందితుడిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. అయితే తనను పోటీ నుంచి తప్పించడానికి కొందరు తన కొడుకును పావుగా వాడుకుంటున్నారని వెంకట్ రెడ్డి ఆరోపించారు.

## తూంకుంట మునిసిపల్
# కమిషనర్ తొలగింపు

శామీర్‌పేట, జనవరి 10: మేడ్చల్ జిల్లా శామీర్‌పేట మండలం తూంకుంట ఇన్‌చార్జి మునిసిపల్ కమిషనర్ వాణిని బాధ్యతల నుంచి తప్పిస్తూ జిల్లా కలెక్టర్ ఎంవీ రెడ్డి ఉత్తర్వులు జారీ చేశారు. కమిషనర్ వాణిపై కొందరు రాజకీయ నాయకులు జిల్లా కలెక్టర్, రాష్ట్ర ఎన్నికల కమిషన్‌కు ఫిర్యాదు చేశారు. ఈ నేపథ్యంలో ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు కలెక్టర్.. వాణిని బాధ్యతల నుంచి తొలగించారు. ఆమె స్థానంలో శామీర్‌పేట తహసీల్దార్ గోవర్ధన్‌ను నియమిస్తూ ఉత్తర్వులను జారీ చేశారు.

### సెల్‌ఫోన్ వెలుతురులో
# నామినేషన్ల స్వీకరణ

నారాయణఖేడ్, జనవరి 10: మునిసిపల్ ఎన్నికల నామినేషన్ల దాఖలుకు శుక్రవారం చివరిరోజు కావడంతో పెద్ద ఎత్తున అభ్యర్థులు తరలివచ్చారు. సంగారెడ్డి జిల్లా నారాయణఖేడ్‌లో ఉపాధి హామీ భవనంలో నామినేషన్లు స్వీకరిస్తున్న సమయంలో విద్యుత్తు సరఫరాకు అంతరాయం ఏర్పడింది. రిటర్నింగ్ అధికారులు అభ్యర్థుల సెల్‌ఫోన్ వెలుతురులోనే నామినేషన్లు స్వీకరించారు.

### రెండు చేతులు లేకుంటే ఏంటి ?..
# ప్రజా సేవలో ముందుంటా!

నారాయణఖేడ్, జనవరి 10: అతడు దివ్యాంగుడు. రెండు చేతులు లేవు. ప్రజా సేవ చేయాలనుకునే వారికి అంగవైకల్యంతో పనేముందని.. తలచి టీజేఎస్ తరఫున మునిసిపల్ ఎన్నికల్లో బరిలో నిలుస్తున్నాడు. సంగారెడ్డి జిల్లా నారాయణఖేడ్‌లో 8వ వార్డు నుంచి పోటీ చేస్తున్న అతని పేరు రామకృష్ణ. శుక్రవారం నామినేషన్ దాఖలు చేశాడు.

నారాయణఖేడ్‌లో టీజేఎస్ అభ్యర్థిగా నామినేషన్ దాఖలు చేస్తున్న దివ్యాంగుడు రామకృష్ణ

# బాబోయ్.. ఇదేం దుంకుడు!

(మొదటి పేజీ తరువాయి)

మునిసిపాలిటీలో టీఆర్ఎస్‌కు చెందిన ఎల్లంకి శ్రీనివాస్‌కు ఆ పార్టీ టికెట్ దక్కకపోవడంతో కాంగ్రెస్‌లో చేరారు. గురువారం టీఆర్ఎస్ తరఫున వార్డుకు నామినేషన్ వేసిన శ్రీనివాస్.. టికెట్ రావడంలేదని తెలిసి శుక్రవారం కాంగ్రెస్ సీనియర్ నేత షబ్బీర్ అలీ సమక్షంలో ఆ పార్టీ కండువా కప్పుకొన్నారు. వెంటనే కాంగ్రెస్ తరఫున టికెట్ పొంది మళ్లీ నామినేషన్ వేశారు. ఇక ఎల్లారెడ్డి మునిసిపాలిటీలో టీఆర్ఎస్ టికెట్లు దక్కని ఆ పార్టీ మండల అధ్యక్షుడు, మాజీ జడ్పీటీసీ సభ్యుడు, ఎంపీటీసీ సభ్యులు కూడా కాంగ్రెస్‌లో చేరారు. వీరంతా మాజీ ఎమ్మెల్యే ఏనుగు రవీందర్‌రెడ్డి వర్గీయులు కావడంతో వీరికి టికెట్ ఇచ్చేందుకు ఎమ్మెల్యే నల్లమడుగు సురేందర్ నిరాకరించినట్లు, దీంతో వీరు పార్టీ మారినట్లు చెబుతున్నారు. కాగా మంచిర్యాల జిల్లాలో మంచిర్యాల మునిసిపల్ వైస్ చైర్మన్, టీఆర్ఎస్ నేత ఉప్పలయ్య కాంగ్రెస్‌లో చేరారు. ఆయనను మునిసిపల్ చైర్మన్ అభ్యర్థిగా కాంగ్రెస్



ప్రకటించింది. లెక్కెట్టిపేట టీఆర్ఎస్ నేత, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ చల్లా భూషణం కూడా కాంగ్రెస్‌లో చేరగా.. ఈయననూ మునిసిపల్ చైర్మన్ అభ్యర్థిగా ప్రకటించారు. బెల్లంపల్లి మునిపాలిటీకి చెందిన టీఆర్ఎస్ నేత ఎల్తుర్తి శంకర్ సైతం టికెట్ రాకపోవడంతో కాంగ్రెస్‌లో చేరారు. ఖానాపూర్ టీఆర్ఎస్ సీనియర్ నేత మడిరే సత్యనారాయణ బీజేపీలో చేరారు. కాగా భైంసాలో టీఆర్ఎస్ కంటే బీజేపీ అభ్యర్థిత్వానికే ఎక్కువ పోటీ నెలకొంది.

### తనయుడి కోసం జోగు రామన్న ఎత్తులు..

మాజీ మంత్రి జోగురామన్న ఆదిలాబాద్ మునిసిపల్ చైర్మన్‌గా తన తనయునికి అవకాశం దక్కించుకునేందుకు ఎత్తుగడలు వేస్తున్నారు. ఈ స్థానం జనరల్ కావడంతో తాజా మాజీ చైర్మన్ రంగినేని మనీష పోటీకి రాకుండా.. ఆమెను అభ్యర్థుల జాబితాలో లేకుండా చేసినట్లు ప్రచారం జరుగుతోంది. ఇక మహబూబ్‌నగర్ జిల్లాలో యువజన కాంగ్రెస్ నేత ఇస్సాయిల్.. మంత్రి శ్రీనివాస్‌గౌడ్ సమక్షంలో టీఆర్ఎస్‌లో చేరారు. వరంగల్ రూరల్ జిల్లా పరకాలలో అధికార పార్టీ నుంచి టికెట్ ఆశించి దక్కకపోవడంతో పలువురు నేతలు కాంగ్రెస్, బీజేపీల్లో చేరారు. నామినేషన్లు కూడా వేశారు. మరికొందరు ఇండిపెండెంట్లుగా బరిలోకి దిగుతున్నారు. అయితే నర్సంపేట, వర్ధన్నపేటల్లో ముందస్తుగా సంప్రదింపులు జరిపిన టీఆర్ఎస్ నాయకత్వం కొంత మేరకు అక్కడ అసంతృప్తి లేకుండా చేసింది. ఇక జనగామ పట్టణంలో జంప్ జిలానీ రాజకీయాలు రసవత్తరంగా నడుస్తున్నాయి. కాంగ్రెస్ పార్టీకి చెందిన ఇద్దరు కౌన్సిలర్లు టీఆర్ఎస్‌లో చేరారు. జనగామ మునిసిపాలిటీ మాజీ చైర్మన్, టీఆర్ఎస్ నేత గాడిపల్లి ప్రేమలతారెడ్డి అనూహ్యంగా నామినేషన్ల రోజునే బీజేపీ కండువా కప్పుకొన్నారు. ఇంకా చాలా మునిసిపాలిటీల్లో టికెట్లు దక్కక రగులుతున్న నేతలు ప్రత్యర్థి పార్టీల్లో చేరే ఆలోచన చేస్తున్నట్లు చెబుతున్నారు. అయితే సీఎం కేసీఆర్ సూచన మేరకు ఆ పార్టీ ఎమ్మెల్యేలు, మంత్రులు బుజ్జగింపులు మొదలుపెట్టారు. మునిసిపల్ ఎన్నికల్లో అవకాశం దక్కకపోయినా.. నామినేటెడ్ పదవులు, ఇతర అవకాశాలను ఇవ్వజూపుతూ బజ్జగిస్తున్నట్లు చెబుతున్నారు. కాంగ్రెస్‌లో అసంతృప్తులనూ ఆ పార్టీ స్థానిక నాయకత్వం బుజ్జగిస్తోంది. ఒకటి రెండు రోజుల్లో ఎవరెవరికి టికెట్లు దక్కుతాయన్నది స్పష్టం కానున్న నేపథ్యంలో జంపింగ్‌లు మరిన్ని పెరిగే అవకాశం ఉందంటున్నారు.

## దయాకర్‌రెడ్డి
# డబుల్ గేమ్!

- రెండు పార్టీల నుంచీ నామినేషన్
- రేవంత్ సమక్షంలో కాంగ్రెస్‌లో చేరిక
- అరగంటకే మంత్రి మల్లారెడి వెంట

ఉప్పల్/బోడుప్పల్: పీర్జాదిగూడకు చెందిన దర్గా దయాకర్‌రెడ్డి టీఆర్ఎస్, కాంగ్రెస్ పార్టీలతో డబుల్ గేమ్ ఆడుతున్నారు. టీఆర్ఎస్ నుంచి మేయర్ పదవికి అభ్యర్థిత్వాన్ని ఆశించి భంగపడ్డ దయాకర్‌రెడ్డి.. గంటల వ్యవధిలోనే రెండు పార్టీల నుంచీ నామినేషన్ వేశారు. మేయర్ పదవిపై హామీ పొందేందుకు దయాకర్‌రెడ్డి.. మంత్రి మల్లారెడ్డి వద్ద చేసిన ప్రయత్నాలు ఫలించకపోవడంతో తెల్లవారేసరికి కాంగ్రెస్‌లోకి దూకేశారు. ఎంపీ రేవంత్‌రెడ్డి నేరుగా దయాకర్‌రెడ్డి ఇంటికి చేరుకోగా ఆయన సమక్షంలో కాంగ్రెస్ కండువా కప్పుకొన్నారు. అనంతరం రేవంత్‌తో కలసి విలేకరులతోనూ మాట్లాడారు. టీఆర్ఎస్‌లో అవమానించినందుకే కాంగ్రెస్‌లో చేరినట్లు వెల్లడించారు. అయితే రేవంత్‌రెడ్డి వెళ్లిపోయిన అరగంట తరువాత మంత్రి మల్లారెడ్డి స్వయంగా దయాకర్‌రెడ్డి ఇంటికొచ్చారు. ఆయనతో రహస్యంగా మంతనాలు జరిపారు. అనంతరం మీడియాతో మాట్లాడకుండానే దయాకర్‌రెడ్డిని వెంటబెట్టుకొని వెళ్లిపోయారు. శుక్రవారంరాత్రి వరకు దయాకర్‌రెడ్డి ఎవరికీ అందుబాటులోకి రాలేదు. కానీ, తన అనుచరుల ద్వారా 2 పార్టీల నుంచి కార్పొరేటర్‌గా నామినేషన్ వేయించారు. ఇక నాగారం, దమ్మాయిగూడలో టీఆర్ఎస్ టికెట్ దక్కని ఇద్దరు నేత ల్లో.. ఒకరు కాంగ్రెస్‌లో, మరొకరు టీడీపీలో చేరారు.

### జనరల్ స్థానాల్లో బీసీలకు అవకాశమివ్వాలి: జాజుల

కవాడిగూడ/హైదరాబాద్, జనవరి10 (ఆంధ్రజ్యోతి): మునిసిపల్ ఎన్నికల్లో జనరల్ స్థానాల్లో బీసీలకు పోటీ చేసే అవకాశం ఇవ్వాలని బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్‌గౌడ్ డిమాండ్ చేశారు. లేదంటే ఎమ్మెల్యేలకు తగిన గుణపాఠం చెబుతామని హెచ్చరించారు. శుక్రవారం ఇందిరా పార్కు వద్ద బీసీ భవన్‌లో జరిగిన ఓ సమావేశంలో ఆయన మాట్లాడారు. జనరల్ సీట్లను అగ్రకులాలకే ఎలా కేటాయిస్తారని ఆయన రాజకీయ పార్టీలను ప్రశ్నించారు. బీసీలకు బీ ఫామ్‌లు ఇవ్వని ఎమ్మెల్యేలను 2023 అసెంబ్లీ ఎన్నికల్లో ఓడించాలని ఆయన పిలుపునిచ్చారు.

### ఎన్నికలు రాల్చిన ఆస్తి పన్ను
- అభ్యర్థుల్లో బకాయిలు ఉండొద్దన్న గుబులు

హైదరాబాద్, జనవరి 10(ఆంధ్రజ్యోతి): మునిసిపల్ ఎన్నికల పుణ్యమా అని మునిసిపాలిటీలకు ఆస్తి పన్ను చకా చకా సమకూరింది. ఎన్నికల్లో అనర్హులమవుతామన్న గుబులుతో అభ్యర్థులు వెంట వెంటనే పన్నును చెల్లించారు. దాంతో మొండి బకాయిలు సైతం వసూలయ్యాయి. మునిసిపాలిటీలకు ఆర్థిక దన్ను చేకూరింది. ఈ ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థులు, బలపర్చే ప్రతినిధులు మునిసిపాలిటీలకు సంబంధించి ఆస్తి పన్ను, నీటి పన్ను బకాయిలు ఉండకూడదని ఎన్నికల నిబంధనలున్నాయి. దాంతో పోటీ చేయదల్చిన అభ్యర్థులు ముందస్తుగానే అప్రమత్తమయ్యారు. బకాయిలను చెల్లించడం మొదలు పెట్టారు. శంకర్‌పల్లి మునిసిపాలిటీలో రూ.2,89,309 ఆస్తి పన్ను వసూలైంది. మేడ్చల్ జిల్లా ఘట్‌కేసర్ మునిసిపాలిటీలో రూ.63,82,221, పోచారం రూ.6,72,000, నాగారం రూ.10,21,433, దమ్మాయిగూడ రూ.6,00,000, మేడ్చల్ రూ.16 లక్షలు, గుండ్లపోచంపల్లి రూ.6.5 లక్షలు, తూముకుంట మునిసిపాలిటీలో రూ.15 లక్షల చొప్పున ఆస్తి పన్ను వసూలైంది. వికారాబాద్ మునిసిపాలిటీలో 496 మంది నుంచి ఇంటి పన్ను, నీటి పన్నుల రూపంలో రూ.29,80,827 సమకూరాయి. ఇబ్రహీంపట్నం మునిసిపాలిటీలో రూ.20.93 లక్షలు, వికారాబాద్ జిల్లా పరిగి మునిసిపాలిటీలో రూ.7.50 లక్షలు, తాండూరు మునిసిపాలిటీలో ఇంటి పన్ను, కుళాయి పన్ను రూ.19 లక్షల వరకు వసూలైంది. పెద్ద అంబర్‌పేట మునిసిపాలిటీలో రూ.20,48,536, కొడంగల్ మునిసిపాలిటీలో రూ.2.45 లక్షలు వసూలయ్యాయి.

# ఆదమరిస్తే అంతే సంగతులు

- కాంగ్రెస్, బీజేపీ బలంగా ఉన్న చోట్ల
- టీఆర్ఎస్‌కు గట్టి పోటీ

హైదరాబాద్, జనవరి 10 (ఆంధ్రజ్యోతి): మునిసిపల్ ఎన్నికల్లో తమకు ఎదురులేదని అధికార టీఆర్ఎస్ చెబుతున్నప్పటికీ.. అన్ని చోట్లా కేక్ వాక్ సాధ్యం కాకపోవచ్చని తెలుస్తోంది. ఈ ఎన్నికల్లో కొన్ని ప్రాంతాల్లోనైనా నెక్ టు నెక్ ఫైట్ తప్పదని పార్టీ నేతలు అంగీకరిస్తున్నారు. ప్రధానంగా కాంగ్రెస్, బీజేపీ బలంగా ఉన్న మునిసిపాలిటీల్లో టీఆర్ఎస్‌కు గట్టి పోటీ అనివార్యమని వారు చెబుతున్నారు. పార్టీ అంతర్గత సర్వేల్లోనూ ఇదే తేలిందని, అందుకే అధిష్ఠానం రెబెల్స్ విషయంలో కలవరపడుతోందని అంటున్నారు. రాష్ట్ర స్థాయిలో అధికార పార్టీగా టీఆర్ఎస్‌కి ఈ ఎన్నికల్లో సానుకూలత ఉన్నప్పటికీ, దాదాపు సగం మునిసిపాలిటీల్లో గెలుపు కోసం ఎంతో కొంత శ్రమించక తప్పదని పార్టీ ముఖ్యులు పలువురు అభిప్రాయపడుతున్నారు. 2018లో అసెంబ్లీ ఎన్నికలు ముగిశాక నియోజకవర్గాన్ని వదిలిపెట్టకుండా, స్థానికంగా ఉండి రాజకీయంగా మరుగ్గా వ్యవహరిస్తున్న కాంగ్రెస్, బీజేపీ ప్రజాప్రతినిధులు, నేతలు ఉన్న చోట్ల మునిసిపల్ పోరు ఆసక్తిగా మారిందని చెబుతున్నారు. అక్కడ టీఆర్ఎస్‌కి నువ్వా? నేనా? అనే రీతిలో ఆ రెండు పార్టీల నుంచి పోటీ ఎదురవుతున్నట్లు సర్వే ఫలితాల్లో వెల్లడైందని సమాచారం. వందల్లో ఓట్ల తేడా జరిగినప్పటికీ, వార్డులు/డివిజన్లు చేజారుతాయని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. మరోవైపు కాంగ్రెస్ నుంచి టీఆర్ఎస్ఎల్పీలో విలీనమైన 12 మంది ఎమ్మెల్యేలు ప్రాతినిధ్యం వహిస్తున్న, అసెంబ్లీ నియోజకవర్గాల్లో వారికి, టీఆర్ఎస్ నేతలకు పూర్తి స్థాయిలో పొసగటం లేదు. ఆ ప్రాంతాల్లోని మునిసిపల్ ఎన్నికల్లోనూ టీఆర్ఎస్‌కు నష్టం జరిగే అవకాశాలు ఉన్నాయంటున్నారు. అందుకే పార్టీ అభ్యర్థి గెలుపు కోసం కృషి చేయాలని, ఒక్క చోట ఓడిపోయినా పదవులు ఊడతాయని మంత్రులకు సీఎం కేసీఆర్ వార్నింగ్ ఇచ్చారని అంటున్నారు. అదే సమయంలో రెబెల్స్ బరిలో లేకుండా చూసుకోవాలని, పార్టీ గీత దాటితే సీరియస్ యాక్షన్ తీసుకుంటామంటూ ఆయన ప్రకటన చేశారని చెబుతున్నారు. వాస్తవానికి అధికార పార్టీగా టీఆర్ఎస్ మునిసిపల్ ఎన్నికల ఫలితాల తర్వాత కూడా చక్రం తిప్పే వీలుంటుంది. చైర్‌పర్సన్/మేయర్ పదవులు దక్కించుకోవటానికి సరిపోను వార్డులు/డివిజన్లలో గెలవలేకపోతే, ఇతర పార్టీల నుంచి గెలిచిన వారిని టీఆర్ఎస్‌లో చేర్చుకునే అవకాశాలను తోసిపుచ్చలేమని అంటున్నారు. అయితే ఇందుకోసం శిబిరాలు నిర్వహించాల్సి వస్తుంది. ఇతర పార్టీల నుంచి గెలిచిన వారికి ఎన్నికల్లో వారు ఖర్చు చేసిన మొత్తంతోపాటు, అదనంగా కొంత చెల్లించాల్సి ఉంటుంది. అయితే ఇన్ని తలనొప్పులకన్నా ఎన్నికల్లోనే గట్టిగా కొట్లాడి చైర్‌పర్సన్/మేయర్ పదవులు కైవసం చేసుకోవటానికి అవసరమైన వార్డులు/డివిజన్లు గెల్చుకోవాలనేది టీఆర్ఎస్ అధిష్ఠానం వ్యూహంగా కనిపిస్తోంది. ఎక్కడైనా ఒకటి, రెండు ఓట్లు తక్కువ పడితే చూసుకోవచ్చని, ఎక్స్ అఫీషియో ఓట్లతోనూ నెట్టుకురావచ్చనేది పార్టీ ముఖ్యుల అభిప్రాయంగా ఉంది.

### కాంగ్రెస్ పోటీ ఇచ్చే అవకాశం స్థానాలు..

మల్కాజిగిరి, నల్లగొండ, భువనగిరి, చేవెళ్ల, జహీరాబాద్, మెదక్, ఖమ్మం, మహబూబాబాద్, మహబూబ్‌నగర్, నాగర్‌కర్నూలు, పెద్దపల్లి, వరంగల్ లోక్‌సభ నియోజకవర్గాల పరిధిలోని మునిసిపాలిటీలు, పార్టీ ఎమ్మెల్సీ టి.జీవన్‌రెడ్డి సొంత అసెంబ్లీ నియోజకవర్గం జగిత్యాల వంటి ప్రాంతాల్లో టీఆర్ఎస్‌కు గట్టి పోటీ ఇస్తామని కాంగ్రెస్ భావిస్తోంది. ఇందుకు ఆ పార్టీ ఎంపీలు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి (పీసీసీ అధ్యక్షుడు), రేవంత్‌రెడ్డి, కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డితో పాటు, సీఎల్పీ నేత మల్లు భట్టివిక్రమార్క, పార్టీ ఎమ్మెల్యేలు, సీనియర్లు, నియోజకవర్గ నేతలు స్థానికంగా అందుబాటులో ఉండటం కారణమని చెబుతున్నారు.

### బీజేపీ పోటీ ఇచ్చేది ఈ స్థానాల్లో

ఉమ్మడి కరీంనగర్, నిజామాబాద్, ఆదిలాబాద్, రంగారెడ్డి, మహబూబ్‌నగర్ జిల్లాల్లో బీజేపీ ప్రధానంగా గట్టి పోటీ ఇచ్చే అంచనాలు ఉన్నాయి. తమ ప్రాంతాల్లో ఎన్నికలు జరిగే మునిసిపాలిటీల్లో ఎలాగైనా పాగా వేయాలనే పట్టుదలతో కేంద్ర సహాయ మంత్రి జి.కిషన్‌రెడ్డి, ఆ పార్టీ ఎంపీలు బండి సంజయ్, ధర్మపురి అర్వింద్, సోయం బాపూరావు పనిచేస్తున్నారని కమలనాథులు చెబుతున్నారు.

ఆదిలాబాద్ జిల్లా కేంద్రంలో నామినేషన్ వేసేందుకు బారులు తీరిన అభ్యర్థులు

## మునిసిపోల్స్‌లో
# 21,850 నామినేషన్లు

హైదరాబాద్, జనవరి 10 (ఆంధ్రజ్యోతి): మునిసిపోల్స్‌లో ఒక అంకం ముగిసింది. నామినేషన్ల దాఖలు పూర్తయింది. రాష్ట్ర వ్యాప్తంగా 120 మునిసిపాలిటీలు, 9 కార్పొరేషన్‌ల పరిధిలోని 2727 వార్డులు, 325 డివిజన్‌లకు శుక్రవారం సాయంత్రం గడువు ముగిసేటప్పటికి 21,850 నామినేషన్‌లు దాఖలయ్యాయి. ఈ సంఖ్య ఇంకా పెరిగి 23 వేలకు చేరవచ్చని సమాచారం. శుక్రవారం పలు చోట్ల భారీగా నామినేషన్‌లు దాఖలు కావడంతో పూర్తి స్థాయి సమాచారం ఇంకా రాష్ట్ర ఎన్నికల సంఘానికి చేరలేదు. వీటి క్రోడీకరణ ఇంకా కొనసాగుతోందని ఎస్ఈసీ అధికారులు శుక్రవారం రాత్రి తెలిపారు. కాగా చివరిరోజు 15 వేలకు పైగా నామినేషన్‌లు దాఖలయ్యాయి. మొత్తంగా వార్డు/డివిజన్‌కు సగటున ఏడుకు పైగా నామినేషన్‌లు వచ్చాయి. చివరికి ఈ సగటు 8 వరకు చేరవచ్చని అంచనా. దాఖలైన నామినేషన్‌లను రిటర్నింగ్ అధికారులు శనివారం పరిశీలించనున్నారు. తిరస్కరణకు గురైతే జిల్లా ఎన్నికల అధికారికి అప్పీలు చేసుకునేందుకు 12వ తేదీన అవకాశమిచ్చారు. 13న వీటిని పరిశీలిస్తారు. అవి సక్రమంగా ఉన్నట్లుగా భావిస్తే వాటిని తిరిగి సరైన నామినేషన్‌ల పత్రాల జాబితాలో చేరుస్తారు. 14వ తేదీ మధ్యాహ్నం 3 గంటల వరకు నామినేషన్‌ల ఉపసంహరణకు గడువు ఉంది. గడువు సమయం ముగిసేటప్పటికి రాజకీయ పార్టీల తరఫున పోటీ చేసే అభ్యర్థులు బీ ఫారాలను సమర్పించాల్సి ఉంటుంది.

మునిసిపోల్స్

### నాలుగు చోట్ల ఒకే నామినేషన్

రాష్ట్రవ్యాప్తంగా నాలుగు వార్డులకు ఒక్కొక్క నామినేషన్ మాత్రమే దాఖలైంది. ఉమ్మడి రంగారెడ్డి జిల్లాలోని ఇబ్రహీంపట్నం మునిసిపాలిటీలో టీఆర్ఎస్ అభ్యర్థులుగా 17 వార్డులో ప్రసన్న లక్ష్మి, 18 వార్డులో ఇంద్రాల రమేశ్ నామినేషన్లు వేశారు. ఇక దుండిగల్ మునిసిపాలిటీలో 20 వార్డుకు టీఆర్ఎస్ ఎమ్మెల్సీ శంభీపూర్ రాజు సోదరుడు సుంకర కృష్ణ ఒక్కరే నామినేషన్ దాఖలు చేశారు. కాగా మంచిర్యాల జిల్లా బెల్లంపల్లి మునిసిపాలిటీలో 17వ వార్డుకు టీఆర్ఎస్‌కు చెందిన మాజీ కౌన్సిలర్ బత్తుల సుదర్శన్ ఒక్కరే నామినేషన్ వేశారు. కాగా, పరిశీలన అనంతరం ఇవన్నీ సరైనవిగా ఉంటే అధికారులు వీరిని ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు ప్రకటిస్తారు.

# టీఆర్ఎస్‌కు ఓటేస్తే బీజేపీకి వేసినట్లే!

## సీఏఏ, ఎన్నార్సీపై కేసీఆర్ మాట్లాడరేం?.. టీఆర్ఎస్‌కు మజ్లిస్ ఎలా మద్దతిస్తుంది?

- మైనారిటీలకు అసద్ సంజాయిషీ ఇవ్వాలి
- మునిసిపోల్స్ షెడ్యూల్‌లో టీఆర్ఎస్ కుట్ర
- కాంగ్రెస్‌ను గెలిపిస్తే అవినీతిరహిత పాలన
- ఫేస్‌బుక్ లైవ్‌లో టీపీసీసీ చీఫ్ ఉత్తమ్

ఫేస్‌బుక్ లైవ్‌లో మాట్లాడుతున్న ఉత్తమ్

హైదరాబాద్, జనవరి 10 (ఆంధ్రజ్యోతి): మునిసిపల్ ఎన్నికల్లో టీఆర్ఎస్‌కు ఓటేస్తే బీజేపీకి వేసినట్లేనని టీపీసీసీ అధ్యక్షుడు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి అన్నారు. "అనేక సందర్భాల్లో బీజేపీతో టీఆర్ఎస్ కుమ్మక్కైంది. రాష్ట్రపతి, ఉపరాష్ట్రపతి ఎన్నికలు, నోట్ల రద్దు, జీఎస్టీ, ట్రిపుల్ తలాక్ బిల్లుల విషయంలోనూ బీజేపీకి మద్దతు ఇచ్చింది. సీఏఏ, ఎన్నార్సీలను తమ రాష్ట్రాల్లో అమలు చేయబోమంటూ పశ్చిమబెంగాల్, త్రిపుర రాష్ట్రాల సీఎంలు స్పష్టం చేశారు. అసెంబ్లీ సమావేశం ఏర్పాటు చేసి.. సీఏఏ, ఎన్నార్సీలకు వ్యతిరేకంగా తీర్మానం చేద్దామంటూ మా పార్టీ ప్రతిపాదించినా కేసీఆర్ మాట్లాడడం లేదు. ఈ విషయమై మజ్లిస్ అధ్యక్షుడు అసదుద్దీన్ ఆయన్ను ఎందుకు అడగట్లేదు?"అని ప్రశ్నించారు. రాష్ట్రంలోని మైనారిటీలు ఈ అంశాలను గమనించాలని విజ్ఞప్తి చేశారు. గాంధీభవన్‌నుంచి శుక్రవారం ఫేస్‌బుక్ లైవ్‌లో పార్టీ శ్రేణులను ఉద్దేశించి ఉత్తమ్ మాట్లాడారు. బీజేపీకి మిత్రపక్షంగా వ్యవహరిస్తున్న టీఆర్ఎస్‌కు ఏవిధంగా మద్దతు ఇస్తున్నారో మైనారిటీలకు అసదుద్దీన్ సంజాయిషీ ఇవ్వాలని డిమాండ్ చేశారు. కాంగ్రెస్ పార్టీ ఎప్పుడూ సెక్యులర్ సమాజాన్నే కోరుకుంటుందన్నారు. మునిసిపల్ ఎన్నికల్లో కాంగ్రెస్ గెలిచిన చోట అవినీతి రహిత పాలన అందించడంతోపాటు ప్రజలకు మౌలిక సదుపాయాలు కల్పిస్తామని భరోసా ఇచ్చారు. మునిసిపల్ ఎన్నికల షెడ్యూల్ జారీలో టీఆర్ఎస్ కుట్ర పూరితంగా వ్యవహరించిందని ఆరోపించారు. ఓటరు జాబితా, రిజర్వేషన్ల ఖరారు కాకముందే.. ఎన్నికల సంఘం షెడ్యూల్ విడుదల చేసిందని మండిపడ్డారు. ఈ కుతంత్రాలను చేదించి కాంగ్రెస్ కార్యకర్తలు మంచి ఫలితాలు సాధిస్తారన్న నమ్మకం తనకుందన్నారు. స్క్రూటీ నుంచి ఉపసంహరణ వరకు అప్రమత్తంగా ఉండాలని పార్టీ నేతలకు సూచించారు. డబ్బు ప్రభావం, అధికార దుర్వినియోగంతో గెలిచేందుకు టీఆర్ఎస్ ప్రయత్నిస్తోందని.. అప్రమత్తంగా ఉండాలని పిలుపునిచ్చారు. "నిరుద్యోగులకు నెలకు రూ.3016 చొప్పున భృతి ఇస్తామన్న హామీని కేసీఆర్ విస్మరించారు. రైతులకు రుణమాఫీ చేయలేదు. మునిసిపల్ ఎన్నికల్లో కేసీఆర్, టీఆర్ఎస్‌కు షాక్ ఇస్తే కానీ.. ఇవి అమలు కావు" అని అన్నారు. హామీలు అమలు చేయకుండా ఏ మొహం పెట్టుకుని ఓట్లడుగుతారంటూ టీఆర్ఎస్‌ను నిలదీయాలని సూచించారు. అనంతరం 120 మునిసిపాలిటీలు, 10 కార్పొరేషన్లలోని కార్యకర్తలు, నేతలతో టెలీకాన్ఫరెన్స్ ద్వారా ఉత్తమ్ మాట్లాడారు.

### కాంగ్రెస్‌లో బీ ఫారాల సందడి

హైదరాబాద్, జనవరి 10(ఆంధ్రజ్యోతి): మునిసిపల్ ఎన్నికల్లో కాంగ్రెస్ తరఫున పోటీ చేస్తున్న అభ్యర్థులకు బీఫారాల జారీ ప్రారంభమైంది. సంగారెడ్డి మునిసిపాలిటీకి సంబంధించి బీఫారాలను సంగారెడ్డి ఎమ్మెల్యే జగ్గారెడ్డికి ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి ఖుంటియా, టీపీసీసీ అధ్యక్షుడు ఉత్తమ్ అందజేశారు. శనివారం నుంచీ బీ ఫారాల జారీ మరింత వేగవంతం కానుందని పార్టీ వర్గాలు తెలిపాయి.

### మా అభ్యర్థులపై టీఆర్ఎస్ వల: గూడూరు

హైదరాబాద్, జనవరి 10(ఆంధ్రజ్యోతి): మునిసిపల్ ఎన్నికల్లో కాంగ్రెస్‌కు చెందిన బలమైన అభ్యర్థులను ఆకర్షించి.. వారిని పోటీ ను



ఆలయం ముందు కుటుంబ సభ్యులతో సీఎన్ సోమేశ్ కుమార్

## తెలంగాణ మరింత అభివృద్ధి చెందాలని కోరుకున్నా

### శ్రీవారిని దర్శించుకున్న సీఎన్ సోమేశ్

తిరుమల, జనవరి 10: తెలంగాణ మరింత అభివృద్ధి చెందాలని తిరుమల శ్రీవారిని కోరుకున్నట్లు రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సోమేశ్ కుమార్ తెలిపారు. శుక్రవారం ఉదయం ఆయన కుటుంబ సమేతంగా శ్రీవారిని దర్శించుకున్నారు. అభిషేక సేవలో పాల్గొన్నారు. వేద పండితుల ఆశీర్వచనం తీసుకున్నారు. సోమేశ్‌కు అధికారులు ప్రసాదం అందజేశారు. తెలంగాణ ప్రభుత్వం ఆశయమైన బంగారు తెలంగాణ కోసం తన వంతు కృషి చేసేందుకు తగిన శక్తినివ్వాలని కూడా స్వామిని ప్రార్థించినట్లు సోమేశ్ చెప్పారు.

## బాలవికాస సేవలు అభినందనీయం

### ఇంక్యుబేషన్ సెంటర్ ప్రారంభోత్సవంలో హరీశ్

**మహిళా సంఘాల ఏర్పాటు ఘనత బాలథెరిస్సాదే: ఎర్రబెల్లి**

కేసర, జనవరి 10: దేశంలో ఎక్కడా లేని విధంగా రాష్ట్రంలో ఇంక్యుబేషన్ సెంటర్ ఏర్పాటు చేయడం గర్వకారణమని మంత్రి హరీశ్‌రావు అన్నారు. వరంగల్ జిల్లా వడ్డేపల్లిలో మంచినీటి ట్యాంక్ నిర్మాణంతో మొదలైన బాలవికాస సేవలు 42 ఏళ్లుగా కొనసాగడం అభినందనీయమని కొనియాడారు. మేడ్చల్ జిల్లా కీసర మండలం రాంపల్లిదాయరలో బాలవికాస ఆధ్వర్యంలో ఇంటర్నేషనల్ ఇంక్యుబేషన్ సెంటర్‌ను శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా హరీశ్ మాట్లాడుతూ నిస్వార్థంగా నిరుపేదలకు సేవలు చేస్తున్న బాలవికాస వ్యవస్థాపకులు ఆంద్రె జింగ్రాస్, బాలథెరిస్సాకు అభినందనలు తెలిపారు. మంత్రి ఎర్రబెల్లి మాట్లాడుతూ బాలవికాస సేవలు ప్రభుత్వానికి స్ఫూర్తిదాయకమన్నారు. బాలథెరిస్సా ఆధ్వర్యంలో ఏర్పాటైన మహిళా సంఘాలు ఆర్థికంగా ఎదగడంతో ఎన్జీఆర్ డ్వాక్రా సంఘాల ఏర్పాటుకు శ్రీకారం చుట్టారని తెలిపారు. వినోద్‌కుమార్ మాట్లాడుతూ బాలథెరిస్సాకు పద్మశ్రీ అవార్డు ఇవ్వాలని సీఎం కేసీఆర్ ద్వారా కేంద్రానికి ప్రతిపాదన పంపుతామన్నారు.

ఇంక్యుబేషన్ సెంటర్‌ను ప్రారంభిస్తున్న మంత్రి హరీశ్‌రావు, బాలవికాస వ్యవస్థాపకులు ఆంద్రె జింగ్రాస్, బాలథెరిస్సా

## బీసీ ఓవర్‌సిస్ పథకానికి దరఖాస్తులు

హైదరాబాద్, జనవరి 10 (ఆంధ్రజ్యోతి): మహాత్మ జ్యోతిబా ఫూలే బీసీ ఓవర్‌సిస్ విద్యానిధి పథకం ఈనెల 16నుంచి ప్రారంభమై ఫిబ్రవరి 15 వరకు కొనసాగనుంది. ఈ పథకం కింద పోస్టు గ్రాడ్యుయేషన్, పీహెచ్‌డీ చేయాలనుకునే విద్యార్థులు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలి. విద్యార్థులు సంబంధిత డిగ్రీలో కనీసం 60% మార్కులతో ఉత్తీర్ణులై ఉండాలి. వివరాలకు www.telanganaepass.cgg.gov.in వెబ్‌సైట్‌ను సంప్రదించాలి.

## ఎన్నికల కేసులో కోర్టుకు కొండా దంపతులు

హైదరాబాద్ సిటీ, జనవరి 10 (ఆంధ్రజ్యోతి): కొండా సురేఖ, మురళి దంపతులు శుక్రవారం నాంపల్లి కోర్టుకు హాజరయ్యారు. ఉమ్మడి వరంగల్ జిల్లా పరకాలలో.. 2012లో జరిగిన ఉప ఎన్నికల సందర్భంగా అనుమతి లేకుండా బహిరంగ సభను నిర్వహించారనే ఆరోపణలపై వీరిపై అప్పట్లో కేసు నమోదైంది. ఇదే కేసులో ఏపీ సీఎం జగన్ తల్లి విజయమ్మ, సోదరి షర్మిల కూడా ముద్దాయిలుగా ఉన్నారు. వారికి సమన్లు అందకపోవడంతో కోర్టుకు హాజరుకాలేదని తెలిసింది. కేసు వచ్చే నెల 14కు వాయిదా పడింది.

## వైద్యశాఖ ఉద్యోగుల సమస్యలపై జేఏసీ

హైదరాబాద్, జనవరి 10 (ఆంధ్రజ్యోతి) రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖలో పనిచేస్తున్న వైద్యులు, ఇతర సిబ్బంది తమ సమస్యల పరిష్కారం కోసం ఐక్య కార్యాచరణ కమిటీ (జేఏసీ)ని ఏర్పాటు చేసుకున్నారు. శుక్రవారం జరిగిన సమావేశంలో కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. చైర్మన్‌గా బొంగు రమేశ్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.

## 155 మంది ప్రైమరీ టీచర్లకు ఇంగ్లిషులో శిక్షణ

హైదరాబాద్, జనవరి 10(ఆంధ్రజ్యోతి): విద్యార్థులకు ఇంగ్లిషులో బోధించాలంటే ముందుగా టీచర్లు ఆ భాషపై పట్టు సాధించడం ముఖ్యం. అందుకే రాష్ట్రంలో ప్రైమరీ టీచర్లకు ఇంగ్లిషులో శిక్షణ ఇస్తున్నారు. ఇందుకు సంబంధించి ప్రాథమికంగా ఎంపిక చేసిన 155 మంది టీచర్లకు అజిమ్ ప్రేమ్‌జి వర్సిటీ ప్రొఫెసర్లు శిక్షణ ఇచ్చారు. శుక్రవారం శిక్షణ కార్యక్రమం ముగిసింది. శిక్షణ పొందిన వారంతా జిల్లాల్లో మిగతా టీచర్లకు శిక్షణ ఇప్పించనున్నారు.

## హైదరాబాద్ శాస్త్రవేత్తకు అంతర్జాతీయ గుర్తింపు

**ఐయూపీఏసీ బ్యూరో సభ్యుడిగా బిపుల్ బిహారీ సాహా**

హైదరాబాద్, జనవరి 10(ఆంధ్రజ్యోతి): హైదరాబాద్‌కు చెందిన శాస్త్రవేత్త డాక్టర్ బిపుల్ బిహారీ సాహాకు అంతర్జాతీయ గుర్తింపు దక్కింది. ఇంటర్నేషనల్ యూనియన్ ఆఫ్ ప్యూర్ అండ్ అప్లైడ్ కెమిస్ట్రీ (ఐయూపీఏసీ)కి 2020-23 కాలానికి బ్యూరో సభ్యుడి గా ఆయన ఎంపికయ్యారు. ఈ మేరకు ఐయూపీఏసీ శుక్రవారం ప్రకటన విడుదల చేసింది. 29 మందితో కూడిన ఐయూపీఏసీ కార్యవర్గంలో భారత్ నుంచి బిపుల్ బిహారీ సాహా ఒక్కరే ఎంపికయ్యారు. ఆయన నగరంలోని ఎన్‌ఏసీఎల్ ఇండస్ట్రీస్‌లో చీఫ్ రీసెర్చ్, డెవలప్‌మెంట్ ఆఫీసర్‌గా పనిచేస్తున్నారు.

## పెన్షనర్లు జీవన పత్రాలను ఏటా ఇవ్వాలి: ఏపీఎఫ్‌సీ

హైదరాబాద్ సిటీ, జనవరి 10 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం నుంచి పెన్షన్ పొందేవారు తప్పనిసరిగా తమ జీవన ప్రమాణ పత్రాలను సమర్పించాలని లేకపోతే పెన్షన్ నిలిచిపోతుందని హైదరాబాద్ అసిస్టెంట్ ప్రావిడెంట్ ఫండ్ కమిషనర్(ఏపీఎఫ్‌సీ) డి.శ్రీకాంత్ తెలిపారు. మారిన నిబంధనలకు అనుగుణంగా ఏడాదిలో ఏ నెలలోనైనా పత్రాలను సమర్పించవచ్చన్నారు. తొలిసారి ఏ నెలలో సమర్పిస్తారో.. ఏటా అదే నెలలో పత్రాలను సమర్పించాలని చెప్పారు. వివరాలకు 040-27564571 నంబరును సంప్రదించాలని లేదా rohyd@epfindia.gov.in కు మెయిల్‌చేయాలని ఆయన సూచించారు.

## అమల్లోకి వచ్చిన సీఏఏ.. గెజిట్ విడుదల

న్యూఢిల్లీ, జనవరి 10: దేశవ్యాప్తంగా విమర్శలు, వివాదాలు, నిరసనలు, ఆందోళనలతో అత్యంత చర్చనీయాంశమైన పౌరసత్వ సవరణ చట్టం (సీఏఏ) శుక్రవారం నుంచి అమల్లోకి వచ్చింది. ఈ మేరకు కేంద్ర హోం మంత్రిత్వ శాఖ గెజిట్ నోటిఫికేషన్ విడుదల చేసింది. మత వివక్ష కారణంగా.. పాకిస్థాన్, బంగ్లాదేశ్, అఫ్గానిస్థాన్‌ల నుంచి 2014 డిసెంబరు 31కి ముందు భారత్‌లోకి వచ్చిన హిందువులు, సిక్కులు, బౌద్ధులు, జైనులు, పార్శీలు, క్రైస్తవులకు పౌరసత్వం కల్పించే ఉద్దేశంతో కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన పౌరసత్వ సవరణ బిల్లు (సీఏబీ)ను ఇటీవల పార్లమెంట్ ఆమోదించింది. ఈ చట్టానికి సంబంధించిన నిబంధనలను ఇంకా రూపొందించాల్సి ఉంది.

మంచిర్యాల జిల్లా జైపూర్ ఎన్‌టీపీపీలో ఏర్పాటు చేసిన సోలార్ విద్యుత్‌ప్లాంట్

## సోలార్ విద్యుత్ ఉత్పత్తి రంగంలోకి సింగరేణి

మంచిర్యాల, జనవరి 10 (ఆంధ్రజ్యోతి): సింగరేణి చరిత్రలో కొత్త అధ్యాయం మొదలైంది. సోలార్ పవర్ ఉత్పత్తికి శ్రీకారం చుట్టింది. శుక్రవారం 5 మెగావాట్ల విద్యుత్‌ను ఉత్పత్తి చేసి గ్రిడ్‌కు అనుసంధానం చేశారు. ఈ సందర్భంగా అధికారులకు సీఎండీ అభినందనలు తెలిపారు. ఆగస్టు నాటికి 220 మెగావాట్ల సోలార్ విద్యుత్తును ఉత్పత్తి చేస్తామని సింగరేణి సీఎండీ ఎన్. శ్రీధర్ చెప్పారు. ఈ పవర్ ప్లాంటు సామర్థ్యం 2020 మెగావాట్లు. మొదట్లో బొగ్గు ఉత్పత్తికి మాత్రమే పరిమితమైన సింగరేణి సంస్థ మూడు సంవత్సరాల క్రితం థర్మల్ విద్యుత్ ఉత్పత్తి రంగంలోకి అడుగుపెట్టింది. ఇప్పుడు సోలార్ విద్యుత్తు ఉత్పత్తిని ప్రారంభించింది. దేశంలో సోలార్ విద్యుత్ ఉత్పాదన రంగంలోకి అడుగుపెట్టిన ఏకైక బొగ్గు సంస్థ సింగరేణి.

## కర్ణాటక విద్యాసంస్కరణల సలహాదారుగా ఎం.ఆర్.దొరస్వామి

బెంగళూరు, జనవరి 10(ఆంధ్రజ్యోతి): కర్ణాటక ప్రభుత్వ విద్యాసంస్కరణల సలహాదారుగా పీఈఎస్ విద్యాసంస్థల వ్యవస్థాపకుడు ప్రొఫెసర్ ఎం.ఆర్.దొరస్వామి నియమితులయ్యారు. ఆయనకు కేబినెట్ హోదా కల్పిస్తున్నట్లు సీఎం యడియూరప్ప ప్రకటించారు. పీఈఎస్ విద్యాసంస్థల సంస్థాపకుడిగా, విధానపరిషత్ మాజీ సభ్యుడిగా అందించిన సేవలకు గుర్తింపుగా ప్రభుత్వం ఆయనను ఈ కీలక పదవికి ఎంపిక చేసింది. ఆరేళ్ల ఎమ్మెల్సీగా ఉన్న సమయంలోనూ విద్యావ్యవస్థలో సంస్కరణలకే ఆయన ప్రాధాన్యం ఇచ్చారు. విద్యావేత్తగానే కాకుండా సామాజిక సేవారంగంలోనూ దొరస్వామి మంచిపేరు తెచ్చుకున్నారు. 1997లో కన్నడ రాజ్యోత్సవ పురస్కారం, 2000లో కెంపేగౌడ పురస్కారం, 2001లో ఆర్యభట్ట పురస్కారం, 2014లో విశ్వమానవ పురస్కారాలను అందుకున్నారు. ప్రవాసాంధ్రుడైన దొరస్వామికి కీలక పదవి లభించడంతో సర్వత్రా హర్షం వ్యక్తమవుతోంది.

## సీఏఏ, ఎన్ఆర్‌సీ, ఎన్‌పీఆర్‌లను రద్దు చేసేదాకా పోరాటం ఆగదు

(మొదటి పేజీ తరువాయి)

తక్షణం ఉపసంహరించుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. శుక్రవారం యునైటెడ్ ముస్లిం యాక్షన్ కమిటీ ఆధ్వర్యంలో మీర్ ఆలం ఈద్గా నుంచి శాస్త్రిపురం వరకూ భారీగా తిరంగా ర్యాలీ జరిగింది. ఈద్గాలో ప్రార్థనల అనంతరం ముస్లిం యాక్షన్ కమిటీ ప్రతినిధులతో కలిసి మజ్లిస్ ఎంపీ అసదుద్దీన్ ఒవైసీ ప్రధాన రహదారిపై ర్యాలీగా శాస్త్రిపురం వైపు కలిదిలారు. అక్కడ బహిరంగసభలో ప్రసంగించారు. బీజేపీ ప్రభుత్వం తీసుకువచ్చిన పౌరసత్వ సవరణ చట్టం ముస్లింలు, హిందువులు అందరికీ ప్రమాదకరమైదిగా పేర్కొన్నారు. తాము ఎట్టి పరిస్థితుల్లోనూ సీఏఏ, ఎన్ఆర్‌సీ, ఎన్‌పీఆర్‌లను అంగీకరించేది లేదని స్పష్టం చేశారు. అంబేద్కర్ రాసిన భారత రాజ్యాంగాన్ని, ప్రజాస్వామ్యాన్ని రక్షించుకునేందుకు కలిసిరావాలని ప్రజలకు పిలుపునిచ్చారు. అంబేద్కర్ రాజ్యాంగం ప్రకారం పాలన సాగాలన్నారు. హిందూ-ముస్లిం- సిక్-ఇసాయి దేశానికి నాలుగు మూలస్తంభాలని, ఈ నాలుగు మతాలవారి ఐక్యతను ఎవరూ దెబ్బతీయలేరని అన్నారు. మత సామరస్యంతో మెలుగుతున్న హిందూ -ముస్లింల మధ్య అగాధం సృష్టించి ఆ సామరస్యాన్ని దెబ్బతీసేందుకే బీజేపీ ప్రభుత్వం సీఏఏ, ఎన్ఆర్‌సీ, ఎన్‌పీఆర్‌ల అమలుకు కుట్ర పన్నుతోందని ఆరోపించారు. బ్రిటిష్ పాలకుల నుంచి భారతదేశానికి స్వాతంత్ర్యం సంపాదించడంలో ముస్లింలు కీలక పాత్ర పోషించారని ఆయన గుర్తు చేశారు. హిందూ-ముస్లింలను విభజించడం ఎవరి తరంకాదన్నారు. జనవరి 25వ తేదీ రాత్రి చార్మినార్ వద్ద యునైటెడ్ ముస్లిం యాక్షన్ కమిటీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేయనున్న నిరసన బహిరంగసభకు ప్రజాస్వామ్యవాదులు భారీ ఎత్తున తరలిరావాలని కోరారు.

జాతీయ జెండాతో హైదరాబాద్‌లో నిర్వహించిన ర్యాలీ

రిపబ్లిక్ డే సందర్భంగా అక్కడ అర్ధరాత్రి దాటిన తర్వాత జాతీయ జెండాను ఆవిష్కరించనున్నట్టు ఒవైసీ తెలిపారు. జమాతే ఇస్లామీ హింద్ తెలంగాణ అధ్యక్షుడు హామిద్ మహమ్మద్‌ఖాన్, పీవోడబ్ల్యూ అధ్యక్షురాలు సంధ్య, ఉర్దూ అకాడమి చైర్మన్ రహీముద్దీన్ అన్సారీ, ఎమ్మెల్సీ అమీనుల్ హసన్ జాఫ్రీ, దారుల్ ఉలూమ్ అధ్యక్షుడు జాఫర్ పాషా, రాష్ట్ర వక్ఫ్‌బోర్డు చైర్మన్ మహ్మద్ సలీం, రాష్ట్ర హజ్ కమిటీ చైర్మన్ మసియుల్లా ఖాన్, నాంపల్లి నియోజకవర్గం టీఆర్ఎస్ నాయకులు నూర్‌ఉల్ హక్ ఖాద్రీ, రహీముల్లాఖాన్ తదితరులు ఈ ర్యాలీలో, సమావేశంలో పాల్గొన్నారు.

### మేం భారతీయులం.. ఈ దేశం మాది..

పౌరసత్వ సవరణ చట్టం(సీఏఏ) ఎన్ఆర్‌సీ, ఎన్‌పీఆర్‌లను వ్యతిరేకిస్తూ యునైటెడ్ ముస్లిం యాక్షన్ కమిటీ ఆధ్వర్యంలో జరిగిన తిరంగా ర్యాలీలో.. జాతీయపతాకాల రెపరెపల నడుమ అతి భారీ సంఖ్యలో పాల్గొన్నారు. "మేమంతా భారతీయులం.. ఈ దేశం మాది" అంటూ నినాదాలు చేస్తూ ముస్లిం యువతీ-యువకులు, వృద్ధులు, మహిళలు, చిన్నపిల్లలు ఉత్సాహంతో కదంతొక్కారు. 'సేవ్ ఇండియా.. సేవ్ డెమాక్రసీ', 'రిజెక్ట్ సీఏఏ, ఎన్ఆర్‌సీ, ఎన్‌పీఆర్', అనే నినాదాలు రాసిన ప్లకార్డులు, మరో చేతిలో జాతీయ త్రివర్ణ పతాకాన్ని పట్టుకుని ర్యాలీకి తరలివచ్చారు. కేంద్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. జంటనగరాల నుంచే కాకుండా రాష్ట్రం నలుమూలల నుంచి ముస్లింలు పెద్ద ఎత్తున ఈ ర్యాలీకి విచ్చేశారు. దీంతో పురానాపూల్ నుంచి జూపార్క్ మీదుగా శంషాబాద్ వైపు వెళ్లే ప్రధాన రహదారి సుమారు మూడు కిలోమీటర్ల మేర నిరసనకారులతో నిండిపోయింది. శుక్రవారం ఉదయం నుంచే భారీ ఎత్తున కార్యకర్తలు, యువత జూపార్క్ రహదారిపైకి చేరుకోవడంతో పోలీసులు ఈ ప్రాంతం నుంచి వచ్చి వెళ్లే వాహనదారులను ప్రత్యామ్నాయ మార్గాల్లో తరలించారు. ఆర్టీసీ బస్సులను రద్దు చేశారు. ముందు జాగ్రత్తగా పోలీసులు భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు. షాలిబండా, చార్మినార్, పత్తర్‌ఘట్టీ, మదీనా, గుల్జార్‌హౌజ్ తదితర ప్రాంతాల్లో వ్యాపార, వాణిజ్య కేంద్రాలను మూసి వేసి ముస్లింలు ర్యాలీకి తరలివెళ్లారు. దీంతో శుక్రవారం పాతనగరంలో పూర్తిగా బంద్ వాతావరణ ఏర్పడింది. అదేసమయంలో.. జూపార్క్ నుంచి మీర్ ఆలం ఈద్గా, శాస్త్రి పురం వరకు ప్రధాన రహదారులు, బస్తీలు నిరసనకారులతో సందడి సందడిగా కన్పించాయి.

### ర్యాలీని వీడియో తీయండి: హైకోర్టు

హైదరాబాద్, జనవరి 10 (ఆంధ్రజ్యోతి): పౌరసత్వ సవరణ చట్టం (సీఏఏ), జాతీయ పౌర జాబితా (ఎన్ఆర్‌సీ)కి వ్యతిరేకంగా యునైటెడ్ ముస్లిం యాక్షన్ కమిటీ, ఎంఐఎం పార్టీ తలపెట్టిన ర్యాలీ, సమావేశాలను పూర్తిగా వీడియో చిత్రీకరణ చేయాలని పోలీసులను హైకోర్టు ఆదేశించింది. అనుమతించిన మార్గంలోనే ర్యాలీ ఉండాలని స్పష్టం చేసింది. ర్యాలీలో ఎలాంటి అవాంచనీయ ఘటనలు చోటుచేసుకుండా తగినంత మంది పోలీసు బలగాలను మోహరించాలని సూచించింది. ఉల్లంఘనలు జరిగితే.. కార్యక్రమానికి అనుమతి తీసుకున్న వ్యక్తిపై చట్టప్రకారం చర్యలు తీసుకోవాలని తేల్చిచెప్పింది. ఈ ర్యాలీ, సమావేశాలను ఆపేలా చర్యలు తీసుకోవాలని కోరుతూ నందరాజ్ అనే వ్యాపారి హైకోర్టును ఆశ్రయించగా.. శుక్రవారం విచారణ చేపట్టిన హైకోర్టు ఈమేరకు ఆదేశాలు జారీ చేసింది.

## జాతీయ జెండాకు అవమానం

జాతీయ జెండాపై 'నో సీఏఏ, నో ఎన్నార్సీ' నినాదాలు

చాంద్రాయణగుట్ట/హైదరాబాద్, జనవరి 10 (ఆంధ్రజ్యోతి): అలియాబాద్‌లో జాతీయ జెండాకు అవమానం జరిగిందని బీజేపీ నాయకులు శాలిబండ ఠాణాలో ఫిర్యాదు చేశారు. తిరంగా ర్యాలీని పురస్కరించుకుని అలియాబాద్ దర్బారు మైసమ్మ దేవాలయం వద్ద 'నో సీఏఏ, నో ఎన్ఆర్‌సీ' అని రాసిన జాతీయ జెండాను ప్రదర్శించారని.. ఇది జాతీయ పతాకాన్ని అవమానించడమేనని వారు పేర్కొన్నారు. ఈ పని చేసినవారిపై కఠిన చర్యలు తీసుకోవాలని పోలీసులను కోరారు.

## ఎన్ఆర్‌సీకి మద్దతుగా ముస్లిం దంపతుల ప్రచారం

కేసముద్రం, జనవరి 10: ఎన్ఆర్‌సీ, సీఏఏలను దేశవ్యాప్తంగా ముస్లింలు వ్యతిరేకిస్తుండగా ఇందుకు భిన్నంగా మహబూబాబాద్ జిల్లా కేసముద్రానికి చెందిన ముస్లిం దంపతులు మద్దతుగా రెండు రోజులుగా ప్రచారం చేస్తున్నారు. కేసముద్రం స్టేషన్ కిష్టాపురం ఎర్రగడ్డకాలనీకి చెందిన ఎండీ ఖాసిం, షాహెదా దంపతులు సీఏఏ అనుకూల ఫ్లకార్డులు చేతపట్టి, బైక్‌పై తిరుగుతూ ప్రచారం నిర్వహిస్తున్నారు. వీటిపై 'ఐయామ్ ఇండియన్ ముస్లిం, ఐ సపోర్ట్ సీఏఏ, ఎన్ఆర్సీ' అని రాసి ఉంది. ఖాసిం తన బైక్‌పైనా ఈ నినాదాలు రాయించాడు. ఎన్ఆర్సీ, సీఏఏలతో దేశంలోని ముస్లింలకు ఎలాంటి ఇబ్బంది ఉండదని, అనవసరమైన అపోహలు వద్దని ఆయన హితవుపలికారు. బీజేపీ రాష్ట్ర నాయకుడు హుస్సేన్‌నాయక్ పిలుపుమేరకు తాము ప్రజలను చైతన్యపరుస్తున్నట్లు చెప్పారు.

కేసముద్రంలో ప్రచారం నిర్వహిస్తున్న ఖాసిం, షాహెదా

## విద్యుత్తు సమర్థతలో తెలంగాణ@ 4

- హరియాణా టాప్.. ఏపీకి ఆరో స్థానం
- ర్యాంకులు విడుదల చేసిన కేంద్ర మంత్రి ఆర్కే సింగ్
- తెలంగాణలో వీధి దీపాల నిర్వహణకు ప్రశంస
- మునిసిపాలిటీల కేటగిరీలో నంబర్ వన్

న్యూఢిల్లీ, జనవరి 10 (ఆంధ్రజ్యోతి): దేశంలో విద్యుత్తు పంపిణీ, నిర్వహణలో రాష్ట్రాల సమర్థతపై కేంద్ర ప్రభుత్వం ర్యాంకులు ప్రకటించింది. కేంద్ర విద్యుత్తు శాఖ మంత్రి ఆర్కే సింగ్ శుక్రవారం ఢిల్లీలో ఈ సూచీని విడుదల చేశారు. ఇందులో తెలంగాణకు 4వ స్థానం దక్కింది. భవనాలు, పరిశ్రమలు, మునిసిపాలిటీలు, రవాణా, వ్యవసాయం-డిస్కమ్‌లు, క్రాస్‌సెక్టార్ రంగాలు ప్రామాణికంగా.. సరఫరా నిర్వహణలో రాష్ట్రాల పనితీరుపై వివరాలు సేకరించిన కేంద్రం.. ఈ సూచీని రూపొందించింది. టోటల్ ప్రైమరీ ఎనర్జీ సప్లై( టీపీఇఎస్) ఆధారంగా రాష్ట్రాలను 4 కేటగిరీలుగా విభజించారు. రెండో కేటగిరీలో తెలంగాణ, ఏపీ, హరియాణా, కేరళ, పంజాబ్, ఢిల్లీ, ఛత్తీస్‌గఢ్, పశ్చిమ బెంగాల్, జార్ఖండ్ ఉన్నాయి. ఈ కేటగిరీలో తెలంగాణ మూడో స్థానంలో నిలిచింది. హరియాణా, కేరళ, కర్ణాటక తొలి మూడు స్థానాలను దక్కించుకోగా, ఆంధ్రప్రదేశ్ ఆరో స్థానంలో నిలిచింది.

### ఈ సూచీలోని మరిన్ని విశేషాలు

- రెండో గ్రూపులో తెలంగాణకు డొమెస్టిక్ సరఫరాలో మూడో స్థానం.. పరిశ్రమల విభాగంలో నాలుగో స్థానం
- మునిసిపాలిటీల్లో విద్యుత్తు సరఫరాలో తెలంగాణ టాప్.. రవాణా రంగంలో మూడో స్థానం, క్రాస్ సెక్టార్‌లో రెండో స్థానంలో, వ్యవసాయ - డిస్కమ్ రంగంలో ఏడో స్థానం
- తెలంగాణ స్టేట్ స్ట్రీట్ లైటింగ్ సిస్టమ్ డ్యాష్‌బోర్డ్‌కు కేంద్రం ప్రశంసలు. దీనిపై సూచీలో ప్రత్యేకంగా ప్రస్తావన. వీధి దీపాలకు ప్రత్యేక ఆడిట్
- వాణిజ్య భవనాల్లో విద్యుత్తు వినియోగానికి ఆడిట్‌ను తప్పనిసరి చేసిన రాష్ట్రాల్లో తెలంగాణ ఉంది
- ఎనర్జీ కన్జర్వేషన్ బిల్డింగ్ కోడ్ (ఈసీబీసీ) అమలులో తెలంగాణ ముందంజలో ఉంది. ఈసీబీసీలో భవనాలకు ఆర్థికంగా ప్రోత్సాహకాలు ఇవ్వకున్నా.. అనుమతుల జారీలో ప్రాధాన్యత ఇస్తోంది
- మునిసిపల్ సేవలకు విద్యుత్తు ఆదా లక్ష్యాలను నిర్దేశించిన నాలుగు రాష్ట్రాల్లో తెలంగాణ ఒకటి. మురుగు శుద్ధి, పంపింగ్‌లోనూ తెలంగాణ విద్యుత్తు సమర్థత కార్యక్రమాన్ని అమలు చేస్తోంది.

## 2 గంటలు కోర్టులో జగన్!

హైదరాబాద్, జనవరి 10 (ఆంధ్రజ్యోతి): అక్రమాస్తుల కేసు విచారణలో భాగంగా ఆంధ్ర ప్రదేశ్ ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డి నాంపల్లిలోని సీబీఐ కోర్టులో హాజరయ్యారు. సీఎం హోదాలో ఆయన కోర్టు ముందు హాజరవడం ఇదే తొలిసారి. శుక్రవారం సీబీఐ ప్రత్యేక కోర్టులోకి వెళ్లిన జగన్.. దాదాపు 2 గంటల పాటు కోర్టు హాల్‌లోనే ఉండడం గమనార్హం. ఇదే కేసులో రెండో నిందితుడిగా ఉన్న రాజ్యసభ సభ్యుడు వి.విజయసాయిరెడ్డితోపాటు ఐఏఎస్ అధికారులు వైశ్రీలక్ష్మి, మన్మోహన్‌సింగ్, మాజీ ఐఏఎస్ శామ్యూల్, పారిశ్రామికవేత్తలు పెన్నా ప్రతాపరెడ్డి, రాంకీ అయోధ్య రామిరెడ్డి తదితరులు కూడా హాజరయ్యారు. జగన్ రాక నేపథ్యంలో కోర్టు వద్ద భద్రతను కట్టుదిట్టం చేశారు. కేవలం న్యాయవాదులను మాత్రమే, అది కూడా గుర్తింపు కార్డు చూసి కోర్టు హాల్ ఉన్న 12వ అంతస్తుకు వెళ్లేందుకు అనుమతించారు. అయితే విచారణ ప్రారంభం కాగానే న్యాయమూర్తి.. ఇన్‌కెమెరా (రహస్య) విచారణ చేస్తామన్నారు. ఐదు చార్జిషీట్లలో నిందితులు, వారి తరఫు న్యాయవాదులు మాత్రమే ఉండాలని, మిగిలిన వారిని బయటకు పంపాలని సిబ్బందిని ఆదేశించారు. ఆ తర్వాత కోర్టు హాలు తలుపులు మూసేసి రెండు గంటల పాటు విచారణ కొనసాగించారు.

సీబీఐ కోర్టు నుంచి బయటకు వస్తున్న జగన్

### ఆయన రావాల్సిందే..!

అక్రమాస్తులకు సంబంధించి జగన్ తీవ్రమైన ఆర్థిక నేరాల అభియోగాలు ఎదుర్కొంటున్నాడని, ఇటువంటి కేసుల్లో ఆయనకు బదులుగా సహ నిందితుల హాజరుకు అనుమతి ఇవ్వరాదని ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) స్పెషల్ పీపీ తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. దాదాపు 10 పేజీల కౌంటర్ దాఖలు చేశారు. ఇటువంటి తీవ్రమైన నేరాల్లో సహ నిందితుల హాజరుకు అనుమతి ఇవ్వరాదని కోరారు. ఇరువర్గాల వాదనలు విన్న న్యాయమూర్తి తీర్పును ఈ నెల 24కు వాయిదా వేశారు.

### ఇప్పటికే 8 ఏళ్లయింది: సీబీఐ

జగన్ అక్రమాస్తుల కేసులో 2012 మార్చిలో సీబీఐ మొదటి చార్జిషీట్ దాఖలు చేసిందని, ఎనిమిదేళ్లు గడిచినా ఇంకా డిశ్చార్జ్ పిటిషన్ల దశలోనే ఉందని.. ఐదు చార్జిషీట్లలో డిశ్చార్జ్ పిటిషన్లను కలిపి విచారించాలంటే ఇంకా ఎన్నేళ్లు పడుతుందోనని సీబీఐ స్పెషల్ పీపీ కె.సురేందర్ అభ్యంతరం వ్యక్తం చేశారు. తనపై సీబీఐ దాఖలు చేసిన ఐదు చార్జిషీట్లలో డిశ్చార్జ్ పిటిషన్లను కలిపి విచారించేలా ఉత్తర్వులు ఇవ్వాలంటూ జగన్ దాఖలు చేసిన పిటిషన్‌ను న్యాయమూర్తి బీఆర్ మధుసూదన్‌రావు విచారించారు. జగన్ తరపు న్యాయవాది వాదనలు వినిపిస్తూ.. తాము ఒక చార్జిషీట్‌లో వాదన వినిపించిన తర్వాత మరో చార్జిషీట్‌లో లోపాలన్నింటినీ సీబీఐ సరిచేసుకొని వాదనలు వినిపించే అవకాశం ఉందని చెప్పారు. అన్ని చార్జిషీట్లలో డిశ్చార్జ్ పిటిషన్లను కలిపి విచారించాలని కోరారు. దీనిపై సీబీఐ స్పెషల్ పీపీ తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. వాదనలు విన్న న్యాయమూర్తి.. తదుపరి విచారణను ఈ నెల 17కు వాయిదా వేశారు.

### 'పెన్నా' కేసులో సబితకు సమన్లు

జగన్ సంస్థల్లో పెన్నా కంపెనీలు పెట్టుబడులు పెట్టిన కేసులో సీబీఐ దాఖలు చేసిన అనుబంధ చార్జిషీట్‌ను ప్రత్యేక కోర్టు విచారణకు స్వీకరించింది. వైఎస్ ప్రభుత్వంలో రెవెన్యూ మంత్రిగా పనిచేసిన ధర్మాన ప్రసాదరావు, గనుల శాఖ మంత్రిగా పనిచేసిన సబితా ఇంద్రారెడ్డితోపాటు ఇతర నిందితులకు సమన్లు జారీ చేశారు. ఈ నెల 17న వ్యక్తిగతంగా హాజరు కావాలని ఆదేశించారు. ఈ కేసులో అప్పటి రెవెన్యూ శాఖ ముఖ్య కార్యదర్శి మైలపల్లి శామ్యూల్, అనంతపురం జిల్లా డీఆర్వోగా పనిచేసిన ఎం.సుదర్శన్‌రెడ్డి, యాడికి మండల తహసీల్దార్ మాతంగి ఎల్లమ్మ, పరిశ్రమల శాఖ ముఖ్య కార్యదర్శిగా పనిచేసిన సీనియర్ ఐఏఎస్ వైశ్రీలక్ష్మి, గనుల శాఖ మాజీ డైరెక్టర్ వాల్మీకి దాసరి రాజగోపాల్ నిందితులుగా ఉన్నారు. దర్యాప్తులో వెలుగు చూసిన అంశాల ఆధారంగా ఈ అనుబంధ చార్జిషీట్ దాఖలు చేస్తున్నామని సీబీఐ పేర్కొంది. దీనిపై పెన్నా సిమెంట్స్ తరపు న్యాయవాది తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. అనుబంధ చార్జిషీట్‌లో కొత్త అంశా

## సైనా, సింధు ఓటమి

**కౌలాలంపూర్:** కొన్నాళ్లుగా ఫామ్‌లేమితో సత మతమవుతున్న భారత స్టార్ షట్లర్లు పీవీ సింధు, సైనా నెహ్వాల్ ఈ సీజన్‌నూ నిరాశగా ప్రారంభించారు. ఏడాదిలో తొలి టోర్నమెంట్ అయిన మలేసియా మాస్టర్స్‌లో క్వార్టర్‌ఫైనల్లోనే నిష్క్రమించారు. శుక్రవారం జరిగిన మహిళల సింగిల్స్ క్వార్టర్స్‌లో సింధు 16-21, 16-21తో టాప్‌సీడ్ తై జు యింగ్ (చైనీస్ తైపీ) చేతిలో ఓటమిపాలైంది. ఈ విజయంతో తైజు.. సింధుతో ముఖాముఖీ రికార్డును 12-5కు పెంచుకుంది. మరో మ్యాచ్‌లో సైనా 8-21, 7-21తో స్పెయిన్ సంచలనం కరోలినా మారిన్ చేతిలో చిత్తుగా ఓటమిపాలైంది.

## చాలెంజర్ విజేత ఇండియా 'సి'

మెరిసిన షఫాలీ

**కటక్:** టీనేజర్ షఫాలీ వర్మ (45 బంతుల్లో 15 ఫోర్లు, 2 సిక్స్‌లతో 89 నాటౌట్) మెరుపు బ్యాటింగ్‌తో మహిళల టీ20 చాలెంజర్ ట్రోఫీని ఇండియా 'సి' గెలుచుకుంది. శుక్రవారం జరిగిన ఫైనల్లో ఇండియా 'సి' ఎనిమిది వికెట్లతో ఇండియా 'బి'పై ఘన విజయం సాధించింది. టాస్ గెలిచి తొలుత బ్యాటింగ్ చేసిన ఇండియా 'బి' నిర్ణీత 20 ఓవర్లలో 6 వికెట్లకు 131 పరుగులు చేసింది. పూజా వస్త్రాకర్ (43 నాటౌట్) బ్యాట్ ఝళిపించడంతో ఇండియా 'బి' గౌరవప్రదమైన స్కోరు చేయగలిగింది. 'సి' బౌలర్లలో మనాలీ దక్షిణి (3/15) మూడు వికెట్లు పడగొట్టింది. దయాలన్, హేమలత, రాజేశ్వరీ గైక్వాడ్ ఒక్కో వికెట్ సాధించారు. అనంతరం 132 పరుగుల లక్ష్యాన్ని 28 బంతులు మిగిలి ఉండగానే ఇండియా 'సి' ఛేదించింది.

## బోపన్న జోడీకి కతార్ టైటిల్

**దోహా:** భారత టెన్నిస్ డబుల్స్ స్టార్ రోహన్ బోపన్న ఈ సీజన్‌లో తొలి టైటిల్ సాధించాడు. నెదర్లాండ్స్ ఆటగాడు వెస్లీ కూలోఫ్‌తో కలిసి బోపన్న కతార్ ఓపెన్‌లో డబుల్స్ చాంపియన్‌గా నిలిచాడు. శుక్రవారం జరిగిన పురుషుల డబుల్స్ ఫైనల్లో మూడోసీడ్ బోపన్న-వెస్లీ జోడీ 3-6, 6-2, 10-6తో ల్యూక్ బాంబ్రిడ్జ్ (బ్రిటన్)-శాంటియాగో గోంజాలెజ్ (మెక్సికో) ద్వయంపై విజయం సాధించింది.

## ప్రసన్న డబుల్ ధమాకా

**గువాహటి:** తెలంగాణ యువ జిమ్నాస్ట్ సురభి ప్రసన్న ఖేలో ఇండియా యూత్ గేమ్స్‌లో వరుసగా రెండోరోజు పతకాలు కొల్లగొట్టింది. గురువారం కాంస్యం నెగ్గిన ప్రసన్న.. శుక్రవారం జరిగిన పోటీల్లో రెండు రజత పతకాలు సాధించి ఔరా అనిపించింది. బాలికల అండర్-17 టేబుల్ వాల్ట్‌లో 12 పాయింట్లు స్కోరు చేసి రెండో స్థానంలో నిలిచింది. ఆంధ్రప్రదేశ్ జిమ్నాస్ట్ సుస్మితా రెడ్డి నాలుగోస్థానంలో నిలిచింది. జిమ్నాస్టిక్స్‌లోనే అండర్-17 బ్యాలెన్సింగ్ బీమ్‌లో ప్రసన్న రజత పతకం సాధించింది.

## విరాట్ కోహ్లీ @ 11వేలు

విరాట్ కోహ్లీ ఖాతాలో మరో రికార్డు చేరింది. అంతర్జాతీయ క్రికెట్‌లో అన్ని ఫార్మాట్లలోనూ కలిపి అత్యంత వేగంగా (169 మ్యాచ్‌ల్లో) 11 వేల పరుగులు చేసిన తొలి కెప్టెన్‌గా నిలిచాడు. ఈ మ్యాచ్‌కు ముందు ఈ ఫీట్ కోసం కేవలం ఒక్క పరుగు దూరంలోనే ఉన్న కోహ్లీ నందకన్ ఓవర్‌లో సింగిల్ తీసి రికార్డు పూర్తి చేశాడు. ఓవరాల్‌గా పాంటింగ్, గ్రేమ్ స్మిత్, ధోనీ, బోర్డర్, ఫ్లెమింగ్ కూడా ఈ జాబితాలో ఉన్నారు.

అంతర్జాతీయ టీ20ల్లో భారత్ తరఫున అత్యధిక వికెట్లు (53) తీసిన బౌలర్ బుమ్రా.

అంతర్జాతీయ టీ20ల్లో ఆరో స్థానంలో బ్యాటింగ్‌కు దిగడం కోహ్లీకిది రెండోసారి మాత్రమే. గతంలో ఐర్లాండ్‌పై ఆడాడు.



చివరి టీ20లోనూ భారత్‌దే ఆధిపత్యం

# ఆల్‌రౌండ్ షోతో అదరగొట్టారు

ఊహించిన ఫలితమే.. అందరి అంచనాలకు అనుగుణంగానే శ్రీలంకపై టీమిండియా విరుచుకుపడింది. అయితే పుణె స్టేడియంలో భారత్‌పై మెరుగైన రికార్డున్న లంకేయులు ఈసారి కూడా ఏమైనా సంచలన ప్రదర్శన కనబరుస్తారా.. అనిపించినా అదేమీ జరగలేదు. భారత బౌలర్ల ధాటికి మరింత చెత్తగా ఆడి ఓడింది. వీరి ఇన్నింగ్స్‌లో ఇద్దరు మాత్రమే రెండంకెల స్కోరు చేయగలిగారు. అంతకుముందు లంక బౌలర్లను చెండాడుతూ ఓపెనర్లు శిఖర్ ధవన్, రాహుల్ బ్యాట్లు ఝుళిపించారు. ఈ ఇన్నింగ్స్‌తో చాలాకాలం తర్వాత అర్ధసెంచరీ చేసిన గబ్బర్ ఓపెనింగ్ రేసులో నిలవగా అటు స్టార్ పేసర్ బుమ్రా కూడా పదునైన బంతులతో సత్తా చూపాడు.

- చిత్తుగా ఓడిన శ్రీలంక
- 2-0తో సిరీస్ కైవసం

**పుణె:** శ్రీలంకపై తమ జైత్రయాత్రను భారత్ కొత్త ఏడాదిలోనూ కొనసాగించింది. శుక్రవారం జరిగిన ఆఖరి టీ20లో కోహ్లీ సేన 78 పరుగుల తేడాతో ఘనవిజయం సాధించింది. దీంతో మూడు టీ20ల సిరీస్‌ను 2-0తో గెలుచుకుంది. తొలి టీ20 వర్షంతో రద్దయింది. రాహుల్ (36 బంతుల్లో 5 ఫోర్లు, 1 సిక్స్‌తో 54), ధవన్ (36 బంతుల్లో 7 ఫోర్లు, 1 సిక్స్‌తో 52) అర్ధసెంచరీలతో మెరవగా ముందుగా బ్యాటింగ్‌కు దిగిన భారత్ 20 ఓవర్లలో 6 వికెట్లకు 201 పరుగులు చేసింది. ఆఖర్లో మనీశ్ పాండే (18 బంతుల్లో 4 ఫోర్లతో 31 నాటౌట్), శార్దూల్ ఠాకూర్ (8 బంతుల్లో 1 ఫోర్, 2 సిక్సర్లతో 22 నాటౌట్) తుఫాన్ ఇన్నింగ్స్‌తో జట్టు భారీ స్కోరు సాధించింది. సందకన్‌కు మూడు వికెట్లు దక్కాయి. ఆతర్వాత ఛేదనలో శ్రీలంక 15.5 ఓవర్లలో 123 పరుగులకు కుప్పకూలింది. ధనంజయ డిసిల్వ (36 బంతుల్లో 8 ఫోర్లు, 1 సిక్స్‌తో 57), మాథ్యూస్ (20 బంతుల్లో 1 ఫోర్, 3 సిక్సర్లతో 31) మాత్రమే రాణించారు. సైనీ (3/28), శార్దూల్ (2/19), సుందర్ (2/37) లంకను దెబ్బతీశారు. మ్యాన్ ఆఫ్ ద మ్యాచ్ శార్దూల్ ఠాకూర్‌కు, మ్యాన్ ఆఫ్ ద సిరీస్ నవ్‌దీప్ సైనీకి దక్కింది. భారత తుది జట్టులో శాంసన్, మనీశ్ పాండే, చాహల్‌లకు అవకాశమిచ్చారు.

**పోరాటమే లేకుండా..:** భారీ లక్ష్య ఛేదనలో శ్రీలంక దారుణంగా చతికిలపడింది. తొలి ఓవర్‌లోనే బుమ్రా తీసిన వికెట్‌తో వీరి పతనం ఆరంభమైంది. అటు శార్దూల్ ఠాకూర్, నవ్‌దీప్ సైనీ కూడా దాడి చేయడంతో లంక పవర్‌ప్లేలోనే 35/4 స్కోరుతో దయనీయంగా కనిపించింది. ఇలాంటి స్థితిలో లంకను దనంజయ, మాథ్యూస్ కాపాడే ప్రయత్నం చేశారు. తొమ్మిదో ఓవర్‌లో మాథ్యూస్ రెండు సిక్సర్లు బాదగా ధనంజయ ఫోర్‌తో 19 పరుగులు వచ్చాయి. 12వ ఓవర్‌లో మరో సిక్సర్‌తో ఊపు మీద కనిపించిన మాథ్యూస్‌ను సుందర్ పెవిలియన్‌కు చేర్చాడు. దీంతో ఐదో వికెట్‌కు 68 పరుగుల భాగస్వామ్యం ముగిసింది. ఆతర్వాత ఓ ఎండ్‌లో ధనంజయ పోరాడినా మరో వైపు ఇతర బ్యాట్స్‌మెన్‌ను భారత బౌలర్లు కుదురుకోనీయలేదు.

ట్రోఫీ అందుకుంటున్న కోహ్లీ

31 బంతుల్లో అర్ధసెంచరీ చేశాక ధనంజయ, మలింగలను ఒకే ఓవర్‌లో సైనీ అవుట్ చేయడంతో లంక పరాజయం ఖాయమైంది. అటు శ్రేయాస్ అయ్యర్, చాహల్ నేరుగా రనౌట్ చేసిన తీరు భారత ఫీల్డింగ్ స్థాయిని తెలిపింది.

**మెరుపు ఆరంభం:** టాస్ ఓడి బ్యాటింగ్‌కు దిగిన భారత్ తొలి ఓవర్ నుంచే పరుగుల ప్రవాహం సాగించింది. అటు రాహుల్.. ఇటు ధవన్ ఇద్దరూ లంక బౌలర్లను చెడుగుడు ఆడుతూ అలవోకగా బౌండరీలు సాధించారు. దీంతో తొలి వికెట్‌కు ఈ జోడీ 97 పరుగులు జత చేసింది. వాస్తవానికి ధవన్ ఒక్క పరుగు వద్ద ఉన్నప్పుడు క్యాచ్ అవుట్ నుంచి తప్పించుకున్నాడు. ఆతర్వాత తన ట్రేడ్‌మార్క్ ఆటతీరుతో యథేచ్ఛగా చెలరేగాడు. ప్రతీ బంతిని బాదాలనే ఉద్దేశంతో కనిపించిన ధవన్ ఆరంభంలో కాస్త ఇబ్బంది పడ్డాడు. తొమ్మిది బంతుల్లో 7 పరుగులే చేశాడు. కానీ ఆతర్వాత 5, 6వ ఓవర్లలో వరుస బౌండరీలతో లయ అందుకున్నాడు. దీంతో పవర్‌ప్లేలో జట్టు 63 పరుగులు సాధించింది. పదో ఓవర్‌లో సిక్సర్ బాదిన ధవన్ 36 బంతుల్లో అర్ధసెంచరీ పూర్తిచేశాడు. 2018, నవంబరు తర్వాత అతడికిదే తొలి ఫిఫ్టీ.

**మూడు ఓవర్లు.. నాలుగు వికెట్లు**

11వ ఓవర్ నుంచి భారత్ ఒక్కసారిగా తడబడింది. అప్పటిదాకా దూకుడుగా కనిపించిన ఇన్నింగ్స్‌ను సందకన్ దెబ్బతీశాడు. ముందుగా ధవన్‌ను అతడు పెవిలియన్‌కు చేర్చి లంకకు ఊరటనిచ్చాడు. ఆ మరుసటి బంతినే శాంసన్ సిక్సర్‌గా మలిచి ఆకట్టుకున్నాడు. అయితే 12వ ఓవర్‌లో అతడిని హసరంగ ఎల్బీ చేసి షాకిచ్చాడు. ఇక 34 బంతుల్లో అర్ధసెంచరీ చేసిన రాహుల్‌తో పాటు శ్రేయాస్ అయ్యర్ (4)ను కూడా 13వ ఓవర్‌లో సందకన్ అవుట్ చేయడంతో భారత్ వరుసగా మూడు ఓవర్లలో నాలుగు వికెట్లను కోల్పోయింది. ఆతర్వాత స్కోరు నెమ్మదించింది. యువ ఆటగాళ్లకు బ్యాటింగ్ అవకాశం కల్పిస్తూ ఆరో నెంబర్‌లో దిగిన కోహ్లీ 17వ ఓవర్‌లో 6,4 బాది 16 పరుగులు రాబట్టాడు. కానీ 18వ ఓవర్‌లో లేని పరుగు కోసం పరిగెత్తిన కోహ్లీ (26) రనౌటవగా తర్వాతి బంతికే సుందర్ డకౌటయ్యాడు.

**ఫినిషింగ్ అదుర్స్:** మనీశ్ పాండే, శార్దూల్ ఠాకూర్ చివరి రెండు ఓవర్లలో సూపర్ ఫినిషింగ్ ఇచ్చారు. 20వ ఓవర్‌లో ఠాకూర్ 6,4 సాధించగా పాండే మరో ఫోర్‌తో జట్టు 19 పరుగులు సాధించింది. దీంతో 12 బంతుల్లోనే 34 పరుగులు రాగా స్కోరు కూడా 200 దాటింది.

### శాంసన్ వచ్చేశాడోచ్..

2015 జులైలో జింబాబ్వేపై అంతర్జాతీయ టీ20ల్లో అరంగేట్రం చేసిన వికెట్ కీపర్ సంజూ శాంసన్ ఎట్టకేలకు నాలుగున్నర ఏళ్ల తర్వాత రెండో టీ20 ఆడాడు. ఈ మధ్యకాలంలో భారత జట్టు 73 మ్యాచ్‌లు ఆడింది. దేశవాళీల్లో దుమ్ము రేపిన శాంసన్ సుదీర్ఘ విరామం తర్వాత గతేడాది బంగ్లాదేశ్, విండీస్‌లతో టీ20 సిరీస్‌లకు భారత జట్టుకు ఎంపికయ్యాడు. అయితే వరుసగా ఆరు మ్యాచ్‌ల్లోనూ పెవిలియన్‌కే పరిమితమయ్యాడు. తాజాగా శ్రీలంకతో రెండో టీ20లోనూ ఆడలేదు. అటు రిషభ్ పంత్ విఫలమవుతున్నా అతడికి వరుసగా అవకాశాలు ఇవ్వడం క్రీడాభిమానులకు కూడా అసంతృప్తిని కలిగించింది. చివరికి లంకతో జరిగిన ఆఖరి టీ20లో అతడికి అదృష్టం తలుపు తట్టింది. పంత్ స్థానంలో శాంసన్‌ను ఆడించడంతో అటు సోషల్ మీడియాలోనూ హర్షం వ్యక్తమైంది. అయితే ఎదుర్కొన్న తొలి బంతినే సిక్సర్‌గా మలిచిన అతడు రెండో బంతికే పెవిలియన్ చేరడం మాత్రం నిరాశపరిచింది.

### స్కోరుబోర్డు

**భారత్:** రాహుల్ (స్టంప్డ్) కుశాల్ పెరీర (బి) సందకన్ 54; ధవన్ (సి) గుణతిలక (బి) సందకన్ 52; శాంసన్ (ఎల్బీ) హసరంగ 6; మనీశ్ పాండే (నాటౌట్) 31; శ్రేయాస్ (సి అండ్ బి) సందకన్ 4; కోహ్లీ (రనౌట్) 26; వాషింగ్టన్ సుందర్ (సి) సందకన్ (బి) లాహిరు 0; శార్దూల్ (నాటౌట్) 22; **ఎక్స్‌ట్రాలు: 6; మొత్తం: 20 ఓవర్లలో 201/6. వికెట్ల పతనం:** 1-97, 2-106, 3-118, 4-122, 5-164, 6-164. **బౌలింగ్:** మలింగ 4-0-40-0; మాథ్యూస్ 3-0-38-0; దనంజయ 1-0-13-0; లాహిరు 4-0-46-1;హసరంగ 4-0-27-1; సందకన్ 4-0-35-3.

**శ్రీలంక:** గుణతిలక (సి) వాషింగ్టన్ సుందర్ (బి) బుమ్రా 1; అవిష్క ఫెర్నాండో (సి) శ్రేయాస్ (బి) ఠాకూర్ 9; కుశాల్ పెరీర (బి) సైనీ 7; ఒషాడో ఫెర్నాండో (రనౌట్) 2; మాథ్యూస్ (సి) మనీశ్ పాండే (బి) వాషింగ్టన్ సుందర్ 31; దనంజయ (సి) బుమ్రా (బి) సైనీ 57; షనక (సి అండ్ బి) ఠాకూర్ 9; హసరంగ (రనౌట్) 0; సందకన్ (స్టంప్డ్) శాంసన్ (బి) సుందర్ 1; మలింగ (సి) కోహ్లీ (బి) సైనీ 0; లాహిరు (నాటౌట్) 1; **ఎక్స్‌ట్రాలు: 5; మొత్తం: 15.5 ఓవర్లలో 123 ఆలౌట్. వికెట్ల పతనం:** 1-5, 2-11, 3-15, 4-26, 5-94, 6-110, 7-110, 8-118, 9-122, 10-123.**బౌలింగ్:** బుమ్రా 2-1-5-1; ఠాకూర్ 3-0-19-2; సైనీ 3.5-0-28-3; వాషింగ్టన్ సుందర్ 4-0-37-2; చాహల్ 3-0-33-0.

## ఐక్యతకు అద్దం.. అసోం సంస్కృతికి ప్రతిబింబం

### ఘనంగా ఖేలో ఇండియా ప్రారంభోత్సవం

**గువాహటి:** దేశ ఐక్యతను చాటిచెబుతూ..అసోం సంస్కృతీ సంప్రదాయాలను ప్రతిబింబిస్తూ మూడో ఖేలో ఇండియా క్రీడల ఆరంభోత్సవం శుక్రవారం అంగరంగ వైభవంగా జరిగింది. కేంద్ర క్రీడల మంత్రి కిరణ్ రిజిజు, అసోం ముఖ్యమంత్రి శర్బానంద సోనోవాల్ క్రీడలను ప్రారంభించారు. ఇందిరాగాంధీ స్టేడియంలో హాజరైన 25 వేలమందితోపాటు దేశవ్యాప్తంగా లక్షలాదిమంది టెలివిజన్ వీక్షకులను ఆరంభ కార్యక్రమాలు కట్టి పడేశాయి. ఏడు ఈశాన్య రాష్ట్రాలకు చెందిన టాప్ అథ్లెట్లు క్రీడాజ్యోతిని స్టేడియంలోకి తీసుకురాగా..అసోంకు చెందిన స్టార్ స్ప్రింటర్ హిమాదాస్ క్రీడాజ్యోతిని వెలిగించింది.

**6,800 మంది క్రీడాకారులు:** 37 రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాలనుంచి 6800మంది క్రీడాకారులు బరిలోకిదిగుతున్నారు. ఇంత భారీ క్రీడా పోటీలకు ఆతిథ్యమిస్తున్నందుకు అసోంను కేంద్ర క్రీడల మంత్రి కిరణ్ రిజిజు అభినందించారు. 400 మంది కళాకారులు, 400మంది సాంకేతిక సిబ్బంది తమ అద్భుత ప్రదర్శనలతో ప్రేక్షకులను మంత్రముగ్దులను చేశారు. పోటీలు జరిగే 20 క్రీడాంశాలను డ్యాన్సర్లు తమ ప్రదర్శనల ద్వారా తెలియజేయడం ప్రారంభోత్సవానికి హైలైట్‌గా నిలిచింది. బాలీవుడ్ ప్రముఖ గాయకుడు శంకర్ మహదేవన్ తన పాటలతో ఉర్రూతలూగించారు.

## హైదరాబాద్‌కు తరలిన పీబీఎల్ సెమీస్, ఫైనల్

బెంగళూరులో స్టేడియం దొరకని ఫలితం

**బెంగళూరు:** రానున్న ప్రీమియర్ బ్యాడ్మింటన్ లీగ్ (పీబీఎల్) చివరి లెగ్ మ్యాచ్‌లతో పాటు సెమీఫైనల్స్, ఫైనల్‌ను బెంగళూరు నుంచి హైదరాబాద్‌కు తరలించారు. మ్యాచ్‌లకు ఆతిథ్యమివ్వాల్సిన నగరంలోని శ్రీ కంఠీరవ ఇండోర్ స్టేడియం ఆ సమయానికి అందుబాటులో లేనందున బెంగళూరులోని మ్యాచ్‌లన్నీ హైదరాబాద్‌కు తరలించినట్టు నిర్వాహకులు ప్రకటించారు. ఈనెల 20న మొదలయ్యే పీబీఎల్‌లో మొత్తం 24 మ్యాచ్‌లను చెన్నై (జనవరి 20-24), లఖ్‌నవ్ (జనవరి 25-28), హైదరాబాద్ (జనవరి 29-ఫిబ్రవరి 4), బెంగళూరు (సెమీస్, ఫైనల్ మ్యాచ్‌లతో కలిపి ఫిబ్రవరి 5-9)లో జరిగేలా షెడ్యూల్‌ను రూపొందించారు. కానీ, చివరి లెగ్ సమయానికి స్థానిక కంఠీరవ స్టేడియం అందుబాటులో లేనందున తాము మ్యాచ్‌లకు ఆతిథ్యమివ్వలేమని బెంగళూరు రాప్టర్స్ జట్టు యాజమాన్యం శుక్రవారం ప్రకటించింది. దీంతో బెంగళూరు మ్యాచ్‌లను హైదరాబాద్‌కు తరలించారు. అంటే.. జనవరి 29 నుంచి ఫిబ్రవరి 9 వరకు హైదరాబాద్‌లో మ్యాచ్‌లు జరగనున్నాయి. సెమీఫైనల్స్ 7, 8న.. ఫైనల్ 9న జరగనుంది.

## గెలుపే లక్ష్యంగా హైదరాబాద్..

ఆంధ్రతో రంజీ నేటి నుంచి

**హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి క్రీడాప్రతినిధి):** బ్యాట్స్‌మెన్ నిలకడలేమితో ఈ రంజీ సీజన్‌లో తొలి మూడు మ్యాచ్‌ల్లోనూ పరాజయం పాలైన హైదరాబాద్ గత మ్యాచ్‌లో కేరళపై నెగ్గి ఆత్మవిశ్వాసం కూడగట్టుకుంది. ఇదే జోష్‌లో శనివారం నుంచి ఒంగోలులో ఆంధ్రతో జరగనున్న తమ ఐదో మ్యాచ్‌లో హైదరాబాద్ బరిలోకి దిగుతోంది. ఈ మ్యాచ్‌లో ఓడితే నాకౌట్ ఆశలు గల్లంతవనుండడంతో ఎలాగైనా గెలవాలనే పట్టుదలతో హైదరాబాద్ ఉంది. కెప్టెన్ తన్మయ్ అగర్వాల్, సుమంత్ మినహా మిగిలిన బ్యాట్స్‌మెన్ ఇప్పటివరకు స్థాయికి తగ్గ ప్రదర్శన చేయలేదు. అక్షత్ రెడ్డి, హిమాలయ్ అగర్వాల్ 30-40 పరుగులను భారీ స్కోర్లగా మలచడంలో విఫలమవుతున్నారు. బౌలింగ్‌లో సిరాజ్, రవితేజ, మెహ్దీ హసన్ రాణిస్తుండడం హైదరాబాద్‌కు సానుకూలాంశం. మరోవైపు ఆంధ్ర ఇప్పటివరకు ఆడిన నాలుగు మ్యాచ్‌ల్లో రెండు విజయాలు, రెండు డ్రాలతో గ్రూప్ ఏ అండ్ బీలో మూడో స్థానంలో ఉంది. ఫామ్‌లో ఉన్న ఓపెనర్ జ్ఞానేశ్వర్, రికీ భుయ్, కెప్టెన్ విహారిని కట్టడి చేయడంపైనే హైదరాబాద్ గెలుపు అవకాశాలు ఆధారపడి ఉన్నాయి.

### ఐఎస్ఎల్‌లో హైదరాబాద్ హ్యాట్రిక్ ఓటమి

**హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి క్రీడాప్రతినిధి):** ఇండియన్ సూపర్ లీగ్ (ఐఎస్ఎల్) ఫుట్‌బాల్ టోర్నమెంట్‌లో హైదరాబాద్ పేలవ ప్రదర్శన కొనసాగుతోంది. శనివారం గచ్చిబౌలి స్టేడియంలో చెన్నయిన్‌తో జరిగిన మ్యాచ్‌లో హైదరాబాద్ 1-3 గోల్స్ తేడాతో ఓడి హ్యాట్రిక్ ఓటములను మూటగట్టుకుంది. హైదరాబాద్ తరఫున ఏకైక గోల్‌ను మార్సిలిన్హో (88వ) చేశాడు. చెన్నయిన్‌లో నిరిజుస్ (43వ, 65వ) రెండు, రాఫెల్ (40వ) ఓ గోల్ సాధించారు.

### జాతీయ క్రికెట్ పోటీలకు వెళ్లిన వ్యాయామోపాధ్యాయుడి మృతి

**ఖమ్మం స్పోర్ట్స్:** ఢిల్లీలో జరుగుతున్న జాతీయ స్థాయి క్రికెట్ పోటీల్లో పాల్గొనేందుకు వెళ్లిన వ్యాయామోపాధ్యాయుడు రోడ్డు ప్రమాదంలో మృతి చెందారు. ఖమ్మం నగరంలోని కేంద్రీయ విద్యాలయ్ సంఘటన్‌లో పనిచేస్తున్న ఎస్. కిరణ్‌ప్రసాద్ (38), మరో నలుగురు ఉపాధ్యాయులు ప్రయాణిస్తున్న ఇన్నోవా కారు ఆగివున్న లారీని ఢీకొట్టింది. ఈ ఘటన గురువారం రాత్రి జరిగింది. కేంద్రీయ విద్యాలయాల జాతీయ క్రికెట్ పోటీ ల్లో పాల్గొనేందుకు వీరంతా ఢిల్లీలో ఉన్నారు. కిర ణ్ ప్రసాద్.. క్రికెట్, అథ్లెటిక్స్‌లో జాతీయ స్థాయి క్రీడాకారుడు. ఆయన స్వస్థలం ఇల్లెందు పట్టణం 24 ఇంక్లైన్. ఆయనకు భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. కాగా కారు వెనుక సీట్లో కూర్చున్న ఉపాధ్యాయులు సీహెచ్ నరేం ద్ర కుమార్ (బేగంపేట-కేవీ), డీవీడీ పవన్ కుమార్ (పికెట్-కేవీ), ఆనంద్ గణేష్ (గోల్కొండ 2-కేవీ), వేణుగోపాల్ (ఘట్‌కేసర్-కేవీ)లకు గాయాలయ్యాయి. ప్రస్తుతం వారు చికిత్స పొందుతున్నారు.

### పాక్ ఎంతో సురక్షితం!: గేల్

**ఢాకా:** పాకిస్థాన్‌లో పర్యటించేందుకు క్రికెట్ జట్లు ఆసక్తి చూపని పరిస్థితిలో వెస్టిండీస్ విధ్వంసకర బ్యాట్స్‌మన్ క్రిస్ గేల్ వారికి మద్దతుగా నిలిచాడు. పాకిస్థాన్‌ను సురక్షిత దేశంగా అతడు పేర్కొన్నాడు.

## శిరోజాలు అమ్మి.. బిడ్డల ఆకలి తీర్చి..

చెన్నై, జనవరి 10 (ఆంధ్రజ్యోతి): చేసిన అప్పులు తీర్చలేక భర్త ఆత్మహత్య చేసుకుంటే.. ముగ్గురు పిల్లల పట్టెడన్నం కూడా పెట్టే పరిస్థితి లేక.. తన శిరోజాలు అమ్మి వారి ఆకలి తీర్చిందో పేద తల్లి. ఈ విషాద ఘటన తమిళనాడులోని సేలంలో చోటుచేసుకుంది. సేలం పొన్నమ్మపేటకు చెందిన సెల్వం, ప్రేమ దంపతులకు ముగ్గురు కుమారులు. తాను పనిచేసే ఇటుకబట్టీ యజమాని, మరికొందరి వద్ద సెల్వం రూ.5 లక్షల వరకు అప్పు చేశారు. అప్పుల వారు ఒత్తిడి చేయడంతో 7 నెలల క్రితం సెల్వం ఆత్మహత్య చేసుకున్నాడు. ఆ తర్వాత బిడ్డల పోషణ కోసం ప్రేమ ఇటుకబట్టీలో పనికి వెళ్లింది. అప్పులిచ్చిన వారంతా డబ్బుల కోసం ప్రేమను వేధించడం మొదలుపెట్టారు. దీంతో కొన్ని రోజుల క్రితం ఆత్మహత్యకు యత్నించింది. దాంతో ఆమెను పనిలో నుంచి కూడా తీసేశారు. పిల్లల ఆకలి తీర్చేందుకు డబ్బుల్లేక ఆమె మానసిక వేదనకు గురైంది. దీంతో ఒక రోజు ఆమె శిరోజాలను అమ్మేసింది. వచ్చిన రూ.150తో పిల్లలకు అన్నం వండి పెట్టింది. ఈ విషయం తెలుసుకున్న కొందరు సామాజిక వేత్తలు ఫేస్‌బుక్ ద్వారా నిధులు సేకరించి ప్రేమ కుటుంబానికి రూ.1లక్ష ఆర్థిక సాయం అందజేశారు.

## మూత్రం దీపమై వెలుగుతుంది!!

- ఎంఎఫ్‌సీ టెక్నాలజీని అభివృద్ధిచేసిన బ్రిటన్ శాస్త్రవేత్తలు
- పరిజ్ఞానం బదిలీపై జలగం సుధీర్ చర్చలు

లండన్, జనవరి 10 : అగ్గిపుల్ల, కుక్క పిల్ల, సబ్బు బిల్ల కాదేదీ కవితకు అనర్హం అంటారు!! సౌరశక్తి, పవన శక్తిలతో పాటు మూత్ర'శక్తి' ఉత్పత్తి కూడా సాధ్యమేనని బ్రిటన్‌లోని వెస్ట్ ఇంగ్లండ్ వర్సిటీ శాస్త్రవేత్తలు అంటున్నారు. ఇందుకు దోహదపడే 'మైక్రో బయల్ ఫ్యూల్ సెల్'(ఎంఎఫ్‌సీ) టెక్నాలజీని వారు అభివృద్ధి చేశారు. మూత్రంలోని రసాయన, కర్బన పదార్థాల్లోని సూక్ష్మజీవ ఇంధన కణాలను సంశ్లేషించి విద్యుత్ శక్తిగా మార్చడమే దీని ప్రత్యేకత. ఇలా ఉత్పత్తయ్యే విద్యుత్తును లైట్లు వెలిగించడానికి, ఎలక్ట్రానిక్ ఉపకరణాల చార్జింగ్ కోసం వినియోగించవచ్చు. కాగా, ఈ పరిజ్ఞానాన్ని భారత్‌కు బదిలీచేసే అంశంతో పాటు.. దానితో విద్యుదుత్పత్తి, వినియోగానికి ఉన్న సాధ్యాసాధ్యాలపై తెలంగాణకు చెందిన జలగం సుధీర్.. శాస్త్రవేత్తలతో చర్చిస్తున్నారు. అది అందుబాటులోకి వస్తే మూత్రశాలల ట్యాంకుల్లో నిల్వ అయ్యే మూత్రం విద్యుత్‌గా మారి వెలుగులు విరజిమ్మనుంది! బిల్లుల భారాన్ని తగ్గించనుంది!!

## మార్స్ ఎండిపోతోంది!!

**అడుగంటుతున్న నీటిజాడలు**

లండన్, జనవరి 10 : మార్స్‌పై ఉన్న అరకొర నీటిజాడలూ శరవేగంగా అంతర్ధానం అవుతున్నాయట!! అరుణ గ్రహం వాతావరణంపై అధ్యయనానికి రష్యా స్పేస్ ఏజెన్సీ 'రోస్కోమోస్', ఐరోపా స్పేస్ ఏజెన్సీ(ఈఎస్ఏ)ల సంయుక్త భాగస్వామ్యంలో ప్రయోగించిన 'ఎక్సో మార్స్ మిషన్'లోని ట్రేస్ గ్యాస్ ఆర్బిటర్ ప్రోబ్ ఈమేరకు సమాచారం పంపింది. దాన్ని విశ్లేషించిన ఫ్రెంచ్ నేషనల్ సెంటర్ ఫర్ సైంటిఫిక్ రిసెర్చ్(సీఎన్‌ఆర్ఎస్) శాస్త్రవేత్తలు ఆ వివరాలను వెల్లడించారు. అంగారకుడి ఎగువ ఆవరణంలో నీటి ఆవిరి రూపంలో ఉండే నీటి నిల్వల జాడ గల్లంతవుతోందని పేర్కొన్నారు. సూర్యరశ్మి, వివిధ రసాయనిక చర్యల కారణంగా నీటి ఆవిరి అణువులు.. హైడ్రోజన్, ఆక్సిజన్ పరమాణువులుగా మారి మార్స్‌ను దాటి అంతరిక్షంలో కలిసిపోతున్నాయని తెలిపారు. భూమి కన్నా అంగారకుడిపై గురుత్వాకర్షణ శక్తి చాలా తక్కువగా ఉండటంతో.. ఎగువ ఆవరణం పరిధి నుంచి హైడ్రోజన్, ఆక్సిజన్‌లు అతిసులువుగా అంతరిక్షంలోకి వెళ్లగలుగుతున్నాయని చెప్పారు.

# ఇంటర్నెట్ ప్రజల ప్రాథమిక హక్కు

(మొదటి పేజీ తరువాయి)

ఓ సమాచార వాహిక మాత్రమే కాదు... దాని ద్వారా వ్యాపార వాణిజ్య లావాదేవీలు జరుగుతూటాయి. ఇదీ ముఖ్యమే. ఆర్టికల్ 19 (1) (జీ) కింద ఇంటర్నెట్ వ్యాపారానికి (ఆన్‌లైన్ ట్రేడింగ్‌కు) కూడా రాజ్యాంగపరమైన రక్షణ ఉంది. వీటన్నింటినీ దృష్టిలో ఉంచుకుని లోకల్ ఏరియాల్లో, విద్యాసంస్థలు, ఆసుపత్రులు, బ్యాంకింగ్, ఆన్‌లైన్ ట్రేడింగ్ మొదలైన అత్యవసర విభాగాల్లో ఇంటర్నెట్‌ను వెంటనే పునరుద్ధరించండి. మిగిలిన అన్ని నిషేధాజ్ఞలను ఎత్తేసే విషయమై వారంలోగా సమీక్ష చేయండి" అని జస్టిస్ ఎన్‌వీ రమణ, జస్టిస్ బీ ఆర్ గవాయ్, జస్టిస్ ఆర్ సుభాష్ రెడ్డిలతో కూడిన ధర్మాసనం ఆదేశించింది. అయితే మిగిలిన ప్రాంతాల్లో, ఇతర రంగాల్లో ఇంటర్నెట్ సౌకర్యాన్ని ఎప్పటిలోగా పునరుద్ధారించాలన్న దానిపై బెంచ్ ఎలాంటి కాల పరిమితినీ విధించలేదు. ఎటువంటి కాలపరిమితి లేకుండా నిరవధికంగా ఇంటర్నెట్ ను సస్పెండ్ చేయడమనేది టెలికాం నిబంధనలకు వ్యతిరేకం అని మాత్రం పేర్కొంది.

"ఇంటర్నెట్ ద్వారా జనాభాలో అతి ఎక్కువ మందికి సమాచారాన్ని చేరవేసే వీలుంది. దీన్ని కాదనం. ఈ అవకాశం ఉన్నందున వివిధ కారణాలు చెప్పి ఆ అవకాశాన్ని హరించడం సబబు కాదు' అని తేల్చిచెప్పింది. సరైన కారణాలు చూపకుండా ప్రాథమిక హక్కును కాదనడం అసమానత్వమని తేల్చిచెప్పింది. పత్రికా స్వేచ్ఛను కూడా ప్రభుత్వాలు కాపాడాలని, జర్నలిస్టులు తమ విధులు నిర్వర్తించుకునే అవకాశాలివ్వాలని స్పష్టం చేసింది.

### సుప్రీం బెంచ్ జారీ చేసిన ఆదేశాలివీ..

1. భవిష్యత్తులో 144వ సెక్షన్ క్రింద ఆదేశాలను, టెలికాం సేవల రద్దుకు జారీ చేసే ఆదేశాలను ప్రజలకు తెలియజేయాలి.
2. భావ ప్రకటన, వ్యక్తీకరణా స్వేచ్ఛ, ఇంటర్నెట్ మాధ్యమాన్ని ఉపయోగించే ఏ వృత్తి, వ్యాపారం, ఉద్యోగాన్ని నిర్వహించే స్వేచ్ఛలకైనా రాజ్యాంగ రక్షణ లభిస్తుంది.... పరిమితులకు లోబడి ఈ రక్షణ ఉంటుంది.
3. ఇంటర్నెట్ సేవలను నిరవధికంగా రద్దు చేయడం సమ్మతించం. ఇది తాత్కాలికం కావాలి, నిర్దిష్ట కాలపరిమితికి మించి ఉండరాదు.
4. ఇంటర్నెట్ సేవలను రద్దు చేసే ముందు ప్రభుత్వం ఆ చర్యకు దారితీసిన పరిస్థితులను సమీక్షించాలి.
5. సేవల రద్దు ఆదేశాలను వెంటనే సమీక్షించాలి. అన్ని నిషేధాజ్ఞలను కొనసాగించడంపై ఓ కమిటీని ఏర్పర్చి వారం రోజులకు ఒక సారి సమీక్షించాలి.
6. మేం పేర్కొన్న న్యాయసూత్రాలకు అనుగుణంగా లేని ఉత్తర్వులన్నిటినీ రద్దు చేయాలి. భవిష్యత్తులో కొత్త ఆదేశాలు జారీ చేయాల్సి వస్తే కోర్టు పేర్కొన్న న్యాయసూత్రాలకు అనుగుణంగా వ్యవహరించాలి
8. ప్రభుత్వ వెబ్ సైట్లు, స్థానిక, పరిమిత ఈ-బ్యాంకింగ్ సౌకర్యాలు, ఆసుపత్రులు ఇతర నిత్యావసర సేవలను వెంటనే పునరుద్ధరించాలి.
9. సెక్షన్ 144 తో ప్రజాస్వామ్య హక్కులను అణచేయరాదు.
10. సెక్షన్ 144 క్రింద ఉత్తర్వులు న్యాయసమీక్షకు అనుగుణంగా ఉండాలి. సరైన, హేతుబద్ధమైన పద్ధతిలో ఆ అధికారాన్ని ఉపయోగించాలి. 11 ఈ సెక్షన్ విధింపు నిర్ణయం వాస్తవాలపై ఆధారపడి ఉండాలి. ఈ అధికారాన్ని ఉపయోగించేవారు తమ సొంత విజ్ఞతను ప్రదర్శించాలి. ప్రజల హక్కులకు, ఆంక్షలకూ మధ్య అనుపాత సూత్రాలకు అనుగుణంగా మెజిస్ట్రేట్లు వ్యవహరించాలి. దేన్నైనా అడ్డుకునే వ్యవహార శైలిని సాధ్యమైనంత వరకూ ప్రదర్శించరాదు.
12. సెక్షన్ 144 క్రింద తరుచూ ఆదేశాలు జారీ చేయడం అధికార దుర్వినియోగమే అవుతుంది.
13. సెక్షన్ 144 క్రింద జారీ చేసిన ఆదేశాలన్నీ పైన చెప్పిన న్యాయసూత్రాలకు అనుగుణంగా ఉన్నాయా లేదా వెంటనే సమీక్షించాలి.

జమ్ముకశ్మీర్ లో ఇంటర్నెట్ సేవల నిలిపివేతపై కశ్మీరీ టైమ్స్ ఎడిటర్ అనురాధా భాసిన్, కాంగ్రెస్ నేత గులాంనబీ ఆజాద్ తదితరులు దాఖలు చేసిన పిటిషన్లను సుప్రీంకోర్టు విచారణకు స్వీకరించి నవంబర్ 27న తన తీర్పును వాయిదా వేసింది. ప్రభుత్వం విధించిన ఆంక్షలు దాదాపు 70 లక్షల మంది ప్రజల జీవితాలను అతలాకుతలం చేసిందని, ప్రజల జీవనం స్తంభించిపోయినందువల్ల విద్య, వైద్య సంరక్షణ, వ్యాపారం, వ్యవసాయం కూడా దెబ్బతిన్నాయని పిటిషనర్ల తరపున న్యాయవాదులు కపిల్ సిబాల్, వృందా గోవర్ వాదించారు. అయితే జాతీయ భద్రతా ప్రయోజనాల రీత్యా ఇంటర్నెట్ సేవల రద్దు అవసరమైందని కేంద్ర ప్రభుత్వం, జమ్ముకశ్మీర్ ప్రభుత్వం తరపున అటార్నీ జనరల్, సొలిసిటర్ జనరల్ వాదించారు. తీర్పును ఆజాద్, కపిల్ సిబాల్ స్వాగతించారు. ఒత్తిడికి లోబడి తీర్పును ఇవ్వలేదన్న విషయం స్పష్టమవుతోందని ఆజాద్ వ్యాఖ్యానించారు.

> భావ ప్రకటనా స్వేచ్ఛా ? లేక భద్రతా? దేనికి ప్రాధాన్యం ఇవ్వాలి..? ఇదీ మా ముందున్న ప్రశ్న. ఏ వైపు మొగ్గినా రెండో దానిపై అది రాజీపడేట్లు చేస్తుంది. భద్రత కంటే వాక్-స్వేచ్ఛ ముఖ్యమనో లేక వాక్-స్వేచ్ఛ కంటే భద్రతాపరమైన విషయాలే ముఖ్యమనో చెప్పే ప్రావీణ్యం మాకు లేదు. ఓ వైపు భద్రతను కొనసాగిస్తూనే ప్రజల హక్కులు, స్వేచ్ఛ కాపాడడం మా విధి.
> - జస్టిస్ ఎన్‌వీ రమణ, సుప్రీంకోర్టు సీనియర్ న్యాయమూర్తి

### పత్రికా స్వేచ్ఛను ప్రభుత్వాలు గౌరవించాలి: సుప్రీం

న్యూఢిల్లీ, జనవరి 10: ప్రజాస్వామ్య వ్యవస్థలో పత్రికలు స్వేచ్ఛగా పనిచేసే పరిస్థితులు ఉండాలని, ఇది రాజ్యాంగం కల్పించిన పవిత్రమైన హక్కని, దీన్ని ప్రభుత్వాలు గౌరవించాల్సిన అవసరం ఎంతైనా ఉందని సుప్రీం కోర్టు వ్యాఖ్యానించింది. ఆధునిక ప్రజాస్వామ్య వ్యవస్థలో పత్రికల ప్రాచుర్యం పెరిగిందని, వీటిని అడ్డుకుంటే సమాచార వ్యాప్తి జరగదని పేర్కొంది. కశ్మీరులో పత్రికా స్వేచ్ఛకు తీవ్రంగా విఘాతం కలుగుతోందని కశ్మీర్ టైమ్స్ పత్రిక వేసిన పిటిషన్‌ను విచారించిన జస్టిస్ ఎన్వీ రమణ నేతృత్వంలోని సుప్రీం ధర్మాసనం ఈ వ్యాఖ్యలు చేసింది.

### ఛార్లెస్ డికెన్స్ పలుకులతో తీర్పు

సుప్రసిద్ధ ఆంగ్ల రచయిత ఛార్లెస్ డికెన్స్ రాసిన 'ఏ టేల్ ఆఫ్ టూ సిటీస్ ' (రెండు మహానగరాల కథ)లోని వాక్యాలను ఉదహరిస్తూ జస్టిస్ ఎన్‌వీ రమణ తన తీర్పు రాశారు. "అది ఒక వైభవోజ్వల మహాయుగం- వల్లకాటి అధ్వాన్న శకం , వెల్లివిరిసిన విజ్ఞానం- బ్రహ్మజెముడులా అజ్ఞానం, భక్తి విశ్వాసాల పరమ పరివిధం- పరమ పాషండాల ప్రల్లదకల్లోలం, ఉజ్వల వైతన్యాల ఉత్పుల్ల మహోదయం-అంధాంధతమసాల అవ్యక్త నిశీధం, ఆశా కుసుమాలు పుష్పించిన ఆ మధుర వసంతం- నైరాశ్యపు చలిగుబుళ్ల ఈచుకున్న శశిరాస్యం, సర్వసంపత్సమృద్ధి, సర్వతోముఖ క్షామం, స్వర్గానికి రాచబాట పుచ్చుకున్న జనం- నడుస్తున్నారు నూటిగా నరకానికి, అరుస్తున్నాయ్ అధికార కంఠాలు. అంతా అమోఘంగా ఉందనీ, సూక్ష్మంగా చెప్పాలంటే నేటి పరిస్థితికి నకలుగా ఉంది నాటి పరిస్థితి.... అంటూ డికెన్స్ ఫ్రెంచి విప్లవం నాటి భయానక పరిస్థితులను నేపథ్యంగా తీసుకుని 1859లో వెలువరించిన అద్భుత నవల అది. పరోక్షంగా ఆయన నాటి పరిస్థితులను చూచాయగా అన్వయించారు. "కశ్మీర్ అంటే మన హృదయాల్లో ఉన్న స్థానం భూతల స్వర్గమని! కానీ ఆ సుందర కశ్మీరం ఇపుడు హింసతో, ఉగ్రవాదంతో అట్టుడుకుతోంది. ఓ వైపు హిమాలయాలు ప్రశాంతను పరుస్తూంటే మరో వెంప ప్రతీరోజూ రక్తం చిందుతోంది. అనేక సంకిష్టతలున్న నేల అది. ఆ సంక్లిష్టతలకు ఈ పిటిషన్లు తోడయ్యాయి. రెండూ పరస్పర విరుద్ధమైన చిత్రాలను ఆవిష్కరించాయి. దీంతో ఈ కేసు మాకో పెద్ద సవాల్‌గా నిలిచింది. తీసుకున్న రాజకీయ నిర్ణయం జోలికి మేం వెళ్లం. కానీ ఉన్నంతలో స్వేచ్ఛ-భద్రతల మధ్య సమతూకం ఎలా సాధించాలి, భద్రంగా జీవించే హక్కును, ఇతర హక్కులను ఎలా పరిరక్షించాలన్న పరిమిత అంశానికే పరిమితమవుతాం" అని జస్టిస్ రమణ తీర్పు ప్రారంభ వాక్యాల్లోనే పేర్కొన్నారు.

## కన్న పిల్లలు కాలిపోయినా.. కిమ్ ఫొటోకు ఏం కావద్దు

**పిల్లలను కాపాడుకున్నందుకు తల్లికి జైలు**

సియోల్, జనవరి 10: తగలబడుతున్న ఇంట్లో ఇద్దరు పిల్లలు చిక్కుకుపోయారు. ఆ సమయంలో ఎవరైనా తమ పిల్లలను రక్షించుకోవాలని చూస్తారు. ఆ తల్లీ అదే చేసింది. ప్రాణాలకు సైతం తెగించి పిల్లలను బయటికి తీసుకొచ్చింది. కానీ ఆమెకు జైలు శిక్ష పడే అవకాశం ఉంది. దీని కోసం ఉత్తర కొరియా అధికారులు ఇప్పటికే దర్యాప్తును కూడా ప్రారంభించారు. జైలు శిక్ష ఎందుకంటే... ఆమె పిల్లలను కాపాడింది కానీ ఇంట్లో ఉన్న దేశ అధ్యక్షుడు కిమ్ జాంగ్ ఉన్, ఆయన కుటుంబసభ్యుల ఫొటోలను బయటకు తీసుకురాలేకపోయింది. అవి మంటల్లోనే కాలిపోయాయి. ఉత్తర కొరియాలో ప్రతీ ఒక్కరి ఇంటిలో కిమ్, ఆయన పూర్వీకుల ఫొటోలు ఉండాలి. వాటిని ప్రాణం కన్నా ఎక్కువగా చూసుకోవాలి. నదరు మహిళ ఆ ఫొటోలను మంటల్లోనే వదిలేయడంతో ఆమె జైలు శిక్ష ముప్పును ఎదుర్కొంటోంది.

## ప్రతి 40 నిమిషాలకు ఒక నిరుద్యోగి ఆత్మహత్య

**2018లో 12,936 మంది బలవన్మరణం**

న్యూఢిల్లీ, జనవరి 10: నిరుద్యోగ రక్కసి ప్రాణాలు తీస్తోంది. 2018లో దేశంలో 12,936 మంది నిరుద్యోగులు ఆత్మహత్య చేసుకున్నారు. ప్రతి 40 నిమిషాలకు ఒకరు బలవన్మరణానికి పాల్పడ్డారు. జాతీయ నేరాల నమోదు సంస్థ (ఎన్‌సీఆర్‌బీ) నివేదిక ఈ వివరాలు వెల్లడించింది. అదే ఏడాది 10,349 మంది రైతులు ఆత్మహత్య చేసుకున్నారు. మొత్తం 1,34,516 మంది బలవన్మరణానికి పాల్పడ్డారు. వీరిలో నిరుద్యోగులు 9.6 శాతం, రైతులు 7.7 శాతం ఉన్నారు. 2018లో ఆత్మహత్యకు పాల్పడిన వారిలో 66 శాతం ఎంతో కొంత చదువుకున్న నిరుపేదలేనని నివేదిక పేర్కొంది. స్వయం ఉపాధి మార్గాన్ని ఎంచుకున్న 13,149 మంది ఆత్మహత్య చేసుకున్నారు. వీరి శాతం 9.8గా నమోదయింది. 10 వేల మందికి పైగా విద్యార్థులు (7.6 శాతం) బలవన్మరణానికి పాల్పడ్డారు.

## అత్యాచార బాధితుల్లో నాలుగోవంతు మైనర్లే

న్యూఢిల్లీ, జనవరి 10: దేశంలో 2018లో అత్యాచారానికి గురైన ప్రతి నలుగురిలో ఒకరు మైనరేనని జాతీయ నేరాల నమోదు సంస్థ (ఎన్‌సీఆర్‌బీ) నివేదిక వెల్లడించింది. 50 శాతానికి పైగా బాధితులు 18 నుంచి 30 ఏళ్లలోపు వారని తెలిపింది. 94 శాతం కేసుల్లో నేరస్థులు బాధితులకు తెలిసిన వారే అయి ఉంటున్నారని పేర్కొంది. వారిలో కుటుంబ సభ్యులు, స్నేహితులు, యజమానులు తదితరులు ఉన్నారని వివరించింది. ఆ నివేదిక ప్రకారం... 2018లో దేశంలో 33,356 అత్యాచార ఘటనలు చోటుచేసుకున్నాయి. రోజుకు సగటున 89 రేప్‌లు జరిగాయి. బాధితుల్లో 27.8 శాతం 18 ఏళ్లలోపు వారు. 2.2 శాతం (757) 6 నుంచి 12 ఏళ్లలోపు వారు. 0.8 శాతం (281) మంది 6 ఏళ్లలోపు వారు. 2017లో 32,559, 2016లో 38,947 అత్యాచారం కేసులు నమోదయ్యాయి.



జమ్ములో అమెరికా రాయబారి కెన్నెత్ జస్టర్

## ప్రజలు, పౌర సంఘాలతో రాయబారుల భేటీ

**కశ్మీరులో భద్రతా పరిస్థితులను వివరించిన డీజీపీ**

**సరిహద్దులో పాక్ దాడి.. ఇద్దరు ఆర్మీ పోర్టర్ల మృతి**

జమ్ము, జనవరి 10: జమ్ముకశ్మీరు పర్యటనలో ఉన్న విదేశీ రాయబారులు శుక్రవారం ప్రజలు, వివిధ పౌర సంఘాల నేతలతో సమావేశమయ్యారు. ప్రధాన కార్యదర్శి బీవీఆర్ సుబ్రమణ్యం, డీజీపీ దిల్బాగ్ సింగ్‌ల నేతృత్వంలోని ఉన్నత స్థాయి బృందం 15 దేశాల రాయబారులకు వాస్తవ పరిస్థితులను వివరించింది. భద్రతా పరిస్థితులను కూడా తెలియజేసింది. గురువారం శ్రీనగర్ చేరుకున్న రాయబారులు.. రెండో రోజైన శుక్రవారం పశ్చిమపాకిస్థాన్ శరణార్థులు, వాల్మీకి సమాజ్, గుజ్జర్ల ప్రతినిధులు, న్యాయవాదులతో భేటీ అయ్యారు. అలాగే వివిధ ప్రభుత్వ విభాగాల అధికారులు ఆయా శాఖల్లో ప్రస్తుత పరిస్థితులను వివరించారు. గత అక్టోబరులో తొలిసారి యూరోపియన్ యూనియన్ ప్రతినిధులు కశ్మీరు పర్యటనకు వచ్చినప్పటికీ ఇప్పటికీ పరిస్థితుల్లో భారీ మార్పు కనిపించింది. ప్రస్తుతం ఎలాంటి హర్తాళ్లు, దుకాణాల మూసివేత లేదు. జనజీవనం సాధారణంగానే ఉంది. కాగా.. జమ్మూకశ్మీరులో విదేశీ రాయబారులను అనుమతిస్తున్న కర్కారు దేశంలోని రాజకీయ నేతల పర్యటనకు ఎందుకు అనుమతి ఇవ్వడం లేదని కాంగ్రెస్ సీనియర్ నేత కపిల్ సిబాల్ ప్రశ్నించారు. విదేశీ రాయబారులు కశ్మీరు పర్యటనలో ఉన్న సమయంలోనే పాక్ సైన్యం సరిహద్దుల్లో కవ్వింపు చర్యలకు పాల్పడింది. పూంఛ్ జిల్లాలోని సరిహద్దు వెంబడి పాక్ సైన్యం మోర్టార్ బాంబులతో దాడి చేసింది. భారత సైనిక శిబిరాలే లక్ష్యంగా విచక్షణారహితంగా చేసిన ఈ దాడుల్లో ఇద్దరు ఆర్మీ పోర్టర్లు దుర్మరణం చెందినట్లు అధికారులు తెలిపారు. మరో ముగ్గురు గాయపడినట్లు వెల్లడించారు.

## జేఎన్‌యూలో హింస.. వామపక్ష విద్యార్థి సంఘాల పనే!

- పోలీసు దర్యాప్తులో ఈ విషయం తేలింది
- మీడియాతో కేంద్ర మంత్రి ప్రకాశ్ జవడేకర్
- 9 మంది ఫొటోలు విడుదల చేసిన పోలీసులు

న్యూఢిల్లీ, జనవరి 10: జేఎన్‌యూలో గత ఆదివారం చోటుచేసుకున్న హింస.. రాజకీయ మలుపు తీసుకుంది. దాడి వెనుక వామపక్ష విద్యార్థి సంఘాల హస్తం ఉందని, ఢిల్లీ పోలీసుల విచారణలో ఈ విషయం స్పష్టమైందని కేంద్ర మంత్రి ప్రకాశ్ జవడేకర్ వ్యాఖ్యానించడం.. విమర్శలు, ప్రతి విమర్శలకు దారితీసింది. పోలీసులను ప్రభుత్వం ప్రభావితం చేసిందని కాంగ్రెస్ ఆరోపించింది. ఢిల్లీ పోలీసులు కేంద్ర హోం మంత్రి అమిత్ షా తొత్తులని సీపీఎం పొలిట్‌బ్యూరో సభ్యురాలు బృందా కారట్ మండిపడ్డారు. తమ అనుబంధ సంఘ విద్యార్థులు నీఏఏ నిరసనలకు నేతృత్వం వహిస్తుండటంతో దాని నుంచి దృష్టి మళ్లించేందుకే ఇలాంటి ఆరోపణలు చేస్తున్నారని సీపీఐ ప్రధాన కార్యదర్శి డి.రాజా వ్యాఖ్యానించారు. మరో కేంద్ర మంత్రి స్మృతి ఇరానీ స్పందిస్తూ.. లెఫ్ట్ పార్టీల 'ముసుగు' తొలగిందని వ్యాఖ్యానించారు. కొత్తవారు చేరకుండా అలజడి సృష్టించేందుకు మూకను పంపారని అన్నారు. హింసకు పాల్పడినట్లు అనుమానిస్తున్న 9 మంది ఫొటోలను పోలీసులు విడుదల చేశారు. అందులో వర్సిటీ విద్యార్థి సంఘం అధ్యక్షురాలు ఐషే ఘోష్ కూడా ఉన్నారు. మొత్తం 9 మంది అనుమానితుల్లో ఏడుగురు వామపక్ష విద్యార్థి సంఘాల వారు, ఇద్దరు ఏబీవీపీ వారుగా డీసీపీ జాయ్ టిర్కీ తెలిపారు. తమవారెవరూ దాడిలో పాల్గొనలేదని ఏబీవీపీ ప్రకటించగా.. తన పేరు ఉండటాన్ని ఐషే ఘోష్ ఖండించారు. పోలీసులు వీసీ భాష మాట్లాడుతున్నారని వర్సిటీ విద్యార్థి సంఘం ఆక్షేపించింది. ఘటనకు సంబంధించి సీసీ టీవీ ఫుటేజీని భద్రపర్చాల్సిందిగా ఆదేశాలివ్వాలంటూ ముగ్గురు ప్రొఫెసర్లు ఢిల్లీ హైకోర్టును ఆశ్రయించారు.

**వీరే ఆ నిందితులు:** ఐషే ఘోష్, డోలన్ సమంత, ప్రియా రంజన్, సుచేతా తాలూక్‌దార్, భాస్కర్ విజయ్ మెక్, చున్‌చున్ కుమార్. వీరంతా ఎస్ఎఫ్ఐ, ఏఐఎస్ఎఫ్, ఏఐఎన్ఎస్, డీఎస్ఎఫ్ సభ్యులు. మిగతా ఇద్దరు వికాస్ పటేల్, యోగేంద్ర భరద్వాజ్‌ది ఏబీవీపీ.

## దీపిక.. 'హీరో'యిన్

- జేఎన్‌యూ సందర్శనపై ప్రశంసలు.. విమర్శలు
- ఆమె మౌన నిరసన స్ఫూర్తినిచ్చిందన్న రఘురాం రాజన్
- ఛపాక్ సినిమాకు థియేటర్ బుక్ చేసిన అఖిలేశ్

న్యూఢిల్లీ, జనవరి 10: బాలీవుడ్ ప్రముఖ హీరోయిన్ దీపికా పడుకోన్.. జేఎన్‌యూ సందర్శనపై శుక్రవారం ప్రశంసలు, విమర్శలు పెరిగాయి. ఆర్బీఐ మాజీ గవర్నర్ రఘురాం రాజన్ నుంచి.. జేఎన్‌యూ మాజీ విద్యార్థి నేత కన్హయ్య కుమార్ వరకు దీపికాను ప్రశంసించారు. ఆమె మౌన సందర్శన.. తమకు స్ఫూర్తినిచ్చిందని, తన సినిమా విడుదల ప్రమాదంలో పడుతుందని తెలిసినా, దీపికా ఇలా చేయడం ద్వారా దేశంలో న్యాయం, నిజం, స్వేచ్ఛ పరిహాస పదాలు కావని చాటారని రాజన్ పేర్కొన్నారు. కాగా, బీజేపీ నేతల బహిష్కరణ పిలుపు నేపథ్యంలో దీపిక తాజా సినిమా ఛపాక్ సైతం అదే స్థాయిలో వార్తల్లో నిలిచింది. ఛపాక్‌ను తమ కార్యకర్తలు వీక్షించేందుకు సమాజ్‌వాదీ పార్టీ అధ్యక్షుడు, యూపీ మాజీ సీఎం అఖిలేశ్ యాదవ్ లఖ్‌నవూలో ఏకంగా థియేటర్‌ను బుక్ చేశారు. మధ్యప్రదేశ్‌లోని కమల్ నాథ్ ప్రభుత్వం ఆ సినిమాకు పన్ను రద్దు చేసింది. ఢిల్లీలోని దరియాగంజ్‌లో కాంగ్రెస్ నేతలు 920 ఛపాక్ సినిమా టికెట్లు కొని కాలేజీ విద్యార్థులకు పంపిణీ చేయడాన్ని కేంద్ర మాజీ మంత్రి శశి థరూర్ ప్రశంసించారు. కేంద్ర పథకం 'భారత్ కి లక్ష్మి'కి దీపికను బ్రాండ్ అంబాసిడర్‌గా ప్రకటించిన సంగతి గుర్తుచేస్తూ.. అప్పుడు దేశభక్తురాలైన ఆమె జేఎన్‌యూ సందర్శనతో విద్రోహ శక్తి అయ్యారా? అని కన్హయ్య ప్రశ్నించారు. మరోవైపు దీపికా రాజకీయ ఉద్దేశమేంటో ప్రకటించాలని కేంద్ర మంత్రి స్మృతి ఇరానీ డిమాండ్ చేశారు. మహిళలను దారుణంగా హింసించిన, విభజన వాదుల వైపు ఆమె నిలుస్తారని తాను ఊహించలేదని అన్నారు. దీపికా కాంగ్రెస్ మద్దతుదారుగా 2011లోనే తేలిందని స్మృతి ఆరోపించారు. ఇదంతా ఛపాక్ ప్రచారం కోసమేనని అసోం మంత్రి హిమంత విశ్వశర్మ వ్యాఖ్యానించారు.

వీడియో చిత్రం (ఫైల్)

## ఇరాన్ క్షిపణితోనే కూలిన ఉక్రెయిన్ విమానం

**వీడియో విడుదల చేసిన అమెరికా.. తిరస్కరించిన ఇరాన్**

వాషింగ్టన్/టెహ్రాన్, జనవరి 10: ఉక్రెయిన్ విమానాన్ని ఓ క్షిపణితో ఇరానే కూల్చేసినట్లు అమెరికా, మరికొన్ని పశ్చిమదేశాలు నిర్వహించిన ఓ వీడియోను విడుదల చేశాయి. దీని ప్రకారం.. టెహ్రాన్ సమీపంలోని ఇమామ్ ఖొమైనీ అంతర్జాతీయ విమానాశ్రయం నుంచి 176 మంది ప్రయాణికులతో గగనతలంలోకి వెళ్లిన ఆ విమానాన్ని ఓ ప్రొజెక్షైల్‌పై నుంచి ప్రయోగించిన క్షిపణి సూటిగా ఢీకొట్టింది. ఆకాశంలో అది ఢీకొట్టిన క్షణంలో ఓ మెరుపు కనిపించింది. అనంతరం విమానం భారీ శబ్దంతో పేలిపోయి పతనమైంది. ఈ వీడియోను అక్కడకు సమీపంలోని పరన్డ్ అనే ప్రాంతంలో చిత్రీకరించారు. విశేషమేమంటే ఇరానియన్ల నుంచే ఈ వీడియో బయటకు వచ్చింది. జియోలొకేషన్ టెక్నాలజీతోనూ, ఇతర సాంకేతిక పరిజ్ఞానంతోనూ ఈ వీడియోను, లొకేషన్‌ను బెలింగ్టన్ అనే స్వతంత్ర పరిశోధక సంస్థ పరిశీలించింది. ఇది నిజమేనని ధ్రువీకరించింది. నారిమన్ ఘరీబ్ అనే ఇంటర్నెట్ రిసెర్చర్ ఈ వీడియోను ఓ వ్యక్తి నుంచి సంపాదించి దానిని న్యూయార్క్ టైమ్స్, సీఎన్ఎన్‌లకు పంపాడు. అటు అమెరికా, కెనడా కూడా తమ ఉపగ్రహ సాంకేతిక పరిజ్ఞానంతో దీన్ని సరిపోల్చి మాసి ధ్రువీకరించాయి. అయితే ఇది ఉద్దేశపూర్వకంగా ఇరాన్ చేసిన విద్రోహ చర్య అని అమెరికా, బ్రిటన్, కెనడా సహా ఏ దేశమూ చెప్పలేదు. ఆ విమానాన్ని ఓ శత్రు విమానంగా పరిగణించి పొరపాటున కూల్చేసి ఉంటారని వ్యాఖ్యానించాయి. కాగా- తమ క్షిపణి వల్లే ఉక్రెయిన్ విమానం కూలిందన్న వాదనలను ఇరాన్ అంగీకరించలేదు. సాంకేతిక కారణం కావొచ్చని ఇరాన్ పౌరవిమానయాన శాఖ చీఫ్ అబెద్‌జాదీ పునరుద్ఘాటించారు. స్వతం